అంబేడ్కర్ ఆలోచన



# ఆంగ్లేయ పాలకులు అంటరానివాళ్లు

CI

# ఆంగ్లేయ పాలకులు అంటరానివాళ్లు

డా॥ బి.ఆర్. అంబేడ్కర్

తెలుగు
యాజ్ఞి

హైదరాబాద్ బుక్ ట్రస్ట్
సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్

వెల : రూ. 40/-
ఆంగ్లమూలం : The Untouchables and the Pax Brittanica
Dr. Babasaheb Ambedkar, Writings and
Speeches, Vol. 12, Part II
ప్రథమ ముద్రణ : జూలై 2005
పునర్ముద్రణ : 2013, 2015
ప్రతులకు, వివరాలకు : హైదరాబాద్ బుక్ ట్రస్ట్,
ప్లాట్ నెం. 85, బాలాజీ నగర్,
గుడిమల్కాపూర్, హైదరాబాద్ - 500 006.
ఫోన్ : 23521849
www.hyderabadbooktrust.blogspot.com
: సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్,
3-4-142/6, ఫస్ట్ ఫ్లోర్, బర్కత్‌పుర,
హైదరాబాద్ - 27, ఫోన్: 23449192

---

ముద్రణ : అనుపమ ప్రింటర్స్, గ్రీన్ వ్యూ, 126 శాంతినగర్,
హైదరాబాద్ - 28 ఫోన్ : 23391364, 23304194
Email: anupamaprinters@yahoo.co.in

# 'అంబేడ్కర్ ఆలోచన' ఆవిష్కరణ

డా॥ బి.ఆర్. అంబేడ్కర్ రచనలు, ప్రసంగాలు, నివేదికలు భారత సమాజ గతిలోనే కొత్త శకానికి నాందిపలికాయి. కులాల దొంతరలో అట్టడుగున పడిపోయి, తరతరాలుగా అవమానాలకు, అన్యాయాలకు, అకృత్యాలకు, అమానుషాలకు బలైపోయిన అంటరాని కులాల విముక్తి ప్రధాతగా అంబేడ్కర్ అందరికి తెలుసు. అయితే ఆయన భావాలు, ఆలోచనల లోతులు చాలా తక్కువ మందికి తెలుసు. సమకాలీన సమాజ ఆర్థిక, రాజకీయ, సామాజిక, చారిత్రక, సాంస్కృతిక, మత పరమైన అంశాలన్నింటిని ఆయన తడిమారు. కేవలం పైపైన మాత్రమే తాకి వదలలేదు. సమగ్రమైన పరిశోధన స్వభావం ఆయన సొంతం.

అయితే ఇటువంటి విషయాలు ఇంతకు ముందే చెప్పినట్టు కొద్దిమందికే తెలుసు. ఇందులో కూడా ఎక్కువగా దళితులలోని విద్యావంతులే అధికం. వారి సంఖ్య కూడా చాలా తక్కువే. వాళ్ళకు కూడా కొన్ని విషయాలు మాత్రమే తెలుసు. దళితులు కాని వారు అంబేడ్కర్ ప్రతిభను, ఆయన రచనలను కావాలనే విస్మరించారు. ప్రగతిశీలురుగా పేరొందిన వారు కూడా ఆయనను అధ్యయనం చేయడానికి ఆసక్తి చూపలేదు. ఆయన రచనలకు ప్రాముఖ్యత నివ్వలేదు. విమర్శనాత్మకంగానైనా పరిశీలించాలనుకునే వారికి కూడా ఆయన రచనలు అంతగా అందుబాటులో లేవు. సంపుటాలుగా ఇంగ్లీషులో, తెలుగులో ప్రభుత్వాలు అచ్చువేశాయి. కానీ అవి మాత్రమే సరిపోవు. ఇంకా విస్తృతంగా వాటిని ప్రచారంలోకి తేవాలి. పాఠకుల సౌలభ్యం కోసం వాటిని చిన్న చిన్న పుస్తకాలుగా తీసుకొచ్చి ఎక్కువ మంది జనంలోకి తీసుకెళ్ళాలి. అంబేడ్కర్ రచనలను ఎన్నో రకాల విషయాల కింద విభజించవచ్చు. ఆ విధంగా చిన్న చిన్న పుస్తకాలుగా తీసుకు రాగలిగితే పాఠకులకు వాటి అధ్యయనం పట్ల ఆసక్తి పెరుగుతుందని, విద్యావంతులకు, సామాజిక కార్యకర్తలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని భావిస్తున్నాం. ఇటువంటి ప్రయత్నాలు గతంలో కూడా కొన్ని జరిగాయి. మరికొన్ని సంస్థలు, సొసైటీలు, ట్రస్ట్‌లు ఇప్పటికే అప్పుడప్పుడు ఇటువంటి పుస్తకాలు ప్రచురిస్తున్నాయి.

అయితే నిరంతరంగా, ఒక కార్యక్రమంగా ఈ ప్రయత్నాలు తెలుగు పాఠకుల ముందుకు తేవాలని హైదరాబాద్ బుక్‌ట్రస్ట్ (HBT), సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ (CDS) సంస్థలు సంయుక్తంగా 'అంబేడ్కర్ ఆలోచన' సిరీస్ పేరుతో ఈ పుస్తకాల ప్రచురణను కొనసాగించాలని భావిస్తున్నాయి. ఇందులో అంబేడ్కర్ స్వయంగా చేసిన రచనలతో పాటు, అంబేడ్కర్ ఆలోచనను ప్రతిబింబించే గత, వర్తమాన పరిస్థితులకు అద్దం పట్టే ఇతరుల రచనలను కూడా భాగం చేయాలని ఆశిస్తున్నాయి. ఈ ప్రయత్నంలో తెలుగుపాఠకుల, సామాజిక ఉద్యమ కార్యకర్తల దళితేతర విద్యావంతుల, ప్రజాస్వామిక వాదుల సహకారాన్ని ఆశిస్తున్నాం. మా ఈ కార్యక్రమంలో సూచనలు, సలహాలు, ఇతర రకాలైన సహాయాలు అందించి భాగస్వాములు కావాలని హృదయపూర్వకంగా కోరుతున్నాం.

అభినందనలతో
**హైదరాబాద్ బుక్‌ట్రస్ట్ (HBT)**
**సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ (CDS)**
హైదరాబాద్.

# I

(ఈ రాతప్రతి, అణగారిన వర్గాలను బ్రిటిష్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన విషయంపై 123 పేజీల్లో టైపు చేసి సమర్పించిన నివేదిక. ప్రభుత్వం వీళ్లను సాయుధ దళాల సభ్యులుగా కూడా చేర్చుకోలేదు. మొదటి పేజీ కనిపించకుండా పోయిన ఈ రాతప్రతిని, రౌండ్‌టేబుల్ సమావేశం కోసం లండన్‌లో వున్న కాలంలో డా॥ అంబేడ్కర్ సిద్ధం చేశారని ఆయన జీవిత చరిత్రను మరాఠీలో రాసిన సి.బి. ఖైర్మోడ్ ప్రకటించారు.

ఆ రాతప్రతిని ఇక్కడ యథాతథంగా ప్రచురిస్తున్నాం - సం॥)

అమెరికా ఖండానికి* చెందిన ఆయన చేసిన సముద్రయానంలోగల అసలు ఉద్దేశం భారత దేశాన్ని చేరుకోవటం. కొలంబస్ మొదలు పెట్టిన ఈ ప్రయాణం హఠాత్తుగా జరిగిందేమీ కాదు. పోర్చుగల్‌ను నలభై రెండు సంవత్సరాలు (1418-1460) పాలించిన యువరాజు హెన్రీ తన పరిపాలనా కాలంలో భారతదేశం చేరుకోవటానికి అనువైన సముద్రమార్గాన్ని అన్వేషించటంలో అన్ని రకాలుగా సహాయ పడ్డాడు. ఒక పథకం ప్రకారం జరిగిన ఈ పనికి ప్రేరణ ఇతడే.

యూరప్ నుండి భారతదేశానికి ఒక ప్రత్యక్ష సముద్రమార్గాన్ని అన్వేషించటంలోగల అవసరం పోర్చుగీస్, డచ్, ఫ్రెంచ్, ఇంగ్లీషు వాళ్లందర్నీ తమ ఒంటరి ప్రదేశాలను వదిలి ముందుకు సాగేట్టు చేసింది.

ఇంగ్లీషువాళ్లు ఈ దేశానికి రావటం ఒంటరి సాహసయాత్ర కాదు. ఇది అందరూ కలిసి చేసిన పని. పైగా యూరప్‌లోని అన్ని దేశాలూ తమలో ఏది ముందుగా భారతదేశాన్ని చేరుకుంటుందో చూద్దాం అన్నట్టు పోటీ పడ్డాయి. ఎందుకంటే, పోర్చుగీసువాళ్లు ఇక్కడికి మొదటగా చేరుకున్నా, మిగతాదేశాలూ ఇదే ఉద్దేశంతోటే వెంటవెంటనే పనిగట్టుకొని చేరుకున్నాయి. ఇంగ్లీషు, డచ్ వాళ్లు భారతదేశం చేరుకోవటానికి 'కేప్ ఆఫ్ గుడ్ హోప్' కన్నా దగ్గరిదారి వుందన్న నమ్మకంతో వున్నారు. వీళ్లు ఈ దేశానికి చేరుకోవటంలో జరిగిన ఆలస్యానికి కారణం ఈ దగ్గరిదారి కనుక్కోవటానికి అవకాశాలను వెతుకుతూ తీరిక లేకుండా వుండటమే. ఫ్రెంచివాళ్లు ఇక్కడికి ఆఖరుగా చేరుకున్నా పోర్చుగీసువాళ్ల తర్వాతే చేరుకున్నారు. వీళ్లు 1529లో సముద్ర మార్గం ద్వారా సుమత్రా చేరుకున్నారు.

---

*ఈ రాతప్రతిలో ముందు భాగాలున్న మొదటి పేజీ కనిపించటం లేదు. ఈ వ్యాసానికి వుండిన శీర్షిక కూడా ఎక్కడా కనిపించలేదు. ప్రస్తుతం వున్న శీర్షిక బొంబాయిలోని పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ సౌజన్యంతో గ్రహించబడింది.

ఇండియా చుట్టూ వున్న దీవులను చేరుకోవటానికి వీళ్లంతా పడిన ఆరాటంలోగల మూలకారణమేమిటి? భారతదేశాన్ని చేరుకోవటానికి కొన్ని వందల ఏళ్లపాటు ఎన్నో వ్యయప్రయాసలకోర్చి పోర్చుగీసువాళ్లు, స్పానియార్డులు, ఇంగ్లీషువాళ్లు, ఫ్రెంచివాళ్లు, డచ్ వాళ్లు ఒకరికొకరు ఎందుకు పోటీ పడ్డారు? విలాస వస్తువులతో పాటు, భారతదేశమూ మిగతా తూర్పు దేశాల్లో మాత్రమే దొరికే సుగంధ ద్రవ్యాలు, మిరప, చెక్క, వేరుశనగ మొదలైన వాటిని దోచుకొని పోవటమే వీళ్ల రాకలో వున్న అసలు ఉద్దేశం.

వీళ్ల మధ్య వున్న పోటీ సుగంధ ద్రవ్యాల కోసమే అంటే చాలా వింతగా అనిపించవచ్చు. కానీ, ఇక్కడ జరిగిన యూరప్ విస్తరణలో సుగంధ ద్రవ్యాలు చాలా ముఖ్యపాత్ర పోషించాయి. ప్రొఫెసర్ షేనీ[1] సేకరించిన ఈ కింది డేటాలో 15, 16 శతాబ్దాల్లో యూరప్ ప్రజలు సుగంధ ద్రవ్యాలను ఎంతగా ఉపయోగించిందీ, ఇష్టపడిందీ చూడవచ్చు.

"వంటల్లో ఉపయోగించిన ఈ సుగంధ ద్రవ్యాలు (మసాలా దినుసులు) మధ్య యుగాలనాటి విలాస వస్తువుల్లో కెల్లా ముఖ్యమైనవి. రకరకాల ఫలరసాలతో కలిపి మత్తు పానీయాలతో పాటు వీటిని నిరంతరం ఉపయోగించారు. సర్థోపా రాసిన 'ఫారెస్ట్ గ్ర్యూ'లో, "ఫ్రాయ్‌జార్ట్ రాజుగారి అతిథులను "వారి కోసం ద్రాక్ష సారా, సుగంధ ద్రవ్యాలు సిద్ధంగా వుంచిన భవంతి"కి తీసుకొని పోయాడు. 1224లో మార్సయిల్స్ అమ్మాయి తరపున ఇచ్చిన కట్న కానుకల్లో "పోకలు, అల్లం, యాలకులు" మొదలైన వాటి ప్రస్తావన వుంది.

"భూస్వాములకు, రైతులకు మధ్య వున్న తేడాను స్పష్టంగా చెప్పాలనుకున్నప్పుడు "వాళ్లకు ద్రాక్ష సారా, సుగంధ ద్రవ్యాలు, మంచిరొట్టె వుంటే, మాకు కేవలం ముతక ధాన్యం మాత్రమే వుంది" అని జాన్‌బాల్ చెప్పాడు. కొంతమంది తమ స్నేహితులకు గుర్తుగా పోకచెక్కలను కూడా బహూకరించారు.

ఈ సుగంధ ద్రవ్యాల్లో కెల్లా అత్యంత విలువైనవి, ఎక్కువగా ఉపయోగించినవి అయిన మిరియాలను డబ్బుకు బదులుగా ఇచ్చే బహుమానంగా కూడా భావించారు.

"మెటెల్డా డి ఛాసర్ భూమి విలువ ఎనిమిది పౌండ్లు, ఒక పౌండ్ మిరియాలు, ఒక పౌండ్ చెక్క, ఒక ఔన్సు పట్టు" అని పాత కాలం నాటి ఇంగ్లీషు వాళ్ల సర్వేలలో నమోదై వుంది. ఈ సుగంధ ద్రవ్యాల విలువ, వినియోగం ఆశ్చర్యం కలిగించేవిధంగా వున్నాయి. వెనీషియన్, జినోస్ నావలు, మధ్యధరా సముద్రంలో తిరిగే నౌకలు వీటిని పశ్చిమం వైపు ఎక్కువగా తీసుకొచ్చాయి. వీటిని అన్ని చోట్లా సంతల్లో, బజార్లలో అమ్మకానికి పెట్టారు. జర్మనీలో రైన్ నది మీదుగా వెళ్లే రవాణా సరుకుల్లో మిరియాలను కొల్లగొట్టటం ఒక ఘనకార్యంగా చెప్పుకునేవారు. ఈజిప్టు సుల్తాన్

[1] European Background of American History P. 10-11

నుండి ప్రతి ఏటా 4,20,000 పౌండ్ల మిరియాలను కొనుగోలు చేసే విధంగా వెనీషియన్లు చాలా కాలంపాటు ఒక ఒప్పందం కూడా కుదుర్చుకున్నారు. మొదటిసారి భారతదేశానికి వెళ్లిన నౌకల్లో ఒకటి 2,10,000 పౌండ్ల మిరియాలు మోసుకొచ్చింది. 1520లో భారతదేశానికి చెందిన చిన్న యువరాజుకు పోర్చుగీసు వాళ్లు 2,00,000 పౌండ్లు జరిమానాగా విధించారు. ఆటపాటల్లో, వంటల పుస్తకాల్లో, వ్యాపార పట్టికల్లో, ఆచార వ్యవహారాల్లో ఈ సుగంధ ద్రవ్యాల ప్రస్తావన ఎక్కువగా వుంది.

ఆ రోజుల్లో యూరోపియన్ ప్రజలకు సుగంధ ద్రవ్యాలు అంతగా ఎందుకు అవసరమయ్యాయి? ఒక జవాబు రుచి. "మొహం మొత్తిన ఆహారపు అలవాట్లు, నాసిరకం తిండి, మధ్య యుగాలనాటి యూరోప్‌లో నైపుణ్యం లేని వంటకాల్లో వుండిన అన్ని లోపాలూ తూర్పు దేశాల నుండి తెచ్చుకున్న దినుసుల వల్ల బైటి ప్రపంచానికి తెలియలేదు.[1] అందరికీ అది రుచికి సంబంధించినసమస్య అయితే, పేదవాళ్లకు అవసరానికి సంబంధించిన సమస్య. ప్రాచీన కాలంలో ఆహారానికి కొరత వుండినప్పుడు, యంత్ర పరిజ్ఞానం లేని రోజుల్లో మనిషి ఉత్పాదకత చాలా తక్కువగా వుండేది. ఆహార పదార్థాలు తొందరగా చెడిపోయే పరిస్థితి వుండటం వల్ల వాటిని వృధా చేయటానికీ, పారవేయటానికీ అవకాశముండేది కాదు. ఏమి మిగిలినా, వెంటనే తినే అవసరం లేకపోయినా ఆహారాన్ని నిల్వ చేయవలసి వచ్చేది. సుగంధ ద్రవ్యాలనైతే బాగా నిల్వ చేసుకోవచ్చు. దీనివల్ల రుచికరమైనవనే కారణం వల్ల మధ్య యుగాలనాటి యూరోప్‌లో సుగంధ ద్రవ్యాలకు అన్నిచోట్ల గిరాకీ వుండేది.

భారతదేశం చేరుకొని సుగంధ ద్రవ్యాలను సొంతం చేసుకోవటానికి ఈ యూరోపియన్ దేశాలకు ఒక ప్రత్యక్ష సముద్రమార్గం ఎందుకు అవసరమైంది అన్నది మరో ప్రశ్న. యూరోపియన్ దేశాలు కేప్ ఆఫ్ గుడ్ హోప్ మీదుగా భారతదేశాన్ని చేరుకోవటానికి సముద్ర మార్గం కనిపెట్టక ముందు, మూడు భూ మార్గాలు ఎక్కువగా ఉపయోగంలో వుండేవి. ఉత్తర, మధ్య, దక్షిణ మార్గాలుగా పేరు గాంచిన ఈ మార్గాల గుండానే విలాస వస్తువులు, సుగంధ ద్రవ్యాలు యూరోప్‌కు తరలించబడేవి.

ఉత్తర మార్గం గోబీ ఎడారికి అడ్డంగా పశ్చిమం వైపు చైనాలోని ప్రాంతీయ రాజ్యాల నుండి విస్తరిస్తూ దూర ప్రాచ్యానికీ పశ్చిమానికీ మధ్య వుండేది. దక్షిణం వైపు ఆకాశాన్ని అంటే పర్వతాల నుండి లాప్ సరస్సు వరకూ వుండి ఖోటాన్, యార్ఖండ్, కష్గర్, సమార్క, బొఖారా మొదలైన ప్రాంచీన నగరాలను కలుపుతూ ఈ దారి చివరికి కాస్పియన్ సముద్ర ప్రాంతం చేరుకునేది. ఈ ప్రధాన ఉత్తరమార్గం హిమాలయాలు, హిందూకుష్ పర్వత కనుమలు దాటి వచ్చే మిగతా దారులతో కలిసి ఒక మహా ప్రవాహంలా మారి భారత, చైనా దేశాల సరుకులను తరలించటానికి అనువుగా వుండేది. చైనా గోడకూ కాస్పియన్ సముద్రానికీ మధ్య వుండే ఈ దారిలో ఎడారి, కొండలు కనుమలు దాటుకుంటూ ప్రయాణం చేయటానికి ఎనభై నుండి వంద రోజులు పట్టేది. ఉత్తర భాగం నుండి

1. షేనీ. ఇబిడ్ పే. 10

ఇంకా ముందుకు చైనాలోని ఒక సమాంతర రోడ్డు ఎడారి, కొండలు, బల్యాష్ సరస్సు వెంట ఉత్తరం వైపున ఈ దారిలో కలిసేది. కాస్పియన్ సముద్రానికి తూర్పు భాగంలో వుండిన ఈ దారి చాలా పాతది. జనంతో రద్దీగా వుండేది. సరుకులు తీసుకొని పోయే దారులు మళ్లీ ఇక్కడే విడిపోయేవి. కొన్ని దారులు నైరుతివైపు వెళ్లేవి. పైన చెప్పినట్టు ఈ దారులు అక్కడే సరుకుల రవాణాకు కేంద్రాలుగా వున్న ఎన్నో దారుల్లో కలిసేవి. చిట్టచివరికి ఈ దారులన్నీ ఆసియా మైనర్, సిరియాల గుండా నల్ల సముద్రం, మధ్యధరా సముద్రాలను చేరుకునేవి. మిగతా భూ మార్గాలు కాస్పియన్ ఉత్తర తీర ప్రాంతాన్ని చుట్టుకుంటూనో, దాటుతూనో ఇంకా కొంచెం ముందుకు వెళ్లి అస్త్రఖాన్ వద్ద చేరుకునేవి. అస్త్రఖాన్ నుండి ఓల్గా వెంట, మిగతా నదులు దాటుతూ వెళ్లే ఈ దారి డాన్ నదీ ముఖానికి దగ్గర్లో టానా వద్ద నల్ల సముద్రంలోనో క్రిమియాలోని కఫా దగ్గరో కలిసేది.

మధ్య భాగంలోని మార్గం మెసపొటేమియా, సిరియాల గుండా మధ్యధరా సముద్రం తూర్పు భాగానికి చేరుకునేది. భారతదేశం నుండి బయలు దేరే నౌకలు ఆసియాటిక్ తీరం వెంట పర్షియన్ గల్ఫ్‌కు గుట్టు చప్పుడు కాకుండా ప్రయాణించి కుప్పలు తెప్పలుగా తెచ్చుకున్న తమ ఖరీదైన వస్తువులను చాల్డియాలోని సంతల్లోనో యూఫ్రేటస్ దిగువ భాగంలోనో అమ్ముకునేవి. వాణిజ్య నగరాలను కలిపే ఒకదారి గల్ఫ్ ముకానికి దగ్గర్లోని ఆర్మజ్ నుండి బసోవా వరకు తీరాల వెంట విస్తరించి వుండేది. దాని పైభాగంలో, సరుకులను అమ్మకానికి తీసుకొనిపోయే నౌకలకు స్వాగతం పలికే రేవులుగా వుండిన ఎన్నో కోస్తా నగరాలు, తూర్పు వైపు నుండి డేరా బళ్లు ప్రయాణించే దారుల్లో కలుస్తూ వాటికి గమ్యస్థానాలుగా కూడా వుండేవి. పర్షియాలోని వివిధ సంస్థానాలను అనుసంధానిస్తూ ఈ రవాణా మార్గాలు ఆఫ్ఘనిస్తాన్ లోని కనుమల గుండా ఉత్తర భారత దేశంలోకి చేరుకునేవి. పర్షియన్ గల్ఫ్ పై భాగం నుండి ఈ దారి చీలిపోయి, టైగ్రిస్ నుండి బాగ్దాద్‌కు చేరుకునే దారివెంట వెళ్లేది. సరుకులు ఈ చోటు నుండి డేరా బళ్ళలో కుర్దిస్తాన్ గుండా ఉత్తర పర్షియా రాజధానీ నగరమైన టబ్రిజ్‌కు, అక్కడి నుండి పశ్చిమం వైపు నల్ల సముద్రానికో మధ్యధరా సముద్రంలోని లయాస్‌కో తరలించబడేవి. మరోదారి ఒంటెలు వెళ్లే దారిని అనుసరించేది. బసోరా నుండి బయలుదేరి గరుకుదారుల్లో ఎడారి గుండా పశ్చిమం వైపుగా విసనకర్ర విప్పినట్టు అన్ని వైపులా పరచుకొని సిరియన్ నగరాలైన అలెప్పో, ఆంటిమోచ్, డెమాస్కస్ చేరే వరకూ ఒంటెలు ప్రయాణించేవి. చివరికి ఈ దారులన్నీ లావోడిసియా, ట్రిపోలి, బీరుట్ లేదా జాఫా వద్ద మధ్యధరా సముద్రాన్ని చేరుకునేవి. అయితే కొన్ని సరుకులు మరీ దక్షిణ భాగంలో వున్న అలెగ్జాండ్రియాకు కూడా తరలించబడేవి.

దక్షిణ మార్గం ఒక సముద్ర మార్గం. అయితే, కొత్తగా ఏర్పాటు చేసిన రవాణా స్థానాలను ఇక్కడ మినహాయించాలి.

దూరప్రాచ్యం, భారతదేశాల సరకులు నైలూ నదీ ముఖం నుండి యూరోప్‌కు చేరుకోవటానికి ఎర్ర సముద్రం గుండా వెళ్లే ఈ దారిలోనే ఈజిప్టుకు తరలించబడేవి.

భూమార్గాలు అడ్డదారులుగానూ ప్రమాదకరంగానూ వుండేవి. ఈ దారుల్లో ప్రయాణించటానికి తగినంత భద్రత లేకపోగా, సరుకులు రవాణా చేయాలంటే ఎన్నో కష్టనష్టాలను భరించాల్సి వచ్చేది. ప్రమాణాలను మించి ప్రభుత్వాలు పన్నులు విధించిన వర్తకులను దోపిడీ దొంగలు దోచుకునేవారు. రెండు భూమార్గాల్లో మధ్య మార్గం కొంతవరకూ రహదారి అయినట్టు ఉత్తర మార్గం కాదు. ఈ దారిలో ఒంటెల మీద సాగించే ప్రయాణం ప్రాణాంతకంగా వుండటం వల్ల కొద్ది పరిమాణంలో మాత్రమే సరుకులు రవాణా అయ్యేవి. ఇందువల్ల, మధ్య మార్గానికి వుండిన ప్రాముఖ్యత ఈ ఉత్తర మార్గం సంతరించుకోలేదు. ఈ మధ్య మార్గం లేదా ఇండో - సిరియన్ మార్గం కూడా అన్నివేళలా తెరిచి వుండేది కాదు. ఈ దారిని రెండు సార్లు మూసివేశారు. సారసెనిక్ అరబ్బులు ఇస్లామిక్ విజయ కాంక్షతో ఈ ఇండో - సిరియన్ మార్గం కూడా అన్నివేళలా తెరిచి వుండేది కాదు. ఈ దారిని రెండు సార్లు మూసివేశారు. సారసెనిక్ అరబ్బులు ఇస్లామిక్ విజయ కాంక్షతో ఈ ఇండో-సిరియన్ మార్గంలోని దేశాలను చేజిక్కించు కున్నప్పుడు క్రీ.శ. 632-651 మధ్య కాలంలో మొదటి సారి దీన్ని మూసి వేశారు. రెండోసారి, 11వ శతాబ్దంలో మత యుద్ధాలు జరుగుతున్న కాలంలో మూసివేశారు. చాలా వరకు సముద్ర మార్గమైన దక్షిణ మార్గం అంతే సమానంగా ఏ మాత్రమూ భద్రత లేనిది. హిందూ మహా సముద్రంలోనూ దాని పక్కనే వున్న జిల్లాల్లోనూ పుట్టే తుఫాన్లు బలహీనంగా వుండే తూర్పు దేశాల నౌకలను ఛిన్నాభిన్నం చేసేవి. ఇలాంటి సమయంలో నౌకల్లో వుండే సరుకులను దొంగిలించి సొంతం చేసుకోవటంలో పోటీ వుండేది. సొంత దేశాల్లోని సంతల్లో కంటే రేవుల చెల్లింపులే ఎక్కువగా వుండేవి.[1] ప్రొఫెసర్ షేనీ పరిశీలించినట్టు, "ఇలాంటి అన్ని అడ్డంకుల వల్లా చెప్పుకోతగ్గ పరిమాణంలో తూర్పు దేశాల సరుకులు మధ్యధరా సముద్రానికి చేరుకోలేదు."[2] అయినా ఇవి యూరోపియన్ వర్తకులకు అందుబాటులో వుండేవి.

ఈ భూమార్గాలు ఎప్పుడు ఉనికిలో వుండినాయి, ఎందుకు ఇంకో సముద్రమార్గం అవసరమైంది? ఆసియా ముందు భాగంలో సారసెనిక్ సంస్కృతిని ధ్వంసం చేసి యూరోప్‌తో వ్యాపారాన్ని శాసించిన తురుష్క, మంగోల్ జాతుల ఆవిర్భావం ఈ ప్రశ్నకు సమాధానం. హఠాత్తుగా హింసాత్మకంగా జరిగిన ఈ ఆవిర్భావం అంతకు ముందెన్నడూ లేని కొత్త శక్తి క్రీ.శ. 1038లో రాజ్య కాంక్షతో రగిలిపోతున్న తురుష్కులు పర్షియామీద విరుచుకుపడినప్పుడు మొదటిసారి ఈ కొత్త శక్తి బైట పడింది. రెండు శతాబ్దాల తర్వాత ఛంఘిజ్‌ఖాన్ నేతృత్వంలో మంగోలుల సైన్యాలు ఆసియామీదుగా కవాతు చేశాయి. క్రీ.శ. 1258లో మంగోలుల సైన్యాలు బాగ్దాద్‌ను ఆక్రమించుకున్నాయి. క్రీ.శ. 1403లో తైమూర్ సిరియాను ఆక్రమించుకున్నాడు. క్రీ.శ. 1453లో కాన్‌స్టాంట్‌నోఫిల్ తురుష్కుల హస్తగతమైంది. మంగోలుల, తురుష్కుల ఈ హింసాత్మక ఆవిర్భావం రెండు భూమార్గాలనూ పూర్తిగా మూసి వేసింది. దక్షిణ

1. షేనీ. ఇబిడ్. పేజి. (రాతప్రతిలో ఇవ్వలేదు - సం॥)
2. ఇబిడ్ పేజి -

మార్గం మాత్రం కొంతకాలం పాటు తెరిచి వుండింది. క్రీ.శ. 1516లో తురుష్కులు ఈజిప్టును ఆక్రమించుకోవటంతో దాన్ని కూడా మూసి వేశారు.

యూరోపియన్ దేశాలు భారతదేశానికి రావటానికి ముఖ్యంగా రెండు కారణాలు చెప్పుకోవాలి. మొదటిది, సుగంధ ద్రవ్యాలు. రెండవది మంగోలులు, తురుష్కులు పాతవైన విదేశీ వ్యాపార మార్గాలను మూసి వేయటం. ఈ కారణాలవల్ల యూరోపియన్ దేశాలు భారతదేశం చేరుకోవటానికి సముద్ర మార్గం కనిపెట్టటం కోసం శతవిధాలా ప్రయత్నించి చివరికి సాధించాయి.

తూర్పు ఇండియా దీవులతో జరిపిన వ్యాపారం విషయానికి వస్తే, యూరోపియన్లు ఆ దేశాలను ఆక్రమించుకోవటానికి అక్కడే వుండిపోయారు. అది చివరికి అధికారం కోసం జరిగిన పోరాటంలా పరిణమించింది. ఇంగ్లీషు, పోర్చుగీసు, ఫ్రెంచ్, డచ్ వాళ్ల మధ్య పోరాటం, మరో వాణిజ్యంపైన అధికారం కోసం కూడా జరిగింది. ఇంగ్లీషు వాళ్లకూ పోర్చుగీసు వాళ్లకూ మధ్య జరిగిన యుద్ధానికి భారతదేశం, పర్షియన్ గల్ఫ్ వేదికలుగా మారిపోయాయి. ఈ యుద్ధంలో ఇంగ్లీషువాళ్లు గెలిచారు. భారతదేశంలో జరిగిన యుద్ధం 1612లోనూ పర్షియన్ గల్ఫ్‌లో జరిగిన యుద్ధం 1622లోనూ ముగిశాయి. క్రీ.శ. 1622 నుండి భారతదేశం, పర్షియన్ గల్ఫ్ ఇంగ్లాండుకు సింహద్వారాలుగా మారిపోయాయి. పోర్చుగీసువాళ్లు ఓడిపోవటంతో ఇంగ్లీషువాళ్ల వ్యాపార, వాణిజ్యాల అభివృద్ధికి ఎదురు లేకుండా పోయింది. ఇక ఇంగ్లీషు వాళ్లకూ డచ్ వాళ్లకూ మధ్య జరిగిన యుద్ధానికి వేదిక మలయా ఆర్కిఫిలాగో అయితే, 1823లో ఈ యుద్ధం ఇంగ్లీషు వాళ్లకు వ్యతిరేకంగా ముందే నిర్ణయమైపోయింది. 'మస్కాయిరే ఆఫ్ అంబోయనా'గా పిలవబడిన ఈ చోటు నుండే ఇంగ్లీషు వాళ్లు భారతదేశం చేరుకొని, మలయా ఆర్కిఫిలాగోతో ప్రత్యేకించి వ్యాపారాన్ని అనుభవించమని డచ్ వాళ్లకు వదిలేశారు. ఇంగ్లీషు వాళ్లకు, ఫ్రెంచివాళ్లకు మధ్య భీకరమైన యుద్ధం జరిగింది. భారతదేశ భూభాగం ఈ యుద్ధానికి వేదిక. ఈ యుద్ధం వర్తక వాణిజ్యాల కోసం కాకుండా రాజకీయ సార్వభౌమాధికారం కోసం జరిగింది. ఫ్రెంచివాళ్లు దక్షిణ, తూర్పు భారతదేశ భూభాగాల్లో స్థిరపడ్డారు. దక్షిణ భారతదేశానికి సంబంధించినంత వరకు వీరిద్దరి మధ్య తగాదా 1744లో వాండివాష్ యుద్ధంతో మొదలై 1760లో ముగిసింది. ఈ యుద్ధంలో ఫ్రెంచివాళ్లు పూర్తిగా తుడిచిపెట్టుకొని పోయారు. తూర్పు భారత దేశంలో ఒకే ఒక యుద్ధం జరిగింది. ప్లాసీ యుద్ధంగా పిలవబడిన ఈ యుద్ధంలో ఇంగ్లీషు వాళ్లకు వ్యతిరేకంగా తాము బలపరచిన నవాబుతో సహా ఫ్రెంచి వాళ్లు ఓడిపోయారు. ఫ్రెంచి వాళ్లను నిర్మూలించటంతో భారతదేశ పాలకులుగా ఇంగ్లీషువాళ్లు మాత్రమే మిగిలారు.

★ ★ ★

అయితే, భారతదేశ ప్రజలు తమ దేశాన్ని ఆక్రమించుకోవటాన్ని ఎలా అర్థం చేసుకున్నారు?

★ ★ ★

ఒక కచ్చితమైన దృష్టికోణంలో నుండి చూస్తే, బ్రిటిష్ వాళ్లు భారత దేశాన్ని ఆక్రమించుకోవటం ఆకస్మికంగా జరిగిన ఒక సంఘటన. ఒక సంఘటనగా అయితే దీన్ని విధిరాతలో భాగంగా చెప్పుకోవాల్సి వుంటుంది. ఈ అర్థంలోనే లార్డ్ కర్జన్ తనను తాను సమర్థించుకుంటూ ఇలా అన్నాడు -

(రాతప్రతిలో కొటేషన్ ఇవ్వలేదు - సం॥)

బ్రిటిష్‌వాళ్లు భారతదేశ ప్రజలకు ఏమి చేశారు? నిజానికి ఇది చాలా పెద్ద ప్రశ్న. దీన్ని గురించి చాలా మంది పుంఖాను పుంఖాలుగా రాస్తూనే వున్నారు. వీటికి మరో గ్రంథాన్ని చేర్చటం నా దృష్టిలో అనవసరం. కాబట్టి ఈ పెద్ద ప్రశ్నను నేను ఒక చిన్న ప్రశ్నగా కుదించి, బ్రిటిష్ వాళ్లు ఈ దేశంలోని అంటరానివాళ్లకు ఏమి చేశారు? అని అడుగుతున్నాను. బ్రిటిష్ వాళ్లు తాము పాలకులు అయిన తర్వాత, అంటరానివాళ్లు దాస్య విముక్తులై ఉన్నత స్థితికి చేరుకోవటానికి ఏమి చేశారు? ఈ ప్రశ్నను ఎన్నో రకాలుగా లేవదీయవచ్చు. ఉదాహరణకు, ప్రభుత్వ సర్వీసు, విద్య, సాంఘిక సంస్కరణల గురించి ప్రస్తావిస్తాను.

# II

## దేశంలోని ప్రభుత్వ సర్వీసుల్లో అంటరానివాళ్లకు తగిన ప్రాతినిధ్యం కల్పించటానికి బ్రిటిష్ ప్రభుత్వం ఏమి చేసింది?

ముందుగా సైన్యం విషయం తీసుకుంటాను. అంటరానివాళ్లకు విధించబడిన తలరాతను అర్థం చేసుకొని పరామర్శించటానికి ఒక ప్రశ్న అడగటం అవసరమనుకుంటున్నాను. బ్రిటిష్ వాళ్లు భారతదేశాన్ని ఆక్రమించుకోవటాన్ని సులభతరం చేసిన అంశం ఏమిటన్నదే ఆ ప్రశ్న.

భారతదేశాన్ని ఆక్రమించుకోవటం ఒక అసాధారణ సంఘటన. దీని వెనుక రెండు ముఖ్యమైన కారణాలున్నాయి.

15వ శతాబ్దంలో అకస్మాత్తుగా యూరోపియన్ దేశాలతో సాధారణ సంబంధాలు పెట్టుకోవటానికి ముందుకు వచ్చిన దేశాలన్నిటినీ మూడు విభాగాలుగా చేయవచ్చు. వాస్కోడిగామా కాలుపెట్టిన దేశాలు జనసాంద్రత ఎక్కువగా వుండినవి. ఈ దేశాల్లో ఉనికిలో వుండినరాజ్యాలు ప్రాచీనమైనవే కాక విస్తృతంగా సంఘటితం చేయబడినవి. ఆ దేశాల్లో ఈ రాజ్యాలే ప్రభుత్వాలను నడుపుతుండేవి. రెండవ విభాగం కిందికి వచ్చే దేశాలు కొలంబస్ కనిపెట్టినవి. ఈ దేశాల్లో జనాభా తక్కువగా వుండి రాజ్య స్వభావంలో వెనుకబాటుతనం వుండేది. మూడవ విభాగంలో వుండే దేశాలను కనిపెట్టిన వారు... ఇవి ఏ జనాభాలేని ఖాళీ ప్రదేశాలు. ఈ మూడింటిలో భారత దేశం మొదటి విభాగంలో వుంది. భారత దేశాన్ని ఆక్రమించుకోవటం ఒక అసాధారణ సంఘటన అని చెప్పి తీరాలనటానికి ఇది ఒక కారణం. భారతదేశ ఆక్రమణ జరిగిన

కాలం రెండవ కారణం. ఈ ఆక్రమణ ఎప్పుడు జరిగింది? 1757-1818 మధ్య కాలంలో ఇది జరిగింది.

1757లో ఈస్ట్ ఇండియా కంపెనీ దళాలకూ బెంగాల్ నవాబ్ సిరాజ్-ఉద్-దౌలా సైన్యాలకూ మధ్య ఒక యుద్ధం జరిగింది. ఇందులో బ్రిటిష్ దళాలు గెలిచాయి. చరిత్రలో దీనికి ప్లాసీ యుద్ధమనే పేరు రావటం అందరికీ తెలిసిందే. ఈ యుద్ధ ఫలితంగానే బ్రిటిష్ వాళ్లు మొట్టమొదటి సారి భారతదేశంలో ఒక ప్రదేశాన్ని ఆక్రమించుకున్నారు. ప్రదేశాన్ని ఆక్రమించుకోవటాన్ని పూర్తిచేసిన చివరి యుద్ధం 1818లో జరిగింది. ఇది కోరెగావ్ యుద్ధంగా అందరికీ తెలుసు. ఈ యుద్ధంతో మరాఠా సామ్రాజ్యం ధ్వంసమై దాని స్థానంలో భారత దేశంలో బ్రిటిష్ సామ్రాజ్యం స్థాపించబడింది. ఈ విధంగా 1757 - 1818 మధ్య కాలంలో బ్రిటిష్ వాళ్లు భారతదేశాన్ని ఆక్రమించుకున్నారు. ఈ మధ్య కాలంలో యూరోప్‌లో వ్యవహారాలు ఏ స్థితిలో వుండినాయి? అప్పుడూ ఇంగ్లీషువాళ్ల పరిస్థితి ఎలా వుండింది? ఈ కాలంలో అనిశ్చిత పరిస్థితులతో యూరోప్‌లో చాలా అశాంతికరమైన వాతావరణం నెలకొని వుండింది. నెపోలియన్ యుద్ధాలతో వేడెక్కి వున్న ఈ కాలంలోనే అతనితో చివరి యుద్ధం 1815లో వాటర్లూ వద్ద జరిగింది. ఈ యుద్ధాల్లో ఇంగ్లాండ్ ప్రేక్షకపాత్ర వహించకుండా పూర్తి స్థాయిలో పాల్గొంది. నెపోలియన్నూ ఫ్రెంచి విప్లవాన్నీ అణచి వేయటం కోసం ఏర్పడ్డ యూరోపియన్ రాజ్యాల కూటమికి ఇంగ్లాండ్ అగ్రభాగాన వుండింది. ఈ తీవ్రమైన యుద్ధంలో తమ సొంత భద్రత కోసం ఇంగ్లీషువాళ్లకు ప్రతి పైసా, ప్రతి మనిషీ, ప్రతి నౌకా, ప్రతి బందూకూ అవసరమయ్యాయి. మాతృదేశానికి దూరంగా యుద్ధాల్లో మునిగిపోయిన ఈస్ట్ ఇండియా కంపెనీకి ఇంగ్లాండ్ ఏ రకంగానూ సహాయ సహకారాలు అందించలేకపోయింది. పైగా, యూరోప్‌లో జరుగుతూ వుండిన యుద్ధాల్లో పాల్గొని నెపోలియన్ సైన్యాలను చిత్తు చేయటానికి ఈస్ట్ ఇండియా కంపెనీ నుండి మనుషులు, డబ్బు, నౌకలను తానే బదులు తీసుకుంది. యూరప్‌లో జరుగుతూ వుండిన యుద్ధాల్లో ఇంగ్లాండ్ దేశానికి సహాయ సహకారాలు అందించటానికి ఈస్ట్ ఇండియా కంపెనీ ఎంతగా దోహదం చేసిందీ తెలుసుకోవాలంటే మెక్‌ఫర్సన్ ఇచ్చిన డేటా చూడాల్సిందే.

ఈ కాలంలోనే యూరప్‌లో జరిగిన ఒక భీకర యుద్ధంలో ఇంగ్లీషు వాళ్లందర్నీ నెపోలియన్ తన హస్త గతం చేసుకున్నాడు. ఆ సమయంలో భారతదేశాన్ని ఆక్రమించుకున్న ఈస్ట్ ఇండియా కంపెనీకి మాతృదేశంలోని ఇంగ్లీషు వాళ్లు ఏ విధంగానూ సహాయం చేయలేక పోయారు. ఇందువల్లే, మన దేశాన్ని ఆక్రమించుకోవటం ఒక అసాధారణ సంఘటన. ఈ అసాధారణ సంఘటన ఎలా సాధ్యమైంది? దీనికి వివరణ ఏమిటి?

మెకాలే తన వివరణ ఇచ్చుకున్నాడు. ఆయన అంటాడు:

(కొటేషన్ రాతప్రతిలో ఇవ్వలేదు - సం॥)

మెకాలే ఇచ్చిన వివరణ ఇంగ్లీషువాళ్లందరూ నమ్మేదీ, నమ్మటానికి ఇష్టపడే వివరణే. చాలాకాలం పాటు ఆవేశానికి ఆజ్యం పోస్తూ ఇంగ్లీషువాళ్లు, అందరు యూరోపియన్లూ, అమెరికన్ ప్రజల మనసులపైనా ఈ వివరణ పట్టు సంపాదించింది. ఇందులోని దృష్టి ఇంగ్లీషు యువకుల మనసుల్లో నాటుకొని పోయేట్టు చేయటానికి చాలా గట్టి ప్రయత్నమే జరిగింది. దీన్ని అర్థం చేసుకోవచ్చు. సామ్రాజ్యాన్ని నిర్మించే జాతిని తీర్చిదిద్దటంలో వున్న ముఖ్యమైన అంశం ఆధిక్యతాభావం. మెకాలే దృష్టి మరేదీ చెయ్యలేనంతగా దీన్ని పెంచి పోషించింది.

అయితే మెకాలే దృష్టి సరైందేనా? చరిత్రలోని వాస్తవాలు ఈ దృష్టిని సమర్థిస్తాయా? ఈ విషయాన్ని మెకాలే కన్నా ఎక్కువ వాస్తవికంగా అధ్యయనం చేసిన ప్రొఫెసర్ సీలీ ఇలా అన్నాడు:

"కంపెనీ ఆధిపత్యాన్ని నిర్ణయాత్మకంగా నిరూపించిన ఆర్కాట్, ప్లాసీ, బక్సర్ లాంటి తొలినాళ్ల యుద్ధాల్లో, యూరోపియన్ల కన్నా స్వదేశీ సిపాయిలే కంపెనీ వైపున ఎక్కువగా వున్నట్టు ఎప్పుడూ కనిపిస్తుంది. ఇంకా పరిశీలిస్తూ పోతే, సిపాయిలు యుద్ధం సరిగ్గా చేయలేదని గాని, యుద్ధ భారమంతా ఇంగ్లీషు సైనికులే వహించారనిగాని ఎక్కడా వినిపించదు. బాల్య చాపల్యంతో జాత్యహంకారాన్ని చొప్పించిన చరిత్ర కారుల వ్యాఖ్యానాలను అర్థం చేసుకున్న వాళ్లెవరూ ఈ యుద్ధాలను వర్ణించటంలో మన ఇంగ్లీషు రచయితలు సిపాయిలను తక్కువ చేయటం గమనించి ఆశ్చర్యపోరు. క్లైవ్‌పైన మెకాలే రాసిన వ్యాసం చదవండి. 'సామ్రాజ్యజనులు', 'సాగర వీర కిశోరాలు', 'క్లైవ్‌నూ అతడి ఇంగ్లీషు సైన్యాన్నీ ఎవ్వరూ ఎదుర్కోలేరు' లాంటి పొగడ్తలు ఆ వ్యాసంలో ఎక్కడ చూసినా కనిపిస్తాయి. సంఖ్యలో ఇంగ్లీషు సైనికులకన్నా స్వదేశీ సిపాయిలే ఎక్కువ మంది వున్నారని, వాళ్లు ఇంగ్లీషు సైనికులకు ఏ మాత్రమూ తీసిపోకుండా యుద్ధం చేశారని మనం ఒక్కసారి అర్థం చేసుకుంటే, సహజ సిద్ధమైన ఆధిక్యత కారణంగానే ఇంగ్లీషు సైనికులు విజయం సాధించారనే సిద్ధాంతం పేకమేడలా కుప్పకూలిపోతుంది. ఆ యుద్ధాల్లో పాల్గొన్న మన ప్రతి సైనికుడూ శత్రు సైన్యంలోని పది మందికి సమానం అని చెప్పుకుంటున్నాం. అలాగే ప్రతి ఇంగ్లీషు సైనికుడూ పదిమంది స్వదేశీ సిపాయిల పెట్టు అయినప్పుడు ప్రతి స్వదేశీ సిపాయీ పది మంది ఇంగ్లీషు సైనికుల పెట్టు అని కూడా మనం చెప్పవచ్చు. వీళ్ల మధ్య తేడా వుందనటంలో సందేహం లేదు. అయితే ఈ తేడా క్రమశిక్షణ, సైనిక శాస్త్రం, చాలా సందర్భాల్లో నాయకత్వం విషయంలోనే తప్ప, జాతి విషయంలో కాదు.

భారతదేశాన్ని జయించటంలో ఇంగ్లీషు వాళ్ల పక్షాన సహజమైన ఆధిక్యత ఏమీ లేదని మిల్ ఇచ్చిన సంక్షిప్త వివరణను పరిశీలించండి. భారతదేశాన్ని జయించటం వెనుక రెండు ముఖ్యమైన కారణాలున్నాయి. మొదటిది – 'యూరోపియన్ క్రమశిక్షణ ముందు నిలువలేక పోయిన స్వదేశీ సైన్యాల బలహీనత. రెండవది – 'ఇంగ్లీషు వాళ్ల దగ్గర పనిచేస్తున్న స్వదేశీ సిఫాయిలకు యూరోపియన్ క్రమశిక్షణను అలవర్చటం'. ఈ రెండింటినీ కనిపెట్టింది ఫ్రెంచివాళ్లు' అని కూడా మిల్ రాశాడు.

సిపాయిలకన్నా ఇంగ్లీషు సైనికులే మెరుగ్గా పోరాడారని, ఇద్దరూ కలిసి సాధించిన విజయాల్లో పెద్దవాటాను తెల్లవాళ్లే ఎగరేసుకు పోయారని ఒప్పుకున్నా, భారత దేశంలోని జాతులను ఇంగ్లీషు వాళ్లు సొంతంగా జయించారని చెప్పటం సరైంది కాదు. భారతదేశాన్ని జయించిన సైన్యంలో ఇంగ్లీషువాళ్లు అయిదోవంతు మాత్రమే వున్నారు. ఈ విజయాల గురించి మనం అతిశయోక్తులు చెప్పుకోవటం మాత్రమే కాదు, వాటిని చాలా తప్పుగా అర్థం చేసుకుంటున్నాం. సైన్యంలో నాలుగు వంతులు వున్న మిగతా సైనికులు ఎవరు? వాళ్లు భారతీయులే. దీన్ని బట్టి, భారతదేశాన్ని జయించింది విదేశీయులే అనటం కష్టం. భారతదేశాన్ని జయించింది చాలా వరకు భారతీయులే."[1]

ప్రొఫెసర్ సీలీ ఇచ్చిన వివరణ ఇలాగే సాగితే సరైందే. కానీ, ఇది ఇంతకు మించి ముందుకు సాగటం లేదు. భారతీయులు వుండిన సైన్యం సహాయంతో బ్రిటిష్ వాళ్లు ఈ దేశాన్ని ఆక్రమించుకున్నారు. ఈ వాస్తవాన్ని గుర్తించటం భారతీయులకూ ఇంగ్లీషు వాళ్లకూ ఇద్దరికీ మంచిది. అయితే తమ విదేశీయులైన బ్రిటిష్ సైన్యంలో చేరిన ఈ భారతీయులెవరు? ఈ ప్రశ్న ప్రొఫెసర్ సీలీ లేవనెత్తలేదు. అయితే ఇది సందర్భానికి చాలా తగిన ప్రశ్న. ఈస్ట్ ఇండియా కంపెనీ సైన్యంలో చేరి బ్రిటిష్ వాళ్లు భారత దేశాన్ని ఆక్రమించుకోవటానికి సహాయపడ్డ ఈ ప్రజలు ఎవరు? జాగ్రత్తగా చేసిన అధ్యయనం ఆధారంగా నేను చెప్పగలిగిన సమాధానమేమిటంటే - ఈస్ట్ ఇండియా కంపెనీ సైన్యంలో చేరిన ప్రజలు భారతదేశంలోని అంటరానివాళ్లు. ప్లాసీ యుద్ధంలో క్లైవ్‌తో పోరాడిన వాళ్లు దుసద్‌లు. దుసద్‌లు అంటరానివాళ్లు. కోరెగావ్ యుద్ధంలో పోరాడిన వాళ్లు మాహర్లు. మహర్లూ అంటరానివాళ్లు. ఈ విధంగా మొదటి, చివరి యుద్ధాల్లో బ్రిటిష్ వాళ్ల పక్షాన పోరాడి భారతదేశాన్ని వాళ్లు ఆక్రమించుకోవటానికి సహాయపడింది. అంటరాని వాళ్లే. భారతీయ సైన్యాన్ని పునర్వ్యవస్థీకరించటంపై నివేదిక తయారు చేయటానికి 1859లో నియమించబడ్డ సీల్ కమీషన్‌కు తన అభిప్రాయంగా ట్వీడిల్‌డేల్‌కు చెందిన మార్క్వెస్ ఈ నిజాన్ని పేర్కొన్నాడు. ఆయన చెప్పింది ఇదే -

(రాతప్రతిలో కొటేషన్ ఇవ్వలేదు - సం॥)

బ్రిటిష్ సైన్యంలో చేరటం ఒక దేశద్రోహనేరంగా భావించి అంటరానివాళ్ల శీలాన్ని శంకించేవాళ్లు చాలామంది వున్నారు. దేశద్రోహం అవునో కాదో కానీ అంటరానివాళ్లు ఇలా చెయ్యటం చాలా సహజం. ఒక దేశంలో ఒక వర్గం ప్రజలు తమ దేశీయులు సాగించే అణచివేతల నుండి తమను విముక్తులను చేస్తారనే ఆశతో మాతృభూమిపై దండెత్తి వచ్చే వాళ్లపట్ల సానుభూతి చూపిన ఉదాహరణలు చరిత్రలో కొల్లలు. అంటరాని వాళ్లపై నిందలుమోపే వాళ్లు 17 లో ఇంగ్లీష్ లేబరింగ్ క్లాసెస్ జారీ చేసిన ఈ కింది మేనిఫెస్టో చదివితే - (అసంపూర్తిగా వదలివేయబడింది)

(ముఖ్య భాగాలు రాతప్రతిలో ఇవ్వలేదు - సం॥)

1. సీలీ, ఇంగ్లాండ్ విస్తరణ. (Expansion of England) పేజీ 200 - 202.

అంటరానివాళ్ల వైఖరి ఏ రకంగానైనా ఏక పక్షంగా వుండిందా? ఇంగ్లాండ్‌లోని శ్రామికుడు ఎలాంటి అణచివేతకు గురయ్యాడో ఇక్కడి అంటరానివాళ్లూ అలాంటి అణచివేతకు గురయ్యారు. ఇంగ్లాండ్‌లోని శ్రామికులకు ఒకే విదేశీ చొరబాటు దారునికి స్వాగతం పలికే అవసరముంటే, ఇక్కడి అంటరానివాళ్లకు పందమందికి స్వాగతం పలికే అవసరం వుండింది.

(రాతప్రతిలో ఈ చోటు ఖాళీగా వదిలివేయబడింది - సం॥)

బ్రిటిష్ వాళ్లు భారతదేశాన్ని ఆక్రమించుకోవటాన్ని మాత్రమే కాదు, అది చేజారిపోకుండా వుండటాన్ని కూడా అంటరానివాళ్లు సులభతరం చేశారు. 1857లో జరిగిన తిరుగుబాటు భారతదేశంలో బ్రిటిష్ పాలనను ధ్వంసం చేయటానికి జరిగిన ఒక ప్రయత్నం. అది ఇంగ్లీషు వాళ్లను దేశం నుండి వెళ్లగొట్టి భారతదేశాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవటానికి జరిగిన మొదటి ప్రయత్నం. సైన్యానికి సంబంధించినంత వరకు ఈ తిరుగుబాటుకు నేతృత్వం వహించింది బెంగాల్ సైన్యం[1].

బాంబే సైన్యం, మద్రాస్ సైన్యం విదేశీయులకే విశ్వాసపాత్రులుగా వున్నాయి. వీటి సహాయంతోనే ఈ తిరుగుబాటును అణచివేశారు. బాంబే, మద్రాస్ సైన్యాలలో ఎవరెవరు ఎంతమంది వున్నారు? వాళ్లలో చాలామంది బాంబేలోని మాహార్లు, మద్రాస్‌లోని పేరియాలైన అంటరానివాళ్లే. కాబట్టి భారతదేశాన్ని ఆక్రమించుకోవటానికి మాత్రమే కాదు, ఈ దేశం బ్రిటిష్ వాళ్ల చేజారి పోకుండా కాపాడటానికి కూడా అంటరాని వాళ్లు సహాయపడ్డారని చెప్పటం సరైనదే.

సైన్యంలో వుంటూ చేసిన సేవకు సంబంధించినంతవరకైనా అంటరానివాళ్లను బ్రిటిష్ ప్రభుత్వం ఎలా చూసింది? కొత్తగా కనిపించినా ఒక మాట మాత్రం వాస్తవం. బ్రిటిష్ ప్రభుత్వం సుమారు 1890 నుండీ భారత సైన్యంలో అంటరాని వాళ్లను చేర్చుకోవటంపై నిషేధం విధించింది. దీని ఫలితంగా అంతకు ముందే సైన్యంలో చేర్చుకోబడిన వాళ్లు అలాగే వుండిపోయారు. వీళ్లను తీసివేయక పోవటమే బ్రిటిష్ వాళ్లు చూపించిన గొప్పదయ. అయితే కాలక్రమంలో వాళ్లు చనిపోవటమో పెన్షన్ తీసుకొని వెళ్లిపోవటమో జరిగింది. చివరికి సుమారు 1910కల్లా సైన్యం నుండి పూర్తిగా కనుమరుగయ్యారు. సైన్యం నుండి అంటరానివాళ్లను బైటికి పంపించటమంత దారుణం మరొకటి వుండదు.

నమ్మక ద్రోహమూ విశ్వాసహీనతా వున్నట్టు కనిపించే చర్య బ్రిటిష్ ప్రభుత్వం ఎందుకు తీసుకుంది? సైన్యంలోకి అంటరాని వాళ్లను చేర్చుకోవటంపై నిషేధం విధించటానికి బ్రిటిష్ ప్రభుత్వం ఏ కారణమూ చెప్పలేదు. ఈ బహిష్కరణ ఉద్దేశ పూర్వకంగా చేసింది కాదనీ 1890లో సైన్యంలో సామర్థ్యాన్ని పెంచే ప్రయోజనాన్ని

---

1. "విత్ ఇండియన్స్ ఇన్ ఫ్రాన్" గ్రంథ రచయిత జనరల్ విల్‌కాక్స్ అభిప్రాయం కూడా చూడండి (రాతప్రతిలో పేజీ సంఖ్య ఇవ్వలేదు - సం॥)

దృష్టిలో పెట్టుకొని ప్రవేశపెట్టిన ఒక విధానం పర్యవసానంగా మాత్రమే ఇలా జరిగింది అనే అభిప్రాయం వ్యక్తమైంది. కానీ నిజంగా ఇది అలాగే జరిగిందా?

ఈ విధానానికి ఆధారం రెండు సూత్రాలు. ఒకటి సమీకరణకు సంబంధించినదైతే, మరొకటి సైనికులను చేర్చుకోవటానికి సంబంధించినది. మిశ్రమ జాతుల సైనికులుండే పాత సూత్రానికి వ్యతిరేకంగా ఒకే జాతికి చెందిన సైనికుల కూర్పు వుండే సూత్రంగా తెలిసిన ఈ సమీకరణ సూత్రాన్ని 1890లో ప్రవేశపెట్టారు. ఈ కొత్త సూత్రం కింద, తరగతి పటాలం, తరగతి సైన్యం లేదా కంపెనీ పద్ధతి అనే సూత్రం ఆధారంగా భారత సైన్యాన్ని సమీకరించారు. మొదటి దాని విషయంలో, పటాలమంతా ఒకే తరగతి (లేదా కులం) వాళ్లు వుండేలా కూర్చినది, రెండోదాని విషయంలో ప్రతి సైనిక సమూహమూ లేదా కంపెనీ పూర్తిగా ఒకే తరగతి వాళ్లు వుండేలా ఏర్పాటు చేసినది. పాత పద్ధతిలో అందుబాటులో వున్న ఉత్తమ సైనికుడిని మాత్రమే తీసుకొనేవారు. కానీ అతని జాతి, మతము లెక్కలోకి తీసుకునే వారు కాదు.

ఈ కొత్త సూత్రం ప్రకారం, సైనికుడి మేధస్సు, శరీర ధారుఢ్యం కన్నా అతని జాతి ముఖ్యమైన అంశమైంది. సైనికులను చేర్చుకొనే ప్రయోజనాలకోసం, భారతదేశంలోని వివిధ కులాలు, జన సమూహాలు పోరాట జాతులకు చెందేవిగానూ, పోరాట జాతులకు చెందనివి గాను విభజించబడ్డాయి. పోరాటేతర జాతులను మిలిటరీ సర్వీసు నుండి బైటికి పంపించారు. పోరాట జాతుల విభాగంలో చేర్చిన కులాలు, జన సమూహాలను మాత్రమే సైన్యాన్ని బలోపేతం చేయటానికి తీసుకున్నారు.

ఈ రెండు సూత్రాలనూ ఒప్పుకోవటం కష్టం. తరగతి కూర్పు సూత్రంలో అంతర్లీనంగా వున్న కారణాలు "కచ్చితంగా ఒక మేరకు రాజకీయపరమైనవి, బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన తిరుగుబాటులో (ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం) వ్యక్తమైన ఎలాంటి భయోత్పాతమైన పొత్తునైనా నివారించటానికి ఉద్దేశించినవి." మిశ్రమ జాతుల పటాలముండే పాత పద్ధతే క్షేమకరమని అనుకోవటమే మేలేమో. అసలు ఈ సూత్రంలోనే బలముంటే, ఇది అంటరానివాళ్లను చేర్చుకునే పద్ధతిలోనే ఎందుకు అన్వయించాలి? తరగతి కూర్పు పద్ధతి ప్రకారం సిక్కులు, డోగ్రాలు, గూర్ఖాలు, రాజపుత్రులు మొదలైన వారి సైన్యం వున్నప్పుడు అంటరాని వాళ్ల సైన్యం ఎందుకు లేదు? పోరాట తెగల నుండి మాత్రమే సైన్యంలోకి చేర్చుకునే సూత్రంలో నైనా బలమున్నప్పుడు పోరాటేతర జాతులకు చెందిన వారుగా అంటరానివాళ్లను చూడకుంటే వారి అభివృద్ధికి అది అడ్డుగోడగా నిలిచి వాళ్ల అవకాశాలను ఎందుకు దెబ్బతీయాలి?

(రాతప్రతిలో ఖాళీగా వదిలి వేయబడింది – సం॥)

నూటాయాభై సంవత్సరాలకు పైగా భారత పోరాట దళాల్లో పై నుండి కింది దాకా వుంటూ భారత సైన్యానికి వెన్నెముకగా నిలిచిన అంటరాని వాళ్లను పోరాటేతర జాతులుగా వర్గీకరించటంలో ఏమి న్యాయముంది? బ్రిటిష్ ప్రభుత్వం అంటరాని వాళ్లను పోరాటేతర

జాతులకు చెందినవారుగా గుర్తించలేదని నిరూపించటానికి ఈ వాస్తవం చాలు. గొప్ప గొప్ప యుద్ధాల్లో సైన్యానికి ఎక్కువ మంది మనుషుల అవసరం వచ్చినప్పుడు, సైన్యంలో అంటరానివాళ్లను చేర్చుకోవటంపై నిషేధం ఎత్తివేసి, మూడు ఒకట్ల మాహర్లు అనే పేరుతో పూర్తిగా ఒక పటాలాన్నే సిద్ధం చేశారు. ఈ పటాలం సామర్థ్యాన్ని బహిరంగంగా ఒప్పుకున్న ఆ (....)[1] అవసరం తీరిన వెంటనే అంటరానివాళ్లు సిగ్గుపడి పశ్చాత్తాపపడేంతగా ఈ పటాలాన్ని ముక్కలు చెక్కలు చేశారు.

సర్ అన్నారు.

(రాతప్రతిలో కొటేషన్ ఇవ్వలేదు - సం॥)

ఈ బహిరంగ తీర్పుతో అంటరానివాళ్లు పోరాటేతర జాతి అని ఎవరు అనగలరు?

ఈ రెండు కారణాలవల్లే అంటరానివాళ్లను సైన్యం నుండి బహిష్కరించలేదనటం సుస్పష్టం. అయితే నిజమైన కారణమేమిటి? నా అభిప్రాయంలో, సైన్యం నుండి అంటరానివాళ్లను బహిష్కరించటానికి నిజమైన కారణం వాళ్ళ అంటరాని తనమే. అంటరానివాళ్లు సైన్యంలో చేరటం సమస్య కలిగించనంతవరకూ వాళ్లకు ఆహ్వానం పలికారు. మిగతా కులాలవాళ్లు బ్రిటిష్ సైన్యంలో లేకపోవటం వల్ల, బ్రిటిష్ చరిత్ర మొదటి భాగంలో ఏ సమస్యా కనిపించలేదు.

భారతీయ పాలకులు వున్నంత కాలం వాళ్లు బ్రిటిష్ సైన్యానికి వెలుపలే వున్నారు. భారతీయులు జరిపిన తిరుగుబాటు తర్వాత, భారతీయ పాలకుల జాతిలో గుబులు పుట్టింది. అప్పటికే అంటరాని వాళ్లతో నిండిపోయిన బ్రిటిష్ సైన్యంలోకి హిందువులు ప్రవేశించటం మొదలుపెట్టారు. రెండు గ్రూపులుగా ఏర్పడ్డ అంటరానివాళ్లు, ఇతర కులాల వాళ్ల సాపేక్ష స్థితిని సర్దుబాటు జరిపే సమస్య తలెత్తింది. న్యాయానికీ, సౌకర్యానికీ మధ్య ఘర్షణ వచ్చిన సందర్భాల్లో ప్రతిసారీ సౌకర్యానికి ప్రాముఖ్యత నిచ్చి, అంటరానివాళ్లను శాంతింపజేయటం ద్వారా, వాళ్లకు కృతజ్ఞతలు చెప్పుకునే ఏ అవకాశాన్నీ అనుమతించక పోవటం ద్వారా బ్రిటిష్ ప్రభుత్వం సమస్యను పరిష్కరించింది.

ఈ బహిష్కరణకు కారణాలేవైనా, ఈ బహిష్కరణలో న్యాయమెలావున్నా, ఈ బహిష్కరణ అంటరానివాళ్ల సామాజిక జీవితాన్ని అల్లకల్లోలం చేసిందనే వాస్తవం మాత్రం చెరిగిపోలేదు. జీవనోపాధికీ ఉద్యోగంలో పై స్థాయికి ఎదగటానికీ అంటరానివాళ్లకు సాధ్యమైన ఒకే ఒక సర్వీసు మిలిటరీ సర్వీసు. చాలా మంది అంటరానివాళ్లు ఈ రంగంలో విలువైన సేవలందించటం, వాళ్లలో వందలమంది జమాదార్లు, సుబేదార్లు, సుబేదార్ మేజర్లుగా ఉన్నతహోదాకు ఎదగటం ఒక చారిత్రక సన్నివేశం. అధికారం, ప్రతిష్ఠ, జవాబుదారీ తనం వుండే స్థానాలను వాళ్లకు అందుబాటులో వుంచటం ద్వారా మిలిటరీ ఉద్యోగం వాళ్లకు హిందువుల దృష్టిలో గౌరవాన్నీ ఎంతో కొంత ప్రాముఖ్యతనీ ఇచ్చింది. నూటాయాభై సంవత్సరాలకు పైగా

1. రాతప్రతిలో ఖాళీగా వదిలారు - సం॥

సైన్యానికి సేవలందిస్తూ వుండటం వల్ల, దీన్ని వంశపారంపర్యంగా వస్తున్న వృత్తిగానే భావించారు. ఈ కారణం వల్లే మిగతా ఉద్యోగాలకు అర్హత సంపాదించటంపై వాళ్లు శ్రద్ధ చూపించలేదు. 1890లో, కొత్త పరిస్థితులకు తాము అలవాటు పడటానికి తగినంత సమయం ఇవ్వకుండా, సైన్యానికి వాళ్లు అవసరం లేదని చెప్పారు. మళ్లీ 1935లో ఆంగ్లో - ఇండియన్ల విషయంలో కూడా ఇలాగే జరిగింది. ఈ సర్వీసు మూసివేసిన తర్వాత అంటరానివాళ్లకు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. దీంతో వాళ్లు కోలుకోలేకుండా వెనకబడియారు. అంటరానివాళ్లు పర్వత శిఖరం నుండీ, దేశీయ ప్రభుత్వాల దగ్గర చేతులుకట్టుకొని నిలబడే పాతాళానికి పడిపోయారని చెప్పటంలో ఏమాత్రమూ అతిశయోక్తి లేదు.

మిలిటరీ సర్వీసులోకి అంటరానివాళ్ల ప్రవేశానికి అవకాశమైనా వుండేది. మరి సివిల్ సర్వీసులో ప్రవేశానికి సంబంధించి వాళ్ల స్థితి ఏమిటి? సివిల్ సర్వీసులో ప్రవేశించేవారికి ఉన్నత స్థాయి విద్యార్హత అవసరం. విశ్వ విద్యాలయ పట్టాలు వున్న వారికి మాత్రమే ఇందులో చేరే అవకాశముంటుంది. భారతదేశ జనాభాలో అధిక భాగం చదువురాని వారు అంటరానివాళ్లే. కాబట్టి సివిల్ సర్వీసులో చేరే అదృష్టమే వీళ్లకు లేదు. ఇటీవలి కాలంలో, వాళ్లలో యూనివర్సిటీ పట్టాలు తీసుకున్న మగవాళ్లున్నారు. వాళ్ల తలరాత ఎలా వుంది? వాళ్లు ఇంటింటికీ వెళ్లి బిచ్చమెత్తు కుంటున్నారని చెప్పటంలో అతిశయోక్తి లేదు. వాళ్లు సివిల్ సర్వీసులో అడుగుపెట్టటానికి రెండు అడ్డంకులున్నాయి. మొదటిది, బ్రిటిష్ ప్రభుత్వం వాళ్లకు ఏ రకమైన ప్రాముఖ్యత ఇవ్వటానికైనా తిరస్కరించటం. అంటే దీని అర్థం, సివిల్ సర్వీసులో తగినంత ప్రాతి నిధ్యం వహించని కులాలకు ప్రాముఖ్యతనిచ్చే సూత్రాన్ని బ్రిటిష్ ప్రభుత్వం గుర్తించలేదని కాదు. ఉదాహరణకు, కనీస అర్హత వున్న మహమ్మదీయులకు ప్రాముఖ్యత నివ్వాలనే విషయాన్ని బ్రిటిష్ ప్రభుత్వం కచ్చితంగా గుర్తించింది. ఈ సూత్రం వాళ్ల విషయంలో బాగా పనిచేసిందనటానికి రుజువు. ఇండియన్ సివిల్ సర్వీసుకు భారత ప్రభుత్వం మహమ్మదీయులను అధికారికంగా నియమించటమే. ఈ నియామకం ద్వారా ఐ.సి.ఎస్. లోని ఖాళీలు భర్తీ చేసే అధికారం ప్రభుత్వం చేతిలోకి తీసుకున్న సంవత్సరం నుండీ ఈ పద్ధతిలోనే ఉద్యోగాలు ఇచ్చింది.

కానీ, చాలామంది అంటరానివాళ్లను కనీస అర్హత పరీక్షకు పిలిచి, సంతృప్తి కరంగా సమాధానాలు చెప్పినా వాళ్లలో ఏ ఒక్కరినీ బ్రిటిష్ ప్రభుత్వం అధికారికంగా నియమించలేదు.

రెండవ కారణం, ఈ సర్వీసుల్లోకి చేర్చుకునే పద్ధతి వల్ల విద్యార్హతలు వున్నప్పటికీ అంటరానివాళ్లకు సివిల్ సర్వీసులో చోటు దొరకలేదు. బ్రిటిష్ ప్రభుత్వం ఇందులోని ఖాళీలు భర్తీ చేసే అధికారం శాఖాధిపతికి అప్పగించింది. శాఖాధిపతులంతా ఎంతో కాలంగా పని చేస్తున్న అగ్రవర్ణ హిందువులే. ఒక అగ్రవర్ణ హిందువు తాను పుట్టి పెరిగిన వాతావరణం వల్ల ఒక అంటరానివాడిని కనికరించే సందర్భమే వుండదు.

అతనికి గాఢమైన ఇష్టాయిష్టాలుంటాయి. అతని ఇష్టాలు మొదట అతని కుటుంబానికి, తర్వాత బంధువులు, స్నేహితులకు, ఆ తర్వాత అతని కులస్తులకు అతడిని పట్టి చూపుతాయి. విస్తృతంగా వుండే అతని సంబంధ బాంధవ్యాలలో ఈ ఖాళీని భర్తీ చేయటానికి కచ్చితంగా ఒక అభ్యర్థిని గుర్తిస్తాడు. చాలా సందర్భాల్లో అతడు తన కుల పరిమితులు దాటి ముందుకు చూస్తాడు. అట్లాంటి పరిస్థితి వచ్చినప్పుడు, అది కూడా ఇతర కులానికి చెందిన హిందువు పోటీలో లేనప్పుడు మాత్రమే అంటరాని వాడికి ఆ ఉద్యోగం వస్తుంది. ఒకవేళ ఇతర కులానికి చెందిన పోటీ దారువుంటే మాత్రం అంటరాని వాడికి అవకాశం రాదు. ఈ రకంగా, సివిల్ సర్వీసుకు నియమించబడే విషయంలో అంటరానివాడెప్పుడూ ఆఖరి వాడుగానే చూడబడే వాడు. ఆఖరివాడిగా వుండే అతనికి ఉద్యోగం దొరికే అవకాశాలు ఇంకా తక్కువ.

అంటరాని వాడికి ప్రత్యేకించి సరిపోయే సర్వీసులు రెండున్నాయి. ఒకటి పోలీస్ సర్వీసు, మరొకటి ప్రభుత్వ కార్యాలయాల్లో వుండే తక్కువ రకం సేవ. పోలీసు సర్వీసుకు సంబంధించినంత వరకైనా అంటరానివాళ్ల స్థితి ఏమిటి?

పోలీసు సర్వీసులోకి వీళ్లకు ప్రవేశం లేదు అనే సమాధానం.

ప్రభుత్వ సర్వీసులో, ప్రత్యేకించి పోలీసు సర్వీసులో అంటరానివాళ్ల ప్రవేశంపై వున్న అన్ని ఆంక్షలనూ తొలగించాలని ప్రభుత్వాన్ని కోరుతూ, 1925 డిసెంబర్ 17న ఐక్య సంస్థానాల శాసన మండలిలో ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. పోలీసు శాఖ అధికారి అయిన ప్రభుత్వ సభ్యుడు ప్రభుత్వం తరఫున మాట్లాడుతూ ఇలా అన్నాడు:

"లేదు. ఒకవేళ గౌరవనీయులైన సభ్యులంతా దీన్ని అందరికీ అందుబాటులో వుంచాలని భావిస్తే, నాకెలాంటి అభ్యంతరమూ లేదు. కానీ, ప్రస్తుతానికి నేరస్వభావం కలిగిన తెగ నుండో లేదా చామర్ లాంటి కింది కులంవాడో ఈ దళంలో సభ్యుడిగా వుంటే మాత్రం నేను తప్పనిసరిగా అభ్యంతరం తెలుపుతాను."

1927 జూలై 22న లాలామోహన్‌లాల్ పంజాబ్ శాసన మండలిలో ఈ కింది ప్రశ్న అడిగాడు.

లాలామోహన్‌లాల్: గౌరవనీయులైన ఆర్థిక సంఘం సభ్యులు, పోలీసు సర్వీసులోకి అణగారిన వర్గాల సభ్యులను తీసుకొని వుంటే చెపుతారా? అలా కాకుంటే, అణగారిన వర్గాల సభ్యులను కూడా పోలీసు కానిస్టేబుళ్లుగా చేర్చుకొనేట్టు నిర్దేశించాలని ప్రభుత్వం భావిస్తోందా?

గౌరవనీయులైన సర్ జెఫ్రీ డి మాంటోమొరెన్సీ: పోలీసు సర్వీసులో అణగారిన వర్గాలపేర్లు నమోదు కాలేదు. ఒకవేళ, అణగారిన వర్గాలను అందరితోపాటు సమానంగా చూసినట్టు రుజువుంటే లేదా నమోదు చేసుకున్న సభ్యులు పోలీసు సర్వీసుకు అన్ని విధాలా తగిన వారని ప్రభుత్వం సంతృప్తికరంగా వుంటే, వాళ్లను చేర్చుకోవటానికి ప్రభుత్వం సంసిద్ధత చూపుతుంది.

1928లో బాంబే ప్రభుత్వం నియమించిన కమిటీ ఈ ప్రశ్నలపై కింది విధంగా పేర్కొంది.

(రాతప్రతిలో కొటేషన్ ఇవ్వలేదు - సం॥)

తక్కువ రకం సేవలు చేయటానికి కూడా వాళ్లకు దారులు మూసుకొని పోయాయి. అంతా సవ్యంగానే వున్నట్టు కనిపించినా కొద్దిమంది మాత్రమే దీని వెనుక అసలు కారణాన్ని ఊహించగలరు. పోలీసు సర్వీసులోకి తీసుకోకపోవటానికి ఏది కారణమో ఈ సేవల నుంచి కూడా వాళ్లను దూరంగా వుంచటానికి అదే కారణం. అంటరానితనమే ఆ కారణం. తన విధి నిర్వహణలో భాగంగా ఒక కానిస్టేబుల్ ఒక వ్యక్తి చేతికి సంకెళ్లు వేయాల్సి వస్తుంది. సెర్చి వారెంటును అమలు చేయటానికి ఒక వ్యక్తి ఇంటిలోకి ప్రవేశించాల్సి వస్తుంది. అరెస్టు చేయబడిన వ్యక్తి హిందువు అయి వుండి, కానిస్టేబుల్ అంటరానివాడైతే ఏమి జరుగుతుంది? పోలీసు కానిస్టేబుళ్లు, గీసిన గీతలో బతుకుతూ నీటి కొళాయిలు వాడుకోవాల్సి వుంటుంది. తన పొరుగువాడు అంటరాని కానిస్టేబుల్ అయితే, ఒక హిందూ కానిస్టేబుల్ ప్రతిస్పందన ఎలా వుంటుంది? పోలీసు సర్వీసులో చేరటానికి అంటరానివాళ్లకు ఇవే అడ్డుగోడలుగా నిలచాయి. తక్కువ రకం సేవల విషయంలో కూడా ఇదే పరిస్థితి. ఒక తక్కువ రకం పనివాడు ప్రభుత్వ కార్యాలయంలో అందరికీ సేవలు చేయాల్సి వుంటుంది. అతడు చేసే సేవ హిందువులైన మిగతా వాళ్లతో సంబంధం కలుపుతుంది. అతడి సంబంధం వాతావరణాన్ని మైలపరుస్తుంది. అలాంటప్పుడు అన్ని చోట్లకూ అతడెలా వెళ్లగలడు? సంప్రదాయం ప్రకారం, ఒక బంట్రోతు ఆఫీసులో శాఖాధిపతికీ అతని ఇంటికీ సేవ చేయాలి. యాజమానికి టీ తీసుకు రావటం, యజమాని భార్య కోసం అంగడికి వెళ్లి సరుకులు తేవటం, పిల్లల ఆలనాపాలనా చూసుకోవటం లాంటి పనులు కూడా చేయాలి. ఈ తక్కువ రకం సేవల్లో అంటరానివాళ్లని పెడితే శాఖాధిపతి అయినవాడు ఇలాంటి సేవలన్నీ చేయించుకోవాలి. ఈ సేవలు చేయటానికి మించి అంటరానివాడు సేవచేసే హక్కుకే దూరంగా వుంచబడ్డాడు. అంటరానివాళ్లను ఉద్యోగాల్లోకి తీసుకోకపోవటం ఈ రకంగా పూర్తి కావటంతో బాంబే కమిటీ దీనికి సంబంధించి ఒక ప్రత్యేక సిఫారసు చేయాల్సి వచ్చింది.

# III

బ్రిటిష్ ప్రభుత్వం అంటరానివాళ్ల విద్యకోసం ఏమి చేసింది? ఈ విషయంలో బాంబే ప్రెసిడెన్సీ గురించి రేఖా మాత్రంగా వివరిస్తాను. బ్రిటిష్ పరిపాలనా కాలంలో విద్య ఎలా వుండిందో అర్థం చేసుకోవటానికి సౌకర్యంగా వుండటం కోసం ఈ కాలాన్ని మూడు రకాలుగా విభజించవచ్చు.

## I. 1813 నుండి 1854 వరకు

1. బాంబే ప్రెసిడెన్సీలో బ్రిటిష్ పాలన కింద విద్య 1815లో బాంబే ఎద్యుకేషన్ సొసైటీ స్థాపనతో మొదలైందని చెప్పాలి. ఈ సొసైటీ యూరోపియన్ విద్యార్థుల

విద్యకు మాత్రమే తన ప్రయత్నాలను పరిమితం చేయలేదు. సొసైటీ ఆధ్వర్యంలో సూరత్, థానాలలో పనిచేసే పాఠశాలల్లో చేరమని దేశీయ బాలురను ప్రోత్సహించారు. బాంబేలో 1820 మొదట్లో దేశీయుల కోసం ప్రత్యేకంగా ప్రారంభించిన నాలుగు పాఠశాలలకు సుమారు 250 మంది విద్యార్థులు హాజరయ్యారు. అదే సంవత్సరం ఆగస్టులో దేశీయవిద్యను పెంపొందించటానికి మరిన్ని ప్రమాణాలు పెట్టుకున్నారు. మాండలిక భాషల్లో బడి పుస్తకాలు తయారు చేయటానికి, మాండలిక పాఠశాలలను స్థాపించటానికీ అలాంటి వాటికి ఆర్థిక సహాయం అందజేయటానికీ సొసైటీ ఒక ప్రత్యేక సంఘాన్ని నియమించింది. విస్తృతమైన పరిధి కలిగివుంటూ ప్రధానంగా పేదవాళ్ల విద్య కోసం స్థాపించబడిన ఒక సొసైటీ లక్ష్యాలకు అందనంత దూరంలో ఈ సంఘం కార్యకలాపాలు మొదలయ్యాయి. 1822లో ఈ సంఘం ఒక ప్రత్యేక సంస్థగా అవతరించింది. 'బాంబే నేటివ్ స్కూల్ బుక్ అండ్ స్కూల్ సొసైటీ' పేరుతో పరిచయమై 1827లో 'బాంబే నేటివ్ ఎడ్యుకేషన్ సొసైటీ' (బాంబే దేశీయ విద్యా సమాజం) గా ఇది పేరు మార్చుకుంది. మౌన్‌స్టువర్ట్ ఎల్ఫిన్‌స్టోన్ ఈ కొత్త సమాజానికి మొదటి అధ్యక్షుడు. ప్రధాన న్యాయమూర్తి, బాంబే కార్య నిర్వాహణమండలిలోని ముగ్గురు సభ్యులు దీనికి ఉపాధ్యక్షులుగా వున్నారు. నిర్వహణ సంఘానికి పన్నెండు మంది యూరోపియన్, పన్నెండు మంది దేశీయ పెద్ద మనుషులు, కెప్టెన్ జార్జ్ జెర్విస్ సదాశివ్ కాశీనాథ్ ఛత్రే లతో కలిపి వీరంతా కార్యదర్శులుగా వున్నారు. ప్రతి ఆరు నెలలకూ ప్రభుత్వం ఇచ్చే ఆరు వందల రూపాయల ఆర్థిక సహాయంతో ఈ సమాజం తన కార్యకలాపాలు మొదలుపెట్టింది. 1825 కల్లా బాంబే ప్రభుత్వం కూడా సొంత ఖర్చుతో ప్రాథమిక పాఠశాలలు ప్రారంభించటం మొదలు పెట్టింది. జిల్లా పట్టణాలలోని ఈ పాఠశాలలను కలెక్టర్ల అధీనంలో వుంచింది. ఈ రెండు స్వతంత్రమైన సంఘాల కార్యకలాపాలను సమన్వయం చేయటానికి, ప్రభుత్వం నియమించిన ముగ్గురు, దేశీయ విద్యా సమాజం నియమించిన ముగ్గురు మొత్తం ఆరుగురు సభ్యులతో 1840లో ఒక విద్యా బోర్డు స్థాపించబడింది. 1855లో ప్రభుత్వ నిబంధనల విభాగం అధిపతిని నియమించే వరకూ విద్యా శాఖలో ఈ బోర్డే బాధ్యతలు నిర్వహించింది.

2. 1855 మార్చి 1న ఈ బోర్డు రద్దయ్యే నాటికి, బాంబే ప్రెసిడెన్సీలో ఈ బోర్డు ఆధ్వర్యంలో 2850 మంది విద్యార్థులతో పదిహేను కళాశాలలు, పాఠశాలలు, 18,883 మంది విద్యార్థులతో 256 మాండలిక పాఠశాలలు పనిచేసేవి. అదే నివేదికలో బోర్డు ఇలా పేర్కొంది:

"24. ఆగస్టులో (1855) కింది కులాల విద్య కోసం ఒక పాఠశాలను ప్రారంభించమని కోరుతూ అహ్మద్‌నగర్ నివాసులు కొంత మంది ఒక దరఖాస్తు పెట్టుకున్నారు. పాత నిబంధనలను అనుసరించి ఉపాధ్యాయుడి జీతంలో సగభాగం ఇచ్చే విధంగా ముందుకొచ్చారు. దరఖాస్తు దారులు కట్టిన పాఠశాల గదిలో

ముప్పయిమంది విద్యార్థులున్నారు. ఈ పాఠశాలను ప్రారంభించటాన్ని ధనవంతులు, అగ్రకులాలవాళ్లూ ద్వేష భావంతో వ్యతిరేకించినా, ఉపాధ్యాయుడికి గౌరవవేతనం ఇవ్వటంలో ఇబ్బంది వున్నా పాత నిబంధనల దృష్ట్యా కింది కులాల కోసం ఒక పాఠశాలను మొదటి సారిగా ప్రారంభించామని మాత్రమే చెప్పగలం."

3. ఈ ప్రెసిడెన్సీలో కింది కులాల కోసం ఒక పాటశాలను స్థాపించటం ఇదే మొదటిసారి అని బోర్డు ప్రకటించటంవల్ల, 1855కు ముందు అణగారిన వర్గాల విద్య విషయంలో బ్రిటిష్ ప్రభుత్వ విధానమేమిటనే ప్రశ్న తలెత్తటం సహజం.

ఈ ప్రశ్నకు జవాబు చెప్పాలంటే, 1813 నుండి 1854 వరకు ఈ ప్రెసిడెన్సీలో బ్రిటిష్ ప్రభుత్వంలోని విద్యా విధానానికి వున్న చరిత్రలోకి తొంగిచూడటం అవసరం. పీష్వా ప్రభుత్వ హయాంలో అణగారిన వర్గాలకు విద్య వాసన కూడా తెలియదు. మను ధర్మాన్ని ఆధారంగా చేసుకున్న మత నిరంకుశ స్వభావం కలిగిన పీష్వా ప్రభుత్వం సహజంగానే రాష్ట్రీయ విద్య నందించే ఆలోచన కూడా చేయలేదు. ఈ మతభావనల కారణంగానే, శూద్రులకు, అతిశూద్రులకు జీవించే హక్కు, స్వేచ్ఛ, ఆస్తి ఒక వేళ వున్నా, చదువుకునే హక్కు మాత్రం వాళ్లకు కచ్చితంగా లేదు. ఇలాంటి లోపాలతో బాధలు పడుతున్న అణగారిన వర్గాలు, ద్వేషపూరితమైన ఈ మత నిరంకుశత్వం పతనమైనప్పుడు సహజంగానే కొద్దిగా ఊపిరి పీల్చుకున్నాయి. బ్రిటిష్ పాలన రావటం వల్ల అణగారిన వర్గాల్లో ఎన్నో ఆశలు రేకెత్తాయి. ఎందుకంటే తెల్లవాళ్లది ప్రజాస్వామ్యమనీ, గొప్పవాడైనా మామూలు వాడైనా ఒక మనిషి - ఒకే విలువ అనే సూత్రంలో నమ్మకముండటం మొదటి కారణం. బ్రిటిష్ వాళ్లు ఈ దేశాన్ని ఆక్రమించుకోవటంలో అణగారిన వర్గాలు సహాయపడినందులకు బదులుగా బ్రిటిష్ వాళ్లు తమకు సహాయం చేస్తారనీ ప్రత్యేకించి గొప్పగా ఏమీ చేయకపోయినా కనీసం మిగతా వాళ్లతోనైనా సమానంగా చూస్తారనీ సహజంగా నమ్మటం రెండవ కారణం. ఇది నిజమే అయితే, పీష్వాల మత నిరంకుశత్వానికి ఇలాంటి ప్రజాస్వామ్యం పూర్తిగా భిన్నమైనది.

4. దేశీయులైన ప్రజల్లో విద్యను ముందుకు తీసుకుపోయే ప్రశ్నపై బ్రిటిష్ వాళ్లు చాలా కాలం పాటు మౌనం వహించారు. భారత పరిపాలనా రంగంలోఉన్నతాధికార వర్గానికి చెందిన వ్యక్తులు, నైతిక బాధ్యతనూ భారతదేశ ప్రజలలో విజ్ఞానాన్ని వ్యాప్తి చేయటంలో పరిపాలనా అవసరాన్నీ గుర్తించినప్పటికీ 1813 వరకూ ఇది రాజ్యం వహించాల్సిన బాధ్యతగా ఏ ప్రభుత్వ ప్రకటనా చేయలేదు. 155వ అధ్యాయం జార్జి IV, 53వ చట్టంలోని 43వ సెక్షన్ ద్వారా పార్లమెంటు దీనికి సంబంధించి చేసిన ప్రకటన ఇలా వుంది. "భారతదేశంలోని అదనపు శిస్తులలో ప్రతి సంవత్సరమూ లక్షరూపాయలకు తక్కువ కాకుండా కొంత మొత్తాన్ని పక్కన తీసిపెట్టి, దాన్ని సాహిత్యాన్ని పునరుద్ధరించి మెరుగు పరచటానికీ, భారతదేశంలోని బ్రిటిష్ ఆక్రమిత ప్రాంతాల్లో నివాస ముండే వారికి శాస్త్ర విజ్ఞానాన్ని పరిచయం చేసి దానికి ప్రచారం కల్పించటానికీ

కేటాయిస్తాము." ఈ చట్టబద్ధమైన నిబంధన 1823 వరకూ ఈ దేశ వాసుల విద్యను ఒక పద్ధతి ప్రకారం పటిష్ట పరచి ప్రవేశపెట్టటానికి ఉపయోగపడలేదు. డైరెక్టర్ల సభ 1814 జూన్ 3వ తేదీన కౌన్సిల్‌లోని గవర్నర్ జనరల్‌కు పంపిన అధికార నివేదికలో, 1813లో చేసిన చట్టంలోని 43వ సెక్షన్ ప్రాధాన్యతను ప్రముఖంగా నొక్కి చెప్పింది. సంస్కృత భాషను నేర్చుకోవటానికి హిందువుల్లో ప్రచారం కల్పిస్తే అది పార్లమెంట్ భావించిన ప్రయోజనాలను నెరవేరుస్తుందని ఆ సభ నిర్దేశించింది. దేశీయుల విద్యకు దేశంలో సముచిత స్థానం కల్పించటానికి కాలం కలిసివచ్చిన సమయంలో అణగారినవర్గాల వారికి ఇది ఎంత నిరాశ కలిగించిన విషయం! పై తరగతులవారికే విద్య నేర్చుకునే అవకాశముండాలని బ్రిటిష్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా శాసనం చేసింది. ఈ వాస్తవం కట్టుకథగా కనిపిస్తే, 1850-51 సంవత్సరానికిగాను బాంబే ప్రెసిడెన్సీలోని విద్యా బోర్డు సమర్పించిన నివేదిక నుండి కొన్ని ముఖ్య భాగాలను జాగ్రత్తగా దృష్టి పెట్టి చదవండి.

5వ పేరా: డైరెక్టర్ల కోర్టు దృష్టికి అనుగుణంగా బోర్డు ప్రవేశపెట్టిన పద్ధతి - కోర్టు ఉత్తర్వులను అనుసరించి, ఎర్ల్ ఆఫ్ ఆక్‌లాండ్, మేజర్ కాండీ వంటి ప్రముఖుల పరిశీలనలు, తమ అవసరాలు తెలుపుతూ స్థానికులు స్వయంగా సమర్పించిన వినతి పత్రాల ఆధారంగా, ఈ ప్రెసిడెన్సీలో ఒక విద్యాపథకం రూపొందించాం. పూర్వం కౌన్సిల్‌లో వున్న లార్డులు ఇప్పుడున్న పరిస్థితిని తలకిందులు చేయాలని ఆదేశించారు.

8వ పేరా: ఉన్నత వర్గాల్లో విద్యా వ్యాప్తిపై కోర్టు అభిప్రాయాలు: ప్రజల నైతిక, మేధో విలువలను పెంచే విద్యాభివృద్ధి ఏదంటే ఉన్నత వర్గాలకు సంబంధించిన విద్యా ఇతర ప్రజలపై ప్రభావం చూపే వర్గాల్లో బోధనా ప్రమాణాలు పెంచటం ద్వారా సమాజంలో మార్పు తీసుకొని రావచ్చు. అర్హులైన వ్యక్తులను పౌరపాలనలో నియమించటానికి, ప్రజలలో యూరోపియన్ కళలు, విజ్ఞానం వ్యాప్తి చేయటానికి అనువైన చర్యలు తీసుకోవాలి.

9వ పేరా: పదేళ్ల కాలంతో విద్యకు సంబంధించిన వాస్తవాల పరిశీలన - విద్యా విధానాలు తగిన ఫలితాలు ఇవ్వటానికి సరైన పరిశ్రమ, నిష్పాక్షికత, విశ్వాసం చూరగొనే విధంగా కృషి చేయటం అవసరం. పాఠశాలలన్నీ ప్రభుత్వ బోర్డు ఆధీనంలోకి వచ్చిన కాలం నాటి పరిస్థితులపై పూర్తి అవగాహన చాలా అవసరం.

10వ పేరా: బెంగాల్, బాంబేలలో సహజంగా అభివృద్ధి చెందిన విధానం - భారతీయ విద్యా రంగంలో తలెత్తే వివాదాస్పద ప్రశ్నలు, సమస్యలకు ఆ వ్యవస్థలోనే వాటికి పరిష్కారాలు కూడా వున్నాయి. దేశంలోని పరిస్థితులకు తగినట్టుగానే ఇక్కడి విద్యావిధానం సహజంగా అభివృద్ధి చెందింది.

11వ పేరా: బాంబేలో విద్యకు సంబంధించిన గణాంకాలు - 1850 తర్వాత 4 ఇంగ్లీషు పాఠశాలలు, 83 మాండలిక పాఠశాలలు అదనంగా ప్రారంభించటంతో చదువుకునే విద్యార్థుల సంఖ్య నూరు శాతానికి పైగా పెరిగింది.

ఇంగ్లీషు విద్య - 1699
మాండలిక విద్య - 10,730
సంస్కృత విద్య - 283

(పట్టికల ద్వారా పోలిక - 1840లో 97 పాఠశాలలు, 5491 మంది విద్యార్థులు. ప్రస్తుతం ప్రభుత్వ విద్య నేర్చుకుంటున్న విద్యార్థులు, 185 పాఠశాలల్లో 12,712 మంది)

12వ పేరా: అదే విషయం - అధికారిక లెక్కల ప్రకారం బాంబే ప్రెసిడెన్సీ జనాభా 10 మిలియన్లు. ఈ జనాభాలో 7-14 సంవత్సరాల మధ్య వయసు వున్న మగపిల్లల సంఖ్య 9 లక్షలు. బడికి వెళ్లే వయసున్న ఈ పిల్లల్లో ప్రతి 69 మందిలో ఒకరికన్నా ఎక్కువ మందికి విద్య నేర్చుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించటం లేదు.

13వ పేరా: అదే విషయం - మాండలిక పాఠశాలల్లో విద్యా బోధన సమర్థవంతంగా లేదు. దీనిపై ఎన్నో విమర్శలు కూడా వచ్చాయి. బోర్డు ఈ విషయాన్ని ఒప్పుకోవాలని కూడా అన్నారు. ఇలాంటి పాఠశాలలకు వ్యతిరేకంగా ప్రముఖులు తమ అభిప్రాయాలు కూడా చెప్పారు. విల్లోబీ ఈ వైఫల్యాలను సరిగ్గా అంచనా వేశారు. "ఉన్నత వర్గాలకు చెందిన పాఠశాల ఉపాధ్యాయులు, సాధారణ పాఠశాలలు, సమర్థవంతమైన పర్యవేక్షణ, మాండలిక సాహిత్యానికి అదనపు అంశాలు చేర్చటం". వీటితో ఈ లోపాలను సరిదిద్దవచ్చు. వీటి అమలుకు ఖర్చు పెరుగుతుంది. బోర్డుకు అదనంగా ఆర్థిక సహాయం చేసే అధికారం ప్రభుత్వానికి వుండటం సరైంది కాదని గౌరవ కౌన్సిల్ రాసిన లేఖ ద్వారా అర్థమవుతోంది.

14వ పేరా: పేదవారికి విద్య నేర్పటానికి వనరులులేవు అనే నిర్ధారణ: 175 మాండలిక (ప్రాంతీయ) పాఠశాలల నిర్వహణకు తగిన నిధులు ఇవ్వలేకపోతే, బాంబే ప్రెసిడెన్సీలో 9 లక్షల మంది బాలురకు విద్యా బోధన అనే ప్రశ్నే తలెత్తదు. అందువల్ల విద్యా బోర్డులు తమ లక్ష్యాన్ని విడిచి పెట్టరాదు.

15వ పేరా: పరిమిత వనరులతో ఉత్తమ ఫలితాలపై కోర్టు అభిప్రాయం - విద్యాభివృద్ధి కోసం చేసే ప్రయత్నాలు చిన్న స్థాయిలోనే వుండాలనీ కోర్టు సూచించింది. స్థానికులలోని ఉన్నత వర్గాల వారికి యూరోపియన్ విజ్ఞాన శాస్త్రాలు, నాగరిక యూరోపియన్ సాహిత్యం అందుబాటులోకి తెస్తే వాటి ద్వారా ఈ సమాజాన్నంతా ప్రభావితం చేయవచ్చు.

16వ పేరా: భారతదేశంలోని అగ్రకులాల పట్ల ఆసక్తి: ప్రభుత్వ విద్యా విధానం కేవలం 'ఉన్నత వర్గాల' వారికే పరిమితం కావాలని హైకోర్టు భావించింది. యూరోప్‌లో ముఖ్యంగా ఇంగ్లాండ్‌లో 'గొప్పవారికీ' పేదవారికీ మధ్య స్పష్టమైన తేడా వుంటుంది. ఇక్కడ అలాంటిదేమీ లేదు. ఇంగ్లాండ్‌లో బిచ్చగాడు అంటే కర్మాగారంలో తప్పనిసరి పనికి మాత్రమే అర్హుడు. కానీ, ఈ దేశంలో బిచ్చగాడు అంటే సర్వసుఖాలనూ త్యజించి దేవుని కోసం అన్వేషిస్తూ తిరిగే గొప్పవాడు అని అర్థం.

17వ పేరా : భారతదేశంలో ఉన్నత వర్గాలు : ఇక్కడి ఉన్నత వర్గాల్లో ఎక్కువ పలుకుబడి కలిగిన వారిని ఈ క్రింది విధంగా వర్గీకరించవచ్చు.

1. భూస్వాములు, జాగీర్దారులు, మాజీ రాజులు, సంస్థానాల పాలకులు, స్థానికంగా అధికారం వున్న సైనిక తరగతి.

2. వ్యాపార, వాణిజ్యాల ద్వారా సంపన్నులైన వారు, వ్యాపార వర్గం.

3. ఉన్నత ప్రభుత్వోద్యోగులు.

4. బ్రాహ్మణులు - బాంబేలో పర్భూలు, షెన్వీలు, బెంగాల్లో కాయస్థుల్లా కలం సహాయంతో జీవించే రచయితలు, తమ విద్యతో ఒక స్థాయికి చేరుకున్నవారు.

18వ పేరా : బ్రాహ్మణులు పై నాలుగు తరగతుల్లో అందరికన్నా ఎక్కువ పలుకుబడి కలిగిన వారు. మన పాలనలో దేశంలోని జాగీర్దారులు, క్షత్రియ తరగతులు రోజు రోజుకూ క్షీణిస్తున్నాయి. పాత వృత్తి స్థానంలో కొత్త వృత్తి చేపట్టటానికి వారికి అభ్యంతరం లేదు. ఆడంబరాలు, విపరీత ఖర్చులకు అలవాటుపడిన వీరికి పౌర అధికార హోదా ఇచ్చే ప్రయత్నాలు గతంలో జరిగాయి. గత కాలపు ఘనచరిత్ర, విలాసవంతమైన జీవితం తప్ప మరొకటి వీళ్లకు రుచించదు. వాణిజ్య వర్గాల్లో కూడా విద్యా ప్రభావం పెద్దగా లేదు. వీళ్లు తమ వ్యాపారానికి పనికి వచ్చేటంత విద్య మాత్రమే నేర్చుకుంటారు. ప్రభుత్వ ఉద్యోగుల్లో వీరికి పలుకుబడి వుంది. అణగారిన వర్గాల్లో వీరి ప్రభావం ఏమీ లేదు. ఇంగ్లాండ్‌లో మాదిరే ఇక్కడ కూడా ప్రభుత్వ ఉద్యోగులపైన అపనమ్మకం, ఏహ్యాభావం వున్నాయి.

19వ పేరా : బ్రాహ్మణుల పేదరికం - పై విశ్లేషణబట్టి తెలిసేదేమంటే, బ్రిటీష్ ప్రభుత్వం చేసే విద్యావ్యాప్తికి పనికి వచ్చేవాళ్లు బ్రాహ్మణులు, ఇతర అగ్రకులస్తులే. అయితే వీళ్లు చాలా పేదవారు. దేశంలోని చాలా ప్రాంతాల్లో బ్రాహ్మణుడు 'బిచ్చగాడి'కి మారుపేరు.

20వ పేరా : డబ్బు వెచ్చించి విద్య నేర్చుకోగలిగిన సంపన్నులు, అసాధారణ ప్రజ్ఞా వంతులైన యువకులకు మాత్రమే ఉన్నత విద్యను అందించాలన్న సూత్రాన్ని అమలు చేసే క్రమంలో బోర్డు తెలుసుకున్నదేమంటే, ఉన్నత విద్య పట్ల సంపన్నులు పూర్తి విముఖంగా వున్నారు. ఇంక పేదలలో అంతటి తెలివితేటలు గలిగిన వాళ్లెవరో తెలుసుకోగలిగిన మార్గాలేమీ లేవు. ఉన్నత విద్య పట్ల ఆసక్తి వున్న సంపన్నులు బెంగాల్‌లో ఎక్కువగా కనిపించారు. ప్రభుత్వం బాంబే కన్నా బెంగాల్‌లో విద్యా వ్యాప్తికి ఎక్కువ కృషి చేసిన తర్వాతే మేము ఈ అభిప్రాయానికి వచ్చాం. ఈ రకంగా విద్య నేర్చుకునేవాళ్ల సంఖ్య పెంచి వారిని యూరోపియన్లతో సమాన స్థాయికి తీసుకొని రావలసిన అవసరం వుంది. భారత దేశంలోని సంపన్న వర్గాలు ఇచ్చే విరాళాలు, విద్యార్థులు చెల్లించే ఫీజుల మీద ఆధారపడి విద్యను వ్యాప్తి చేయటం అసాధ్యమని తేలిపోయింది.

21వ పేరా: కింది కులాల్లో విద్యా బోధనా – అగ్రకులాల్లోని పేద పిల్లలకు విద్య నేర్చుకునే అవకాశాలు విస్తృతంగా కల్పించాలనేది మనం ఇన్ని సంవత్సరాల అనుభవంతో తెలుసుకున్న విషయం. ఇక్కడ గమనించి తీరవలసిన సమస్య మరొకటి వుంది. ఇలాంటి పేద పిల్లలను ప్రభుత్వ సంస్థలలో ఉచిత విద్యకు అనుమతిస్తే, దళిత కులాలకు చెందిన పిల్లలను ఏ విధంగా అడ్డుకోవటం?

22వ పేరా: హిందువుల సాంఘిక విద్వేషాలు: బాంబేలో ఈ కింది తరగతి వారికి సరైన శిక్షణనిస్తే, దేశీయ ప్రతిభా వంతుల కోటాలో ఉన్నత పదవులకు అర్హత సంపాదించగలుగుతారు. కానీ, హిందూ సమాజంలో కింది కులాల వారికి ఉన్నత పదవులు ఇవ్వటాన్ని వ్యతిరేకించే కొంతమంది ద్వేష భావాలకు బ్రిటిష్ ప్రభుత్వం లొంగి పోవటం ఒక బలహీనత, కులాల అడ్డుగోడలపై మనం బహిరంగంగా దాడి చేయాలి.

23వ పేరా: మౌంట్ స్టువర్ట్ ఎల్ఫిన్‌స్టోన్ చేసిన విలువైన పరిశీలనలు – ఈయన అభిప్రాయం ప్రకారం, "క్రైస్తవ మిషనరీలు కింది కులాల పిల్లలు ఉత్తమ విద్యార్థులని గమనించాయి. ఇలాంటి వారికి ప్రత్యేక ప్రోత్సాహమివ్వటం పట్ల జాగ్రత్తగా వుండాలి. విభిన్న తరగతులుగా విభజించబడిన సమాజంలో వారు పూర్తి కింది స్థాయిలో వున్నారు. మన విద్యా విధానం ఈ కులాల్లో వేళ్లూనుకున్నా దాన్ని వ్యాప్తి చేయటం గురించి కూడా ఆలోచించాలి. మనం ఒక కొత్త వర్గానికి నాయకులుగా మారినా మిగతా వాళ్లకన్నా పనికివచ్చే విజ్ఞానవంతులుగా వీరిని తీర్చిదిద్దినా అగ్రకులాల విద్వేషాలకు గురికాక తప్పదు. ఈ పరిస్థితి వల్ల విద్యావ్యాప్తి ఆగిపోకుండా చూసుకోవాలి."

5. 1855కు ముందు బాంబే ప్రెసిడెన్సీలో అణగారిన వర్గాలకోసం పాఠశాలలు ప్రారంభించలేదని దీనివల్ల స్పష్టమవుతోంది. పేద ఉన్నత కులాలు, ముఖ్యంగా బ్రాహ్మణులకు మాత్రమే విద్యా ప్రయోజనాలు అందే విధంగా బ్రిటిష్ ప్రభుత్వం చేసిన ఉద్దేశపూర్వక విధానమే దీనికి కారణం. ఈ విధానం సరైనదో కాదో అది వేరే విషయం. వాస్తవమేమిటంటే, ఈ కాలంలో బ్రిటిష్ ప్రభుత్వం విద్య నేర్చుకోవటానికి అణగారిన వర్గాలను అనుమతించలేదు.

## II - 1854 నుండి 1882 వరకు

6. డైరెక్టర్ల కోర్టు 1854 జూలై 19న తమ 49వ అధికారిక నివేదికలో వెల్లడించిన విషయాలు:

"పూర్తిగా నిర్లక్ష్యం చేయబడిన సాధారణ ప్రజలకు నిజ జీవితంలో విజ్ఞానం ఎంత ఉపయోగకరమో తెలియజెప్పటంపై ఇప్పుడు మనం దృష్టి పెట్టాలి. వాళ్లకు ఎవరో ఒకరు విద్య నందించాలి. దీని విషయమై భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉన్నత ప్రమాణాలను అమలు పరచటంలో ఖర్చుపెరిగినా భరించటానికి సిద్ధంగా వున్నాం".

ఈ నివేదిక ఈ దేశంలో గ్రామీణుల విద్యకు సంబంధించి చాలా సరిగ్గానే పునాది వేసింది. 1882లో భారతీయ విద్యకు సంబంధించి హంటర్ కమిషన్

మొదటి సారిగా ఈ విధాన ఫలితాల నిగ్గు తేల్చింది. ఈ కిందవున్న పట్టికలు ఇరవై ఎనిమిదేళ్ల కాలంలో సాధించినదేమిటో చూపుతాయి.

### ప్రాథమిక విద్య
### 1881 - 82

| | పాఠశాలలోని విద్యార్థులు | మొత్తం విద్యార్థుల సంఖ్యపై కట్టిన శాతం |
|---|---|---|
| క్రైస్తవులు | 1,521 | .49 |
| బ్రాహ్మణులు | 63,071 | 20.17 |
| ఇతర హిందువులు | 202,345 | 64.69 |
| మహమ్మదీయులు | 39,231 | 12.54 |
| పారశీలు | 3,517 | 1.12 |
| మూలవాసులు మరియు కొండ తెగలు | 2,713 | .87 |
| కింది కులాల హిందువులు | 2,862 | .87 |
| యూదులు మరియు ఇతరులు | 373 | .12 |

| | మాధ్యమిక పాఠశాలలు | | ఉన్నత పాఠశాలలు | |
|---|---|---|---|---|
| | పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్య | మొత్తం విద్యార్థుల సంఖ్యపై కట్టిన శాతం | పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్య | మొత్తం విద్యార్థుల సంఖ్యపై కట్టిన శాతం |
| క్రైస్తవులు | 1.429 | 12.06 | 111 | 2.26 |
| బ్రాహ్మణులు | 3,639 | 30.70 | 1,978 | 40.29 |
| ఇతర హిందువులు | | | | |
| వ్యవసాయదారులు | 624 | 5.26 | 140 | 2.85 |
| కిందికులాలు | 17 | .14 | - | - |
| ఇతర కులాలు | 3,823 | 32.25 | 1,573 | 32.04 |
| మహమ్మదీయులు | 687 | 5.80 | 100 | 2.04 |
| పారశీలు | 1,526 | 12.87 | 965 | 19.66 |
| మూల వాసులు మరియు కొండ తెగలు | 6 | .05 | - | - |
| ఇతరులు (యూదులు మొదలైన వాళ్లతో కలిపి) | 103 | .87 | 92 | .86 |

## కళాశాల విద్య
## 1881 - 82

| | విద్యార్థుల సంఖ్య | మొత్తం విద్యార్థుల సంఖ్యపై కట్టిన శాతం |
|---|---|---|
| క్రైస్తవులు | 14 | 3 |
| బ్రాహ్మణులు | 241 | 50 |
| ఇతర హిందువులు | | |
| వ్యవసాయదారులు | 5 | 1 |
| కింది కులాలు | 0 | 0 |
| ఇతర కులాలు | 103. | 21.3 |
| మహమ్మదీయులు | 7 | 1.5 |
| పారశీలు | 108 | 21.5 |
| మూల వాసులు మరియు కొండతెగలు | 0 | 0 |
| ఇతరులు (యూదులు మొదలైన వాళ్లతో కలిపి) | 2 | 0.4 |

7. ఈ గణాంకాలు ఏమి చూపుతున్నాయి? పేద ప్రజలకు విద్య చెప్పటం ప్రభుత్వ విధానమే అయినప్పటికీ, 1854కు ముందు విద్యకు వెలివేయబడి ఎలా వున్నారో ఇప్పుడూ అలాగే వున్నారు. హిందువుల్లో కింది కులాల వాళ్లు, మూల వాసులు విద్యా క్రమంలో ఇంకా అట్టడుగ స్థాయిలోనే వున్నారు. 1881 - 82 లో కూడా ఈ ప్రెసిడెన్సీలోని ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో ఈ కులాలకు చెందిన ఒక్క విద్యార్థి కూడా లేదు. విద్య విషయంలో మిగతా కులాల స్థాయికి అణగారిన వర్గాలను తీసుకొని రావటంలో జరిగిన ఈ వైఫల్యానికి కారణమేమిటి? దీనికి జవాబు చెప్పాలంటే, ఈ ప్రెసిడెన్సీలోని ప్రభుత్వం అనుసరించిన విద్యా విధానానికి వున్న చరిత్రను మరోసారి పరిశీలించటం అవసరం.

8. ప్రజల్లో అధిక సంఖ్యలో వుండే పేద వాళ్లకు చదువు చెప్పటం రాజ్యానికి వున్న బాధ్యత అని నలభై ఏళ్ల సుదీర్ఘ కాలం తర్వాత 1954లో డైరెక్టర్ల సభ తన అధికార నివేదికలో మొదటిసారి గుర్తించింది. అయితే, ఈ నివేదికలో ప్రకటించిన విధానం వెనుకవున్న వివేకవంతమైన ఉద్దేశాలను తప్పుపట్టే తొత్తులు ఈ విధానాన్ని పూర్తిగా తిరగరాయాలని వ్యతిరేకతను కూడా వ్యక్తం చేశారు. వెనుకబడిన తరగతులను జీవితంలో ఉన్నత స్థాయికి తీసుకొని రావటంలో ఈ విధానం వల్ల వచ్చే పర్యవసానాలను ఎదుర్కోవాల్సి వస్తుందని బ్రిటిష్ పాలకులు భయపడ్డారు. బోర్డ్ ఆఫ్ కంట్రోల్‌కు

అధ్యక్షుడైన లార్డ్ ఎలెన్‌బరో ఆ తర్వాత డైరెక్టర్ల సభకు అధ్యక్షుడయ్యాడు 1858 ఏప్రిల్ 28న ఈ కింది విధంగా హెచ్చరించటానికి ఆయన ఏ మాత్రమూ వెనుకాడలేదు.

"మహాజనులారా: 1854లో డైరెక్టర్ల సభ పంపిన ఆదేశాలను అనుసరించి భారత దేశంలోని వివిధ ప్రాంతాల్లో విద్య పరిస్థితిని నాకు పూర్వం చాలా ఉత్తరాలు సమీక్షించాయి. అయితే, ఈ పద్ధతి నుండి ఆశించిన మంచి జరిగిందన్న నమ్మకాన్ని అవి నాకు కలిగించలేదు. విద్యను వ్యాప్తి చేసే విషయంలో అధికార స్పృహకు సంబంధించి ప్రగతి కనిపిస్తోంది."

పేరా 11 : కింది కులాల కంటే పై తరగతిలో వుండే వారి పిల్లలకు మన పాఠశాలల్లో విద్యనందించి, శ్రామిక తరగతికి ఉన్నత స్థాయిలో మనోవికాసం కలిగించటం వల్ల లాభం లేదు.

పేరా 12 : ఇది సమాజాన్ని ఆరోగ్యకరమైన స్థితిలో వుంచదు. మన ఆకాంక్ష నెరవేరటానికి కింది కులాల్లో ఎక్కువ మందికి విద్య చెప్పటం ప్రభుత్వానికి ఇష్టం లేదు.

పేరా 13: మనం అందించిన ఉన్నత విద్య ద్వారా పేద ప్రజలపై పెత్తనం సాగించటానికి పేదవాళ్లు అసంతృప్తితో వుండే పరిస్థితులను సృష్టించాలి.

పేరా 14 : విద్య, నాగరికత పై స్థాయి నుండి కింది కులాలకు అందాలి. అలా అయితేనే సమాజానికి కొత్త రక్తం ఎక్కించినట్టవుతుంది. అలా కాకుండా కింది కులాల నుండి పై స్థాయిలోని వారికి ఇవి ఎప్పటికీ అందవు. ఈ రెండూ కింది కులాలకు పూర్తిగా అందితే, ఈ ఉద్వేగపూరితమైన చర్యకు మొదటి బాధితులు విదేశీయులే అవుతారు.

పేరా 15: "విద్యను అన్ని దిక్కులకూ వ్యాప్తి చేయాలని మనం కోరుకుంటూ వుంటే, దాన్ని మొదట ఉన్నత వర్గాలకు అందేట్టు చేద్దాం."

పేరా 16: "దీన్ని రెండు పద్ధతుల్లో చేయాలి. ఒకటి, ఉన్నత వర్గాలను మాత్రమే చేర్చుకునేట్టు కళాశాలలు స్థాపించటం ద్వారా, రెండు, దేశీయులైన వారి కొడుకులను సైన్యం నుండి తీసివేసి, వారికి తృణమో పణమో ఇచ్చి చేతులు దులుపుకోవటం ద్వారా".

9. అంటరాని వాళ్ల పట్ల యూరోపియన్ అధికారుల వ్యతిరేకతను 1859లో తన నివేదికలో భారత ప్రభుత్వ సహాయ కార్యదర్శి చివరికి సరిదిద్దాడు. పేద ప్రజలకు విద్య చెప్పటం ప్రభుత్వ బాధ్యతగా మళ్లీ రంగం మీదికి వచ్చింది.

10. గొప్పగా కనిపించినా, అణగారిన వర్గాల వారికి విద్యను అందించటం తన బాధ్యతగా ప్రభుత్వం గుర్తించటం కేవలం పేరుకే దక్కిన లాభం. వివిధ జిల్లాలలో గ్రామీణుల కోసం పాఠశాలలు తెరచినప్పటికీ, వీటిలో అణగారిన వర్గాలను చేర్చుకునే సమస్య పరిష్కారం కాకుండా అలాగే వుండి పోయింది. 1856లో ఇలాంటి సమస్య తలెత్తింది. అయితే, ప్రభుత్వ నిర్ణయం అణగారిన వర్గాలకు అనువుగా లేదు. 1856-57 సంవత్సరంలో బొంబే ప్రెసిడెన్సీ ప్రభుత్వ ఆదేశాల శాఖ డైరెక్టర్ నివేదికలోని కొన్ని ముఖ్య భాగాల నుండి ఈ విషయాన్ని మనం తెలుసుకోవచ్చు.

"పేరా 17: కింది కులాలు, ఆటవిక తెగల పాఠశాలలు : ప్రభుత్వం నేరుగా స్థాపించిన కింది కులాల పాఠశాలలు లేవు. ఇలాంటి పాఠశాలలు స్థాపించటానికి ఉన్నత ప్రభుత్వం ఆమోదం తెలుపలేదు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా సహాయ సహకారాలు అందించిన ఈ సాధారణ పాఠశాలలో అన్ని కులాల వాళ్లూ చదువుకోవచ్చు అనటం పేరుకు మాత్రమే నిజం. 1855-56లో నా నివేదికలోని పరిశీలనను అనుసరించి ప్రభుత్వం ఈ ఆజ్ఞ జారీ చేసింది: "ప్రభుత్వ పాఠశాలల్లో కింది కులాల విద్యార్థులను చేర్చుకునే సమస్యకు సంబంధించి ప్రభుత్వం ముందుకు ఒకే ఒక కేసు వచ్చింది. అదేమంటే, 1856 జూన్‌లో ఒక మహర్ పిల్లవాడి తరపున ఒక పిటిషన్ దాఖలైంది. విద్య నేర్చుకోవటానికి సాధారణ ఫీజు చెల్లిస్తున్నప్పటికీ ధార్వాడ్ ప్రభుత్వ పాఠశాలలో ఆ పిల్లవాడిని చేర్చుకోలేదని ఫిర్యాదు చేశారు.

"ఈ సందర్భంలో, ఈ సమస్యపై సరైన తీర్పునివ్వటం ఆచరణలో చాలా కష్టమైనపని. ఎందుకంటే దేశీయులైన పేద ప్రజలకు జ్ఞానం కలిగించేఉద్దేశంతో స్థాపించిన ప్రభుత్వ విద్యాశాఖ వాళ్ల సైద్ధాంతికపరమైన హక్కుకు వ్యతిరేకమవుతుంది. అయినా, కొంచెం సంకోచిస్తూనే ఆ కాలంలో ప్రభుత్వం ఆమోదించిన తీర్మానం ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నాం. అన్ని కులాల వాళ్లూ వచ్చే పాఠశాలల్లో ఒక్క మహర్ పిల్లవాడిని చేర్చుకోవటం కోసం దేశీయులైన అధిక సంఖ్యాకులకు ఉపయోగపడే సంస్థను నిరుపయోగమైనదిగా చేయలేము."

★1856 జూలై 21న ప్రభుత్వం ఆమోదించిన తీర్మానపత్రం

1. ఉత్తర ప్రత్యుత్తరాల్లో చర్చించిన ఈ సమస్య ఆచరణలో చాలా జటిలమైనది.

2. మహర్ పిటిషనర్‌కు సైద్ధాంతికంగా హక్కు వుందనటంలో సందేహం లేదు. ధార్వాడ్‌లో విద్య నేర్చుకోవటానికి తగిన అవకాశాలను దక్కించుకోవటంలో అడ్డుపడిన అగ్రకులాల విద్వేషభావాలు సమసిపోవటానికి కొద్ది కాలం పట్టవచ్చు.

3. ఒకరు లేదా కొద్ది మంది కింది కులాల విద్యార్థుల కోసం కుల విద్వేషాల్లో జోక్యం చేసుకుంటే అది విద్య చెప్పటంలోగల ఆశయాన్ని దెబ్బతీస్తుందనే ప్రభుత్వం కూడా భావించింది. ఈ అననుకూలత ప్రభుత్వం వల్లకాదు, ఆ విద్యార్థి ప్రాధేయపడటంతో అతనికి న్యాయం కలిగేలా జోక్యం చేసుకోవటంతో ఏర్పడింది.

1857 జనవరి 23వ తేదీన రాసిన ఒక లేఖలో భారత ప్రభుత్వం విధించిన ఈ కింది నిబంధనల్లో, బాంబే ప్రభుత్వం ఈ విషయంలో చేపట్టిన పనులేమిటో చూడవచ్చు.

"ఈ విషయంలో బాంబే ప్రభుత్వం తెలివిగా ప్రవర్తించటం సముచితంగా వుందని కౌన్సిల్‌లోని గవర్నర్ జనరల్ భావిస్తున్నాడు. ఇదే బెంగాల్ ప్రెసిడెన్సీలో అయితే ఏ ప్రభుత్వ పాఠశాలలోనైనా చేరటానికి ఆ పిల్లవాడిని తిరస్కరించి వుండేవారు

---

★1858 ఏప్రిల్ 28వ తేదీన ఒక అధికార నివేదికలో, డైరెక్టర్ల సభ ఈ విషయంపై కింది విధంగా ఆజ్ఞ జారీ చేసింది

కాదని భారత ప్రభుత్వ కార్యదర్శిగా నేను చెప్పాలని కౌన్సిల్ కోరుకుంటోంది.

కులం విషయంలో మాదిరి కాకుండా, దేశమంతటా పాఠశాలలు ప్రారంభించే ఏ సాధనాన్నీ ఈ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయదని భారత ప్రభుత్వం హామీ ఇచ్చినట్టు కూడా ఈ లేఖలో పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలను అందరికీ అందుబాటులోకి తీసుకొనిరాకుండానే ఈ చర్య తన ప్రభావం చూపింది. ఈ విధంగా పాఠశాలల పని తీరును నాశనం చేసి, అసలు వాటిని స్థాపించటంలో వున్న ఉద్దేశాన్నే ఇది తుంగలో తొక్కింది. ప్రభుత్వ పాఠశాలల సాధారణ ప్రయోజనాన్ని దెబ్బతీస్తున్నందువల్ల ఈ విధానం అమలుకు సంబంధించి విచారణ జరిపించాలని నిర్ణయించారు.

11. "భారతప్రభుత్వం" ఆశయానికి విరుద్ధంగా, బెంగాల్‌లో విద్యను అందరికీ అందుబాటులో వుంచే పనిని బెంగాల్ అధికార వర్గాలు ప్రభుత్వ ఆదేశాల జిల్లా కమిటీలకు అప్పజెప్పాయి. ప్రతి కేసులోనూ స్థానికుల ఇష్టాయిష్టాలను లెక్కలోకి తీసుకొని, కింది కులాల విద్యార్థులను పాఠశాలలో చేర్చుకోవటమో తిరస్కరించటమో నిర్ణయించే అధికారం వీటికి వుండేది. దీని ఫలితంగా, ప్రభుత్వం ఒక ప్రయోజనం కోసం ప్రవేశపెట్టిన విద్య, ఇతర కులాలు అనుమతించకపోవటంతో అణగారిన వర్గాలకు అందకుండా పోయి వారిని అజ్ఞానంలో విడిచి పెట్టింది.

12. ఈ పరిస్థితుల్లో, 1854 అధికార నివేదిక పేర్కొన్న గ్రామీణుల విద్య అణగారిన వర్గాలకు తప్ప అందరికీ అందుబాటులో వుండింది. 1854లో అణగారిన వర్గాల విద్యపై వున్న నిషేధం ఎత్తివేయటం కేవలం ఒక కంటితుడుపు చర్య. వీరి పిల్లలను పాఠశాలలో చేర్చుకునే విధానం ప్రభుత్వం చేపట్టినట్టు చెప్పుకున్నప్పటికీ, ఆచరణలో జాగ్రత్తగా కింది కులాలను విద్యకు దూరం చేశారు. నిషేధం మాటల్లో లేకపోయినప్పటికీ చేతల్లో పూర్వం నుంచీ వున్నట్టుగానే కొనసాగిందని దీన్ని బట్టి మనం చెప్పవచ్చు.

అణగారిన వర్గాలకు విద్య చెప్పే బాధ్యతను చేపట్టటానికి వుండిన ఒకే ఒక సంస్థ క్రిస్టియన్ మిషనరీలు. మౌంట్ స్టువర్ట్ ఎల్ఫిన్‌స్టోన్ మాటల్లో "అవి కింది కులాల విద్యార్థులు ఉత్తమ విద్యార్థులుగా కనిపెట్టాయి." మతపరంగా తటస్థంగా వుండాలని ప్రభుత్వం నిర్ణయించుకున్నా అది ఏ రకంగానూ మిషనరీలకు తోడ్పాటును అందించలేకపోయింది. ఈ కాలం తొలినాళ్లలో ఏ మిషనరీ పాఠశాలకూ ఏ విధమైన ఆర్థిక సహాయమూ ప్రభుత్వం ఈ ప్రెసిడెన్సీలో చేయలేదు. 1854 నాటి విద్యా నివేదిక మిషనరీ పాఠశాలకు ఆర్థిక సహాయం అందించటాన్ని నిషేధించక పోయినప్పటికీ ప్రభుత్వం చేయలేదు.

13. ఈ పరిస్థితిని అధిగమించటానికి ప్రభుత్వం రెండు ప్రమాణాలు పెట్టుకుంది. 1) కింది కులాలకు చెందిన మగ పిల్లలకు ప్రత్యేక ప్రభుత్వ పాఠశాలలు స్థాపించటం.

2) నిధులు విడుదల చేసే నిబంధనలను సడలించటం ద్వారా మిషనరీలకు

ప్రత్యేకమైన ప్రోత్సాహమివ్వటం. ఈ రెండు ప్రమాణాలనూ ఆచరణలో పెట్టకపోవటం వల్ల అణగారిన వర్గాల విద్య ఫలితాలనివ్వలేదు. దీంతో పరిస్థితి ఎప్పటిలాగే వుండిపోయింది.

### 1882 నుండి 1923 వరకు

14. 1882 తర్వాత 1923వ సంవత్సరం బాంబే ప్రెసిడెన్సీలోని విద్య చరిత్రలోనే మైలు రాయిగా నిలిచి పోయింది. ఈ సంవత్సరంలోనే ప్రాథమిక విద్యను ప్రాంతీయ ప్రభుత్వాల అధీనం నుండి స్థానిక సంఘాలకు బదిలీ చేశారు. 1923లోని పరిస్థితులకు అనుగుణంగా ఈ మార్పు జరిగింది. విద్య పురోగతి విషయంలో 1923లో బాంబే ప్రెసిడెన్సీలోని వివిధ కులాల స్థితిగతులను పట్టిక రూపంలో ఈ కింది విధంగా చెప్పవచ్చు.

| ఈ ప్రెసిడెన్సీలోని జనాభా తరగతులు | జనాభాను బట్టి క్రమం | విద్యను బట్టి క్రమం | | |
|---|---|---|---|---|
| | | ప్రాథమిక | మాధ్యమిక | కళాశాల |
| అభివృద్ధి చెందిన హిందువులు | 4 | 1 | 1 | 1 |
| మధ్యంతర హిందువులు | 1 | 3 | 3 | 3 |
| వెనుకడిన హిందువులు | 2 | 4 | 4 | 4 |
| మహమ్మదీయులు | 3 | 2 | 2 | 2 |

15. ఈ పట్టికను బట్టి, విద్య విషయంలో ఈ వివిధ కులాల తులనాత్మక పురోగతిలో కొట్టొచ్చినట్టు కనపడే తేడాను ఎవరైనా చూవచ్చు. జనాభా, విద్యాపరమైన ప్రగతి ఈ రెండు విషయాలను ఆధారం చేసుకొని ఈ వివిధ కులాలను పోల్చి చూసినప్పుడు జనాభాలో మొదటి స్థానంలో వున్న మధ్యంతర వర్గం, కళాశాల విద్యాక్రమంలో, మాధ్యమిక విద్యా క్రమంలో ప్రాథమిక విద్యా క్రమంలో కూడా మూడవ స్థానంలో వుంది. జనాభా క్రమంలో రెండో స్థానంలో వున్న అణగారిన వర్గాలు ప్రాథమిక, మాధ్యమిక, కళాశాల విద్యాక్రమాల్లో నాలుగో స్థానంలో వున్నాయి. జనాభా క్రమంలో మూడో స్థానంలో వున్న మహమ్మదీయులు కళాశాల, మాధ్యమిక, ప్రాథమిక విద్యా క్రమాల్లో రెండో స్థానంలో వున్నారు. జనాభా క్రమంలో నాలుగో స్థానంలో వున్న "అభివృద్ధి చెందిన హిందువులు", కళాశాల, మాధ్యమిక, ప్రాథమిక విద్యాక్రమంలో మొదటి స్థానంలో వున్నారు. 1882లో పరిస్థితి ఎలా వుండిందో ఇప్పటికీ అలాగే వుందని దీన్ని బట్టి మనం నిస్సందేహంగా చెప్పవచ్చు.

16. వివిధ కులాల విద్యా ప్రగతి విషయంలో స్పష్టంగా కనిపించే ఈ తేడాను 1923-24 సంవత్సరానికిగాను బాంబే ప్రెసిడెన్సీలోని ప్రభుత్వ ఆదేశాల శాఖ డైరెక్టర్ నివేదికలో కూడా చూడవచ్చు. దాని ఆధారంగానే పై విధంగా రాశాను. ఇది చాలా పెద్దది కాకపోతే వివిధ కులాల్లోని విద్యా స్థాయిలో తేడా వుండటమనేది చాలా చిన్న

విషయం. ఇది ఎంత పెద్ద తేడానో తెలుసుకోకపోతే మనం ఏ నిర్ధారణకూ రాలేం. ఈ దృష్టి కోణంలో నుండి పరిస్థితిని స్పష్టం చేయటానికి ఈ కింది పట్టిక ఇస్తున్నాను.

పట్టిక

| జనాభా తరగతులు | ప్రాథమికవిద్య, జనాభాలోని వెయ్యిమందికి విద్యార్థులు | మాధ్యమికవిద్య, జనాభాలోని లక్ష మందికి విద్యార్థులు | కళాశాలవిద్య, జనాభాలోని 2 లక్షల మందికి విద్యార్థులు |
|---|---|---|---|
| అభివృద్ధి చెందిన హిందువులు | 119 | 3,000 | 1,000 |
| మహమ్మదీయులు | 92 | 500 | 52 |
| మధ్యంతర తరగతి | 38 | 140 | 24 |
| వెనుకబడిన తరగతి | 18 | 14 | లేరు(వుంటే ఎవరోఒక్కరు) |

17. ప్రాథమిక, మాధ్యమిక, కళాశాల విద్యలో ఏ తరగతి ఏ స్థానంలో వుందో పైన ఇచ్చిన పట్టిక స్పష్టంగా తెలుపుతోంది. ఈ ప్రెసిడెన్సీలోని వివిధ కులాల మధ్య వున్న ఇంత పెద్ద తేడా, విద్య విషయంలో కొన్ని కులాలకు దక్కిన స్థానం ఆశ్చర్యం కలిగించే రీతిలో వున్నట్టు చూపుతోంది. పైన తెలిపిన గణాంకాల నుండి వివాదానికి తావేలేని రెండు వాస్తవాలను మనం చూడవచ్చు. 1) ఈ ప్రెసిడెన్సీలోని వెనుకబడిన వర్గాల విద్య స్థితి బాధ కలిగించేదిగా వుంది. జనాభా విషయంలో వారు రెండో స్థానంలో వున్నా, విద్య విషయంలో అట్టడుగున వున్నారు.

2) ఈ ప్రెసిడెన్సీలోని మహ్మదీయులు విద్యలో చాలా వేగంగా ముందుకు పోయారు. ముప్ఫయి సంవత్సరాల తక్కువ కాలంలో వాళ్లు మధ్యంతర, వెనుకబడిన తరగతుల వారిని దాటిపోవటం మాత్రమే కాదు, బ్రాహ్మణులు ఇతర అగ్రకులాలకు కూడా చేరువగా వచ్చారు.

18. ఎందుకిలా జరిగింది? ప్రభుత్వం చూపిన అసమానత్వమనే ఈ నిత్యనూతన ప్రశ్నకు మళ్లీ మనం చెప్పుకోవలసిన జవాబు. రెండు తరగతుల మధ్య అసమానత్వం ఎలా వుండిందో విద్యపై ప్రభుత్వం ప్రకటించిన పంచవర్ష నివేదికలోని ఈ ముఖ్య భాగాలను చూసి తెలుసు కోవచ్చు. విద్య విషయంలో మహమ్మదీయుల పట్ల ప్రవర్తించినతీరు, మూడో పంచవర్ష నివేదికలో (1892-96) చేసిన పరిశీలనలు గుర్తుంచుకోతగ్గవి.

"బాంబేలో మహమ్మదీయుల విద్యకు సంబంధించిన గణాంకాలను వివరిస్తూ, "దురదృష్టకరమైన పరిస్థితులవల్ల" మహమ్మదీయుల సంఖ్య పెరుగుతోందని డైరెక్టర్ చెప్పాడు. జనాభాలో మిగతా వారికంటే మహమ్మదీయులే ప్రభుత్వ సంస్థలను ఎక్కువగా ఉపయోగించుకుంటున్నారు. మహమ్మదీయుల విద్యను ప్రోత్సహించటానికి తాము ఏమి చేశామనే ప్రశ్నకు సమాధానం డైరెక్టర్ మాటల్లో:

"మొదటి స్థానంలో, ప్రతి జిల్లాకూ ఒక మహమ్మదీయ అధికారి డిప్యూటీ లేదా అసిస్టెంట్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్‌గా నియమించబడ్డాడు. కైరా, షోలాపూర్, హైదరాబాద్‌లలో ముగ్గురు మహమ్మదీయ పట్టభద్రులు మనకు వున్నారు. నాలుగో వ్యక్తి రెవెన్యూ శాఖలో ఉన్నత స్థానానికి ఎంపికయ్యాడు. మహమ్మదీయులు జిల్లా ప్రభుత్వ శాఖ ఏదీ లేదు. బాంబే, కరాచీ, జునాగఢ్ (కథియావాడ్‌లోని మహమ్మదీయ రాష్ట్రం)లలో తక్కువ ఫీజులతో మహమ్మదీయుల కోసం ఉన్నత పాఠశాలలు ప్రారంభించటానికి ప్రత్యేకంగా ప్రయత్నాలు జరిగాయి. మిగతా అంజుమన్లు (మహమ్మదీయ సంఘాలు) కూడా చిన్న పాఠశాలలు ప్రారంభించాయి. విద్యా శాఖ కూడా వీళ్ల ప్రయోజనం కోసం, ప్రత్యేక ప్రమాణాలను, ప్రత్యేక పాఠశాలలను ఏర్పరచి, ప్రాదేశిక, స్థానిక బోర్డుల స్కాలర్‌షిప్పులలో ముప్పాతిక వంతు కేటాయించింది. ఖాన్ బహద్దూర్ కాజీ షాబుద్దీన్ ప్రత్యేక స్కాలర్‌షిప్పులు ఏర్పాటు చేశారు. ఆర్ట్స్ కళాశాలలో చదువుకునే విద్యార్థులకోసం భోజన స్కాలర్‌షిప్పులు కూడా ఇచ్చారు. (ప్రతినెలా చాలా కష్టపడి వీటికోసం ఇరవై అయిదు రూపాయలు సమకూర్చాను) ప్రాథమిక పాఠశాలల్లో వీళ్లకి చాలా తక్కువ ఫీజు వుండేది హిందువుల కన్నా సులభమైన పరీక్ష పెట్టి ప్రత్యేక నిబంధనలతో వీళ్లు ట్రైనింగ్ కళాశాలల్లో చేర్చుకున్నారు. ఒక మహమ్మదీయ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్‌ను నియమించటం ద్వారా బాంబేలోని ఉమ్మడి పాఠశాలల కమిటీ మహమ్మదీయుల విద్యను ప్రోత్సహించటానికి ఆలస్యంగా ప్రత్యేక ప్రయత్నాలు చేసింది..."

19. అయిదవ పంచవర్ష నివేదిక (1902-1907)లో అణగారిన వర్గాల విద్యకు సంబంధించి చేసిన పరిశీలనలతో దీన్ని పోల్చి చూడండి.

"959. బాంబేలోని కేంద్ర విభాగంలో కింది కులాల పిల్లలను ఉచితంగా పాఠశాలల్లో చేర్చుకొని వారికి పుస్తకాలు, పలకలు మొదలైనవి ఇచ్చారు...

కథియావార్‌లో అణగారిన వర్గాలకు చెందిన ముగ్గురు పిల్లలకు మాత్రమే చదువు చెప్పుతున్నారు. దక్షిణ విభాగంలో వున్న 72 ప్రత్యేక పాఠశాలలను అర్హతలేని ఉపాధ్యాయులే నడుపుతున్నారు.

20. ఈ అసమానత్వానికి మూలం హంటర్ కమీషన్ సిఫారసులలో వుంది. అణగారిన వర్గాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని చేసిన సిఫారసులతో పోల్చిచూస్తే, మహమ్మదీయుల పట్ల హంటర్ కమీషన్ ఎంత పక్షపాతం చూపిందో తెలుస్తుంది. మహమ్మదీయుల కోసం ఈ కమీషన్ చేసిన పదిహేడు సిఫారసులలో ముఖ్యమైన వాటిని కింద ఇస్తున్నాను.

1. మహమ్మదీయుల విద్యను ప్రత్యేకంగా ప్రోత్సహించటానికి స్థానిక, మునిసిపల్, ప్రాదేశిక నిధులను ఉపయోగించటం న్యాయమైనదే.

(7) మహమ్మదీయులకు ఉన్నత ఇంగ్లీషు విద్యను అందించాలంటే ప్రత్యేకంగా సహాయం చేసి వారిని ఉదారంగా ప్రోత్సహించాలి.

(8) ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలలతో పాటు కళాశాలల్లో కూడా మహమ్మదీయులకు స్కాలర్‌షిప్పులు ఇచ్చే వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

(9) ప్రభుత్వ నిధులతో నడిచే అన్ని పాఠశాలల తరగతులలో మహమ్మదీయ విద్యార్థులు ఉచితంగా చదువుకునే అవకాశం కూడా కల్పించాలి.

10) మహమ్మదీయుల ప్రయోజనం కోసం ఉనికిలో వున్న ఆర్థిక వనరులను వారి విద్యా ప్రగతి కోసమే ప్రత్యేకంగా వినియోగించాలి.

11) మహమ్మదీయులు నివసించే చోట, ప్రయివేట్ వ్యక్తులు, సంఘాల నిర్వహణలో వున్న పాఠశాలలకు ఉదారంగా ఇచ్చే నిధులను వీరు ఇంగ్లీషు బోధించే పాఠశాలలు, కళాశాలలు స్థాపించుకోవటానికి ఉపయోగించాలి.

12) అవసరమున్నచోట, మహమ్మదీయ ఉపాధ్యాయులకు శిక్షణ నివ్వటానికి పాఠశాలలు స్థాపించాలి.

13) మహమ్మదీయుల కోసం ఏర్పాటు చేసి ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేయటానికి మహమ్మదీయ తనిఖీ అధికారులను పెద్ద సంఖ్యలో ఉద్యోగాల్లోకి తీసుకోవాలి.

14) చదువుకున్న మహమ్మదీయులు, ఇతరులపైన ఎంత ఖర్చు పెట్టారనే దానిపై స్థానిక ప్రభుత్వాలు దృష్టి పెట్టాలి.

21. హంటర్ కమీషన్ చేసిన సిఫారసులలో ప్రతి ఒక్కటే అణగారిన వర్గాల ప్రయోజనాలకు కూడా అవసరమే. కానీ, వెనుకబడిన వర్గాల ప్రయోజనాల కోసం కమీషన్ చేసిన సిఫారసులను విశ్లేషిస్తే, వెనుకబడిన వర్గాల విద్యను కానీ ప్రభుత్వ నిధులను, స్కాలర్‌షిప్పులను దానికోసం ఏర్పాటు చేయటాన్ని కానీ అవి నిర్దేశించలేదు. విద్యాపరమైన అవసరాలను తనిఖీ చేసే ఉద్యోగులను నియమించి, వెనుకబడిన వర్గాల్లో విద్యను పెంచటానికి ప్రభుత్వ పోషణ అందే విధంగా చర్యలు చేపట్టడం అవసరమని కూడా ఆ సిఫారసులు చెప్పలేదు. కమీషన్ చెప్తున్న దానిలో రెండు సిఫారసులున్నాయి.

1) కులాన్ని మాత్రమే ప్రాతిపదికగా చేసుకొని ఏ పిల్లవాడినీ కళాశాలలో లేదా పాఠశాలలో చేరటాన్ని తిరస్కరించరాదు. ప్రాదేశిక, మునిసిపల్, స్థానిక ప్రభుత్వాల నిధులలో నడిచే ఏ సంస్థలోనైనా ప్రత్యేక తెగలకు మాత్రమే కాకుండా అందరికోసమూ దీన్ని ఒక విధానంగా అమలు చేయాలి. (2) కింది కులాలకు చెందిన పిల్లలు తగినంత మంది వున్నప్పుడు వారు వుండే ప్రదేశాల్లోనే వారికోసం ప్రత్యేక పాఠశాలలు ప్రారంభించాలి. అప్పటికే ప్రభుత్వ నిధులతో పనిచేస్తున్న పాఠశాలలు వారి విద్యకోసం తగినన్ని వసతులు కల్పించకపోతే వాటిని కల్పించాలి. "నిజానికి, కమీషన్‌చేసిన

సిఫారసులు మహమ్మదీయుల ప్రయోజనాల కంటే వెనుకబడిన వర్గాల ప్రయోజనాలకే ఎక్కువ అవసరం.” మహమ్మదీయుల పట్ల అంతగా మక్కువ చూపిన కమీషన్, “ఉన్నత విద్య విషయంలో తప్ప, మహమ్మదీయుల వెనుకబాటు తనాన్ని గోరంతలు కొండంతలు చేసి చెప్పే ధోరణి చాలా కాలంగా వుందని 1871 - 73లో చేసిన పరిశీలనలు రుజువు చేశాయి” అని చెప్పాల్సి వచ్చింది.

కమీషన్ చేసిన ఈ రెండు సిఫారసులు కూడా ఆచరణలో విఫలమయ్యాయి. విద్యా విధాన సంకల్పం అయిదవసారి పనికి రాకుండా పోయింది. కమీషన్ పెట్టిన నిబంధనలో నిర్బంధంగా విద్య నేర్పటాన్ని ఆచరణలో విడిచిపెట్టారు.

దీనితోపాటు, అణగారిన వర్గాలకు ప్రత్యేక పాఠశాలలు ప్రారంభించటం దుస్సాధ్యమై ఫలితం లేకుండా పోయింది. ప్రాథమిక విద్య లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వానికి ప్రత్యేక పాఠశాలలపై అదనపు ఖర్చు పెట్టటం ఆమోదించతగిన విషయం కాకుండా పోయింది. దీనికితోడు, వెనుకబడిన వర్గాలు అధిక సంఖ్యలో వున్నచోట ఇలాంటి పాఠశాలలు ప్రారంభించాలనే నిబంధన సిఫారసులకు పూర్తిగా వ్యతిరేక ఫలితాన్నిచ్చింది. ఎందుకంటే, గ్రామీణ ప్రాంతాల్లో వెనుకబడిన వర్గాలు ఒకే ప్రదేశంలో ఎక్కువ సంఖ్యలో అరుదుగా మాత్రమే నివసిస్తారు.

22. వెనుకబడిన వర్గాల విద్యకు అవసరమైన వాటి పట్ల హంటర్ కమీషన్ ఎందుకు తగినంత దృష్టిపెట్టలేదో అర్థం చేసుకోవటం కష్టం. మహమ్మదీయుల పట్ల దయ చూపించటం అవసరమని ఒకవేళ అది భావిస్తే, విద్య, సంపద, సామాజిక హోదాలలో మహమ్మదీయులను అందుకోలేనంత దూరంలో వున్న వెనుకబడిన వర్గాలపట్ల చూపించటం కనీసమైన న్యాయం. అణగారిన వర్గాలను హంటర్ కమీషన్ ఒకసారి వెనక్కి నెట్టి వేసిన తర్వాత వాళ్లెప్పుడూ అక్కడే వుండిపోయారు. ప్రభుత్వం వాళ్లవైపు మళ్లీ కన్నెత్తి కూడా చూడలేదు. 1923 ఫిబ్రవరి 21న విద్యాశాఖలో భారత ప్రభుత్వం చేసిన తీర్మానం ఈ నిర్లక్ష్యానికి ఒక ఉదాహరణ. భారత ప్రభుత్వం ఇది వరకు చేసిన అతి ముఖ్యమైన తీర్మానాల్లో ఇది ఒకటి. దేశం నలుమూలల నుండీ వసూలు చేసిన శిస్తులు నిధులుగా పోగుబడే సమయానికి వాటితో స్థానిక ప్రభుత్వాలకు సహాయం చేయటానికి, చాలా ప్రాంతాల్లో విద్యను అర్థం చేసుకునే పద్ధతులను వ్యాప్తి చేయటానికి ఈ తీర్మానంలోనే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. “స్వదేశీయులు”, మహమ్మదీయుల విద్యాపరమైన అవసరాలేమిటో ప్రాదేశిక ప్రభుత్వాలకు భారత ప్రభుత్వం ప్రత్యేకంగా ఎత్తి చూపింది. మొత్తం తీర్మానంలో వెనుకబడిన వర్గాల గురించి ఒక్కమాట కూడా చెప్పలేదు. మహమ్మదీయుల్లో విద్యావ్యాప్తి కోసం తగిన సిఫారసులు చేయటానికి ఒక మహమ్మదీయుడిని వెంటనే ఆమోదించి 1913లో విద్యాకమిటీలో నియమించింది. ప్రభుత్వం ప్రదర్శించిన ఇలాంటి నేరపూరితమైన నిర్లక్ష్యం చూసి ఎవరికైనా ఆవేశం కట్టలు తెంచుకోవటం న్యాయమే. బ్రిటిష్ చక్రవర్తి చేసిన ప్రకటనను నెరవేరుస్తున్నామనే పద్ధతిలో 1913

తర్వాత భారత ప్రభుత్వం పెద్ద మొత్తంలో ధన సహాయం చేసిందని తెలిసిన తర్వాత కూడా కోపం రాకుండా వుండటం కష్టం. జనవరి 6న కలకత్తా విశ్వ విద్యాలయానికి ఇచ్చిన ప్రత్యుత్తరంలో ఆయన ఇలా అన్నాడు.

"దేశంలోని పౌరులు విశ్వాసపాత్రులుగా, ప్రయోజకులుగా, తమ పరిశ్రమలను, వ్యవసాయాన్ని, జీవితంలోని అన్ని వృత్తులనూ సమర్థవంతంగా నిర్వహించుకునే విధంగా పాఠశాలలు, కళాశాలల వ్యవస్థ వ్యాప్తి చెంది వుండవచ్చని ఆశిస్తున్నాను. నా భారత ప్రజల ఇళ్లలో కూడా వెలుగులు నిండుతాయని, విజ్ఞానం వ్యాప్తి చెందటం ద్వారా వారి శ్రమ ఫలిస్తుందని, దానితోపాటు ఉన్నత స్థాయి ఆలోచన, సౌకర్యం, ఆరోగ్యం లభిస్తాయని కూడా నేను ఆశిస్తున్నాను. విద్య ద్వారా నా కోరిక నెరవేరుతుంది. భారత దేశంలో విద్య ఫలించటం నా మనసుకు ఎప్పటికీ దగ్గరగా వుంటుంది."

# IV

## బ్రిటిష్ ప్రభుత్వం పాలనలో సాంఘిక సంస్కరణల మాటేమిటి?

చివరి తరానికి చెందిన ప్రముఖుడు, అభ్యుదయ హిందువు అయిన రాజా సర్ టి. మాధవరావు మాటల్లో "ఒక వ్యక్తి ఎక్కువ కాలం జీవించి, పరిశీలించి, ఆలోచిస్తే, రాజకీయ దురాచారాలతో తక్కువగా బాధపడుతూ, తమని తామే శిక్షించుకొని, ఆమోదించుకొని, తమకి తామే సృష్టించుకొనే దురాచారాలతో ఎక్కువగా బాధపడే సమాజం హిందూ సమాజం తప్ప భూమ్మీద మరొకటి లేదని గాఢంగా అనుభూతి చెందుతాడు."

ఈ పరిశీలనలో న్యాయాన్యాయాల ప్రశ్నను పక్కనపెడితే, సాంఘిక దురాచారాలతో హిందూ సమాజం బాధ పడినంతగా మరో సమాజం బాధ పడదు. అనే విషయంలో సందేహమే లేదు.

సాంఘిక సంస్కర్తల్లో ప్రముఖుడైన మహదేవ్ గోవింద్ రనడే ఇంతే విలువైన మరో పరిశీలన చేశాడు. హిందూ సమాజానికి వున్న మరో కోణాన్ని ఆయన నొక్కి చెపుతూ –

"ఖర్చులు, లాభ నష్టాల ఆర్థిక అంచనాలు మాత్రమే ఒక సమాజాన్ని సాంఘిక సంస్కరణలు చేపట్టి వాటి ద్వారా ముందుకు తీసుకొని పోయేట్టు ఎప్పటికీ చేయలేవు. ప్రత్యేకించి, ఆచారం, అధికారాలతో కట్టివేయబడిన మన సమాజంలో ఇది వీలుకాదు. ప్రాపంచిక లక్షణంలో వుండే కుళ్లు మన సాంఘిక ఆచారాలలో నిండి పోయిందని మన ప్రజలు గొప్పగా అనుకుంటారు. వీటిలోని పవిత్రత దెబ్బ తింటే చాలా మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని భావిస్తారు. నిజమేమిటంటే, సాంప్రదాయ సమాజం తన జీవశక్తిని కోల్పోయింది, అది ఏ సంస్కరణనూ మొదలు పెట్టలేదు, దానిపట్ల సానుభూతినీ చూపలేదు."

ఇంకోమాటలో చెప్పాలంటే అన్ని సాంఘిక దురాచారాలకూ మతమే పునాది. ఒక హిందూ పురుషుడైనా స్త్రీ అయినా, ఏమి చేసినా దాన్ని ఒక మతాచారంగానే చేస్తారు. ఒక హిందువు తిండి తినటంలో మతముంటుంది. తాగటంలో, స్నానం చేయటంలో, బట్టలు వేసుకోవటంలో, పుట్టుకలో, పెళ్లి చేసుకోవటంలో చివరికి దహనం కావటంలో కూడా మతముంటుంది. అతనికి ఇవన్నీ పవిత్ర కార్యాలే. చివరికి ఎవరైనా అతడిని 'నువ్వు పాపం చేస్తున్నావు' అంటే, "ఒక వేళ నేను పాపినైతే, ఆ పాపాన్ని మత ఆచారాల ప్రకారమే చేస్తున్నాను" అని జవాబిస్తాడు.

సమాజం ఎప్పుడూ ఛాందసంగానే వుంటుంది. పరిస్థితులు వత్తిడి తెచ్చినప్పుడు మాత్రమే సమాజం మారుతుంది. అదీ నెమ్మదిగానే మారుతుంది. మార్పు ఎప్పుడు మొదలైనా పాతకూ కొత్తకూ మధ్య ఘర్షణ వుండి తీరుతుంది. గట్టి మద్దతు లభించకుంటే కొత్త ఓడిపోయే ప్రమాదం వుంటుంది.

సాంఘిక సంస్కరణను ముందుకు తీసుకొని పోవాలంటే చట్టపరమైన మద్దతు చాలా అవసరం. చట్టం మద్దతు లేకుండా ఏ సామాజిక రుగ్మతనూ పోగొట్టలేము. ఆ రుగ్మత మతంతో ముడిపడిందైతే చట్టం అవసరం మరింత పెరుగుతుంది.

సాంఘిక సంస్కరణ కోసం బ్రిటిష్ ప్రభుత్వం ఎన్ని చట్టాలు చేసింది? వారి చరిత్ర చూస్తే, సంఘాన్ని సంస్కరించటంలో వారు సాధించిన విజయం నిరాశాజనకంగా వుంది. 150 ఏళ్ల పాలనలో కేవలం ఆరు చట్టాలే చేశారు.

బ్రిటిష్ వారు రూపొందించిన మొదటి చట్టం బెంగాల్ క్రమబద్ధీకరణ 21/1795. ఇది బెనారస్ సంస్థానంలో బ్రాహ్మణులు కూరాలు (కుండాలు) ఏర్పాటు చేయకుండా, ఆడశిశువులు, బాలికలను గాయపరచకుండా, చంపకుండా చూసేందుకు ఉద్దేశించినది. అదే విధంగా రాజకుమార్ల తెగక్కూడా ఇది వర్తిస్తుంది.

**ఉపోద్ఘాతం**

1. బ్రాహ్మణుల పట్ల వున్న గౌరవం, భయభక్తుల కారణంగా బెనారస్, కుంతిత్,బంధో పరగణాలలోని కొన్ని ప్రాంతాల్లో నివసించే మిగతా కులాల వారికి న్యాయం జరగటం లేదు. బ్రాహ్మణులకు వ్యతిరేకంగా కొన్ని శాసనాలు అమలు చేయటానికి గానీ ప్రభుత్వ పరంగా ఏదైనా చర్య తీసుకోవటానికి గానీ ఈ ప్రాంతాల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇలాంటి సందర్భాల్లో బ్రాహ్మణులు తమ శరీరాలను కత్తులతో కోసుకుంటారు. విషం మింగుతామని బెదిరిస్తారు. విషం కాకపోతే మరో హానికరమైన పదార్థాన్ని మింగుతామంటారు. కుండం (కూరా) అనే ఒక పరిధి నిర్మించుకొని అందులో కట్టెలు పేర్చి మండే వస్తువులు వేసి నిరసన (నిజమో నాటకమో) తెలుపుతారు. ఒక వృద్ధురాలిని బలికి సిద్ధం చేసి కుండలో అగ్ని రగిల్చి ప్రభుత్వ పక్షాన ఎవరైనా వత్తిడి తెచ్చినా తమకు వ్యతిరేకంగా ఏ చర్యలు చేపట్టినా నిరసన తెలుపుతారు. బ్రాహ్మణులు తమకు కావలసిన పరిష్కారం లభించకపోయినా,

తమకు నిరాశ, నిరుత్సాహం, నష్టం కలిగినా, తాము ఆశించినది జరగకపోయినా తమ ఇళ్లల్లోని ఆడవారిని, పిల్లలను బయటకి తీసుకొని వచ్చి ప్రభుత్వ ప్రతినిధి రాకను అడ్డగిస్తూ కూర్చోబెడతారు. కత్తి తీసి వారి తలలు నరుకుతామని బెదిరిస్తారు. వారిని బంధించినా వత్తిడి చేసినా తమ శరీరాలను గాయాలు చేసుకోవటమే కాకుండా ఆడవారిని,ఇతర కుటుంబ సభ్యుల తలలను కత్తులతో నరుకుతారు. కొంత మంది అంతకుముందే బలికి కావలసిన ఏర్పాట్లు చేస్తారు. ఆడవాళ్లు కూడా ఈ పనికి ఇష్టంగా ఒప్పుకుంటారు. ఆత్మబలిదానం గౌరవప్రదమైనదని వాళ్లు భావిస్తారు. ఇటువంటి పద్ధతులతోనే బ్రాహ్మణులు తమకు రావలసిన బాకీలను వసూలు చేసుకోవటానికి, విరాళాలు తీసుకోవటానికి ఆయుధాలు, విషం తీసుకొని సంబంధిత వ్యక్తి ఇంటి ముందు చేరతారు. 'ధర్నా' అనే పద్ధతిని అనుసరిస్తూ తమ పంతం నెగ్గేదాకా ఆ ఇంటి ముందు నిరాహారదీక్ష చేస్తారు. తిండి తినకుండా బ్రాహ్మణుడు ఇంటి ముందు కూర్చుంటే ఆయనకు తృప్తి అయ్యేవరకూ ఇంట్లో ఎవరూ భోజనాలు చేయటానికి వీలు లేదు. ఈ పని పూర్తయ్యేవరకూ ఆ ఇంటికి వేరే రాకపోకలు కూడా వుండవు. వీరిని 'ధర్నా' నుంచి వెళ్లగొట్టటానికి రక్షక భటులుగానీ న్యాయస్థానంలోని అధికారులు గానీ ఏమీ చేయలేరు. వారిని ఏ మాత్రం బంధించే ప్రయత్నం చేసినా వారు కత్తితో పొడుచుకోవటమో విషం తాగటమో చేస్తారు. ఇలాంటి క్రూరమైన దురాచారాలు తిరిగి ప్రాణం పోసుకోకుండా అడ్డుకోవలసి వుంది. రాజకుమారుల తెగలో కూడా ఈ దురాచారం వుంది. జీవించటానికి ఏ దారీ లేకపోతే పసి బాలికలను చంపటం వంటి అనాగరిక దురాచారాలను నిరోధించేందుకు ఈ క్రమ బద్ధీకరణ చేయడమైనది.

## మహిళలు, పిల్లలను శారీరకంగా హింసించి, వారి హత్యకు సిద్ధపడిన బ్రాహ్మణులు

II. ఉపోద్ఘాతంలో వివరించిన విధంగా ప్రవర్తించిన బ్రాహ్మణులపై జిల్లా కోర్టుకు,నగర మెజిస్ట్రేట్‌కు రాత పూర్వకంగా ఎవరైనా ఫిర్యాదు చేస్తే ఆ మెజిస్ట్రేట్ వెంటనే బ్రాహ్మణులను సంప్రదించాలి. (బ్రాహ్మణుడైన ప్రతివ్యక్తికీ ఇది వర్తిస్తుంది) పర్షియన్ భాషలోనో, హిందూస్తానీ భాషలో నాగరీ లిపిలో రాతపూర్వక నోటీసును తన అధికార ముద్రతో రూపొందించి ఆ బ్రాహ్మణులకు నేరుగా కానీ, బంధువులు, మిత్రుల ద్వారా కానీ నోటీసు ఇప్పించాలి. కోర్టు ప్రతినిధి ద్వారా కూడా ఆ నోటీసును అందజేయవచ్చు. కుండం ఏర్పాటు చేసి ఆడవాళ్లను, పిల్లలను శారీరకంగా హింసిచినట్టు వచ్చిన నేరారోపణల గురించిన పూర్తి సమాచారం వారికి అందజేయాలి. ఒక వేళ వారు ఈ పనులను విరమించుకుంటే కుండం ఏర్పాటు చేయటానికి పురికొల్పిన సమస్యలపై విచారణ జరిపిస్తామని హామీ ఇవ్వాలి. నోటీసులో వున్న హామీని అనుసరించి బ్రాహ్మణులు ప్రవర్తించకపోతే ఆ విషయం కూడా నోటీసుపై రాసి ధృవీకరించాలి. మెజిస్ట్రేట్ బ్రాహ్మణులను (లేదా బ్రాహ్మణుడు) అదుపులోకి

తీసుకోవటానికి తన అధికారముద్ర సంతకం కింద వారంట్ జారీ చేయాలి. అందులో ఆ బ్రాహ్మణులపై నేరారోపణ వుండాలి. వారంట్ అమలు చేయటానికి మహమ్మదీయ మతానికి చెందిన ప్యూన్లను కానీ ఎవరైనా హిందువును కానీ నియమించవచ్చు. ఆ బ్రాహ్మణులను మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచిన తర్వాత రెగ్యులేషన్ IX, 1793 సెక్షన్ 5లో నిర్దేశించిన విధానం ప్రకారం వారితో వ్యవహరించాలి. ఆరోపించబడిన నేరాలు అప్పటికీ జరిగిపోయివుంటే, నేరం చేసిన వారిని, అందుకు సహకరించిన వారిని జైలుకు పంపాలి. లేదా బెయిల్‌పై విడిచిపెట్టాలి. తర్వాతి సెషన్‌లో వారిపై సర్క్యూట్ కోర్టులో విచారణ జరిపి, ఫిర్యాదిని, సాక్షులను పిలిపించి, ఆ సెక్షన్‌లో వివరించిన విధంగా చర్యలు తీసుకోవాలి.

పై నేరాలు చేసినందుకు కోర్టు విచారణ, విధించవలసిన శిక్షలు

III. సర్క్యూట్ కోర్టు వారు రెగ్యులేషన్ IX, 1793, XVI, 1795లలో నిర్దేశించిన ప్రక్రియను అనుసరించి బ్రాహ్మణులను విచారించాలి. ఇలాంటి స్థానిక నేరాలకు మహమ్మదీయ చట్టం ఉపయోగించరాదు. కుండం ఏర్పాటు చేసినట్టు గానీ, ఇతర నేరాలకు పాల్పడినట్టుగానీ రుజువైన పక్షంలో ఖైదీకి అతని వార్షిక ఆదాయానికి సమానమైన సొమ్మును, నేరానికి సహాయం చేసినట్టు రుజువైతే వార్షిక ఆదాయంలో నాలుగో వంతు సొమ్మును జరిమానాగా విధించవచ్చు. ఇది చెల్లించే వరకు వారు జైల్లో వుండాలి. లేదా అందుకు సరైన జమానత్ చూపాలి. విడుదలైన ఆరు నెలల్లోగా చెల్లించేందుకు గానీ, ఇతర సెక్యూరిటీ ఇవ్వటంగానీ లేదా మళ్లీ నేరానికి పాల్పడననిగానీ హామీ ఇవ్వాలి.

నిజామత్ అదాలత్‌కు జరిమానా తగ్గించే అధికారం

IV. సెక్షన్ 3 కింద సర్క్యూట్ కోర్టు విధించిన శిక్షలను వెంటనే తాత్కాలికంగా రద్దు చేయకుండా పదిరోజుల్లో నిజామత్ అదాలత్‌కు పంపించాలి. ఆ కోర్టు శిక్షలను తగ్గించవచ్చు. సరైనదేనని భావిస్తే జరిమానాలను యధాతథంగా అమలు చేయవచ్చు. నిజామత్ అదాలత్ ఉత్తర్వులు జారీ చేసే దాకా సర్క్యూట్ ఉత్తర్వులు మార్చటానికి వీలులేదు.

## మెజిస్ట్రేట్ వారంట్ జారీ చేసిన తర్వాత బ్రాహ్మణుడు పారిపోతే సెక్షన్ 2 కింద శిక్ష

V. సెక్షన్ 2 కింద జిల్లా లేదా నగర మెజిస్ట్రేట్ జారీ చేసిన వారంట్‌ను ఏ బ్రాహ్మణుడైనా అడ్డుకున్నా, నిరాకరించినా, కోర్టు ప్యూన్లను వెనక్కి పంపినా, పారిపోయినా, ఏదైనా గదిలోకి వెళ్లి గడియవేసుకున్నా, కస్టడీలోంచి తప్పించుకున్నా, ఏదో ఒక రకంగా వారంట్ అమలు కాకుండా చూసినా, వెంటనే కలెక్టరుకు లేఖ రాసి అతని భూములను తాసిల్దార్ ద్వారా జప్తు చేయమని కోరవచ్చు. ఆ భూములు ఆస్తిగా వున్నా, తాకట్టులో వున్నా, పొలాల రూపంలో వున్నా, 'లఖరాజ్'గా వున్నాసరే

వాటిని జప్తు చేయమని కోరవచ్చు. అతను లొంగిపోయేవరకూ వీటిని జప్తులోనే వుంచాలి. ఆ భూమి ద్వారా వచ్చిన వసూళ్ల నుంచి ప్రభుత్వానికి బాకీ వున్న పన్నులు మినహాయించుకొని మిగిలిన సొమ్మును లొంగిపోయిన తర్వాత ఆ బ్రాహ్మణుడికి అందజేయాలి. కుండం ఏర్పాటు చేయటం, తన ఇంటిలోని ఆడవాళ్లు, పిల్లలపై దాడి చేయటం, వారిని గాయపరచటం, చంపటానికి ప్రయత్నించటం వంటి నేరాల విచారణ కోసం లొంగిపోయిన తర్వాత ఆ భూములను తిరిగి వారికి అప్పగించవచ్చు. వారిని సెక్షన్ 3,4 కింద విచారించాలి.

## బ్రాహ్మణుడు పైన తెలిసిన నేరాలకు సిద్ధపడితే, కలెక్టర్ - రెవెన్యూ శాఖ విధానం ప్రకారం చర్య తీసుకోవటానికి మెజిస్ట్రేట్‌కు దరఖాస్తు పెట్టుకోవటం

VI. పన్ను బకాయిలు చెల్లించాలని తాసీల్దారు, కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వుకు వ్యతిరేకంగా బ్రాహ్మణుడు పైన తెలిసిన నేరాలకు పాల్పడితే VI 1795 రెగ్యులేషన్ ప్రకారం బెనారస్ కలెక్టరు, తాసీల్దారు దస్తక్‌లు జారీ చేయవచ్చు. తాసీల్దార్ జారీ చేసిన దస్తక్‌ను వ్యతిరేకిస్తే తానే అమలు చేయకుండా కలెక్టరుకు ఫిర్యాదు చేయాలి. దస్తక్ అందించే కోర్టు ప్యూన్ రాతపూర్వక ప్రకటనను కూడా జతపరిచి, దానికి బ్రాహ్మణుడు ఏ విధంగా స్పందించినా, ప్రభుత్వానికి అతడు బాకీ వున్న సొమ్ము గురించి ప్రభుత్వ న్యాయవాది ద్వారా కలెక్టర్ జిల్లా లేదా నగర మెజిస్ట్రేట్‌కు ఫిర్యాదు చేయాలి.

బ్రాహ్మణుడు నేరాలు చేశాడనటానికి సాక్ష్యాధారాలుంటే ఇంతకు ముందే వివరించిన పద్ధతిలో అతనికి నోటీసు అందజేసి రెవెన్యూ బకాయిలు చెల్లించమని కలెక్టర్ ఆదేశించాలి. దీనికి వ్యతిరేకంగా అతడు ఏమైనా చెప్పుకోవాలనుకుంటే అందుకు తగిన అవకాశం కూడా ఇవ్వాలి. రెగ్యులేషన్ VI, 1795 లో పేర్కొన్న సూత్రాలను, రెవెన్యూ అకౌంట్లు, డిమాండ్లను అనుసరించి, కేసు బలాబలాల ఆధారంగా విచారణ జరిపించి తీర్మానం చేయాలి. బ్రాహ్మణుడు పై నేరాలు చేయకుండా, రెవెన్యూ బకాయి, కోర్టుకు జమానత్ చెల్లిస్తే బకాయి డిమాండ్‌లోని న్యాయాన్యాయాలపై సరైన విచారన జరిపిస్తామని నోటీసులో హామీ ఇవ్వాలి. నోటీసు ద్వారా బ్రాహ్మణులు ఈ పనులు చేయటం మానుకోకపోతే, విధివిధానాలను అనుసరించి వారి భూములను జప్తు చేయవచ్చు. ప్రభుత్వ బాకీ తీరే వరకూ జప్తులో వున్న భూమిపై వచ్చే లాభాలు ప్రభుత్వానికి చెందుతాయి. బ్రాహ్మణుడు లొంగిపోయే వరకూ ఆ భూములు జప్తులోనే వుంటాయి. అతడు చేసిన నేరాలన్నిటికీ సహకరించిన వారిని కూడా విచారించాలి. సెక్షన్ 2, 3, 4 ప్రకారం శిక్ష తగ్గించే అధికారం కూడా కోర్టుకు వుంది.

## కుండంలో కాలి ఎవరైనా చనిపోతే ఆ హత్యానేరంపై విచారణ

VII. ప్రభుత్వ అధికారులు, ఇతర ఉద్యోగులు తమ బాధ్యత నిర్వర్తించకుండా అడ్డుకోవటానికి కుండం ఏర్పాటుచేసి, అందులో వేసి ఎవరినైనా చంపితే ఆ

బ్రాహ్మణులు, అందుకు సహకరించిన వారందరిపైనా హత్యానేరం మోపి విచారణ జరిపించాలి. ఈ నేరం రుజువైతే సర్క్యూట్ కోర్టు బ్రాహ్మణులకు, మిగతా వారికి మరణ శిక్ష విధించాలి. మహమ్మదీ శాసనం ప్రకారం కుట్రపన్ని చేసిన హత్యగా దీన్ని పరిగణించి, ఈ నేరంపై జరిగిన విచారణ, దోషులకు పడిన శిక్షల గురించి ప్రజలకు చెప్పాలి. రెగ్యులేషన్ IX, 1793 సెక్షన్ 47లో పేర్కొన్న విధంగా ఈ వివరాలను నిజామత్ అదాలత్ కూడా తెలపాలి. ఆ కోర్టు అంతిమ తీర్పు ఇచ్చే వరకూ నిందితులు జైల్లో వుండాలి. నిజామత్ అదాలత్ ఆ శిక్షను ఒప్పుకుంటే వారిని కలకత్తాకు పంపించాలి. అక్కడ, వారికి సెక్షన్ 23, రెగ్యులేషన్ XVI, 1795 ప్రకారం యావజ్జీవ దేశ బహిష్కార శిక్ష విధించాలి. బ్రాహ్మణులు బెనారస్ సంస్థానం పరిధిలో హత్య చేస్తే ఈ సెక్షన్ ప్రకారం వారికి విధించిన మరణ శిక్షను తగ్గించవచ్చు. సర్క్యూట్ కోర్టు విధించిన శిక్షలో న్యాయం లేదని భావిస్తే నిజామత్ అదాలత్ ఆ శిక్షను తగ్గించవచ్చు. నిందితులు, వారికి సహకరించిన వ్యక్తులకు శిక్ష తగ్గించాలని లేదా క్షమాభిక్ష పెట్టాలని గవర్నర్ జనరల్ ఇన్‌కౌన్సిల్‌ను కోర్టు కోరవచ్చు.

## ఆడవాళ్లు, పిల్లలను గాయపరిచిన బ్రాహ్మణులకు శిక్షలు

VIII. ఉపోద్ఘాతంలో వివరించినట్టు, కుండం ఏర్పాటు చేసి, బ్రాహ్మణులు తమపై ఆమీల్, తాసీల్దార్, నౌకర్లు, రెవెన్యూ తదితర ప్రభుత్వోద్యోగులు, న్యాయ ప్రతినిధులు లేదా ఇతర వ్యక్తులు తీసుకునే చర్యలకు వ్యతిరేకంగా నిరసన తెలిపే విధంగా కత్తితో తమని తాము లేదా తనవారిని, ఆడవాళ్లను, పిల్లలను, అలాగే ఇతరులను కత్తితో గాయపరిస్తే సర్క్యూట్ కోర్టు వారికి బహిష్కార శిక్ష విధించవచ్చు. ఆ తీర్పును నిజామత్ అదాలత్ ఆ శిక్షను తగ్గించవచ్చు.★

## ఆడవాళ్లు, పిల్లలను చంపినందుకు బ్రాహ్మణులకు శిక్షలు

IX. పైన పేర్కొన్నట్టు, బ్రాహ్మణులు తమపై ఎవరు చర్యలు తీసుకున్నా వాటికి వ్యతిరేకంగా, నిరసనగా తమ కుటుంబం, బంధువర్గంలోని ఆడవాళ్లు, పిల్లలను లేదా తక్కిన ఆడవాళ్లు, పిల్లలను చంపినట్టు రుజువైతే సర్క్యూట్ కోర్టు వారికి మరణశిక్ష విధించవచ్చు. శిక్ష తగ్గింపుకోసం జమానత్ అదాలత్‌ను ఆశ్రయించవచ్చు. గవర్నర్ జనరల్ ఇన్ కౌన్సిల్ 1789 జూన్ 17వ తేదీన జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, నేరస్థులైన బ్రాహ్మణులను, వారి కుటుంబాలను బెనారస్ సంస్థానం నుండి, ప్రభుత్వ పాలనలో వున్న ఏ ప్రాంతం నుండైనా బహిష్కరించవచ్చు. వారి భూములను, ఆస్తులను స్వాధీనం చేసుకొని ప్రభుత్వం వాటిని అమ్మి వేయవచ్చు. సర్క్యూట్ కోర్టు తన తీర్పులో అన్ని రకాల ఉత్తర్వులనూ చేర్చి వాటిని వెంటనే నిజామత్ అదాలత్‌కు పంపాలి. బ్రాహ్మణులకు విధించిన శిక్షను అమలు చేయాలా, తగ్గించాలా, ఆస్తులు

★ తీర్పును నిజామత్ అదాలత్‌కు తెలిపి, సెక్షన్ 7 ప్రకారం క్షమాభిక్షను, శిక్ష తగ్గింపును కోరవచ్చు.

స్వాధీనం చేసుకోవాలా అని కూడా సూచించాలి. ఈ విషయమై నిజామత్ అదాలత్ గవర్నర్ జనరల్ ఇన్ కౌన్సిల్‌ను సంప్రదిస్తుంది. ఆయన ఉత్తర్వులు జారీ చేస్తే ఎలాంటి శిక్షనైనా అమలు చేయవచ్చు. దేన్నయినా స్వాధీనం చేసుకోవచ్చు. ఏదైనాసరే, ఆయన నిర్దేశించిన ప్రకారమే అమలు చేయాలి.

## నేరస్తుల ఆస్తుల స్వాధీనానికి పరిమితులు

X. సర్క్యూట్ కోర్టు విధించిన శిక్షను తగ్గించాలని నిజామత్ అదాలత్ భావిస్తే, ఆ విషయాన్ని గవర్నర్ జనరల్ ఇన్ కౌన్సిల్‌కు తన లేఖలో సూచించాలి. ఆయన బహిష్కార శిక్షను ఒక వ్యక్తికి లేదా కొందరికి మాత్రమే పరిమితం చేయాలని నియమం. అలాంటి సందర్భాల్లో ఆస్తులను స్వాధీనం చేసుకోవటం వుండదు. బహిష్కార శిక్షనుండి మినహాయించిన వ్యక్తుల అధీనంలోనే ఆ ఆస్తులు వుంచాలి.

## ధర్నాలో వున్న బ్రాహ్మణులకు సంబంధించిన రెగ్యులేషన్స్

XI. మొదటిది: 1792, నవంబర్ 2న గవర్నర్ జనరల్ ఇన్ కౌన్సిల్ ఉత్తర్వు, డిసెంబర్ 22, 1792లో బెనారస్‌లో జారీ అయిన ఉత్తర్వు, 1794 నవంబర్ 7న ఆయన జారీ చేసిన మరో ఉత్తర్వు ప్రకారం ధర్నా చేసినందుకు, ప్రభుత్వ ఉద్యోగులను అడ్డగించినందుకు బ్రాహ్మణులను విచారించి శిక్షించే విషయమై ఈ కింది నియమాలు రూపొందించారు.

## ధర్నా చేస్తున్న బ్రాహ్మణుల అరెస్టుకు మెజిస్ట్రేట్ ఆదేశించటం

రెండవది: బ్రాహ్మణులు ధర్నా చేస్తున్నట్టు ఫిర్యాదు అంది, అది నిజమే అని రుజువైతే మెజిస్ట్రేట్ వారికి అరెస్ట్ వారంట్ జారీ చేయాలి. అరెస్టయిన వ్యక్తుల నేరాలను, అందుకు దారి తీసిన పరిస్థితులను విచారించటానికి ఫిర్యాదితో పాటు సాక్షుల వాంగ్మూలాలను తీసుకోవాలి. ఈ కేసుతో సంబంధం వున్న వారందరి నుండీ రాత పూర్వకంగా ప్రకటన తీసుకోవాలి. విచారణ తర్వాత నేరం రుజువు కాకపోతే ఆ బ్రాహ్మణులను వెంటనే విడుదల చేయాలి. ఒక వేళ రుజువైతే ప్రధాన నిందితులు, వారికి సహకరించిన వారందరినీ జైల్లో పెట్టాలి లేదా వారికి బెయిల్ మంజూరు చేయాలి. తదుపరి విచారణలో వారిని ప్రాసిక్యూట్ చేయటానికి, సాక్షులను ప్రవేశపెట్టటానికి సెక్షన్ 5, రెగ్యులేషన్ XVI ప్రకారం సర్క్యూట్‌కోర్టుకు పంపాలి. ఈ రెగ్యులేషన్, 1795 రెగ్యులేషన్ XVI ప్రకారం విచారణ జరపాలి. తర్వాత పండిట్ వ్యవస్థకు ఈ కేసు పంపి 'శాస్త్రం' ఏమి చెపుతుందో రాత పూర్వకంగా వివరించాలని మెజిస్ట్రేట్ కోరాలి. నేరం రుజువై న్యాయపండితులు కూడా దాన్ని ధృవీకరిస్తే, దోషులను బెనారస్ నుండి బహిష్కరించి వారి హక్కులను స్వాధీనం చేసుకోవాలి. శిక్షను అమలు చేసే విషయంలో సర్క్యూట్ కోర్టు ఈ కేసును నిజామత్ అదాలత్‌కు పంపితే, అక్కడినుండి సరైన ఉత్తర్వులు వచ్చే వరకూ శిక్షను అమలు చేయరాదు.

## నేరం జరిగినా, 'ధర్నా' చట్టబద్ధంగా రుజువు కాకపోయినా సర్క్యూట్‌కోర్టు చేపట్టవలసిన ప్రక్రియ

XII. సెక్షన్ 2 కింద, నేరం (ధర్నా) జరిగినట్టు సరైన ప్రమాణాలతో న్యాయ పండితులు ధృవీకరించకపోయినా, తన దగ్గరున్న సాక్ష్యాధారాలతో నేరం జరిగిందనే అభిప్రాయానికి సర్క్యూట్ కోర్టు వస్తే, మళ్లీ ధర్నా కానీ, అలాంటి ఏ చర్యా చేయబోమని ఖైదీల నుండి హామీ తీసుకోవాలి. సర్క్యూట్ కోర్టులో విచారణ జరిపిన న్యాయమూర్తుల్లో అత్యధికులు ఆ చర్యను ధర్నా గానే భావించినా, రెండోసారి నేరానికి పాల్పడినట్టు రుజువైనా దోషులు రాజ్య బహిష్కారంతో పాటు తమ హక్కులు, ఆస్తులు కూడా కోల్పోవలసి వుంటుంది.

## రాజకుమారుల విషయంలో నేర విచారణ పద్ధతి

XII. బెనారస్ సంస్థానంలో జిల్లా, నగర కోర్టుల పరిధిలో, రాజకుమారులు తమ ఆడపిల్లలను పోషించకుండా ఆకలి చావులకు గురిచేసే చర్యలు ఆధారాలతో రుజువైతే, సెక్షన్ 5, రెగ్యులేషన్ IX 1793 కింద మెజిస్ట్రేట్ వారిని బంధించి, విచారణకు ఆదేశించాలి. జరిగిన నేరంలో ఖైదీల ప్రమేయం వుందని మెజిస్ట్రేట్ భావిస్తే, వారిని జైలుకు పంపి సర్క్యూట్ కోర్టులో విచారణ పంపాలి. సమాచారం ఇచ్చినవాళ్లు, ఫిర్యాదు చేసిన వ్యక్తులు కోర్టుకు హాజరు కావటానికి అన్ని చర్యలూ తీసుకొని, రెగ్యులేషన్ IX 1793, రెగ్యులేషన్ XVI 1795ల కింద ఖైదీలను హత్యానేరం కింద విచారణ జరపాలి. బ్రిటిష్ ప్రభుత్వం చేసిన రెండో సాంఘిక శాసనం బెంగాల్ రెగ్యులేషన్ VI ఆఫ్ 1802. సావ్‌గర్, తదితర ప్రాంతాల్లో బాలల బలిని నిరోధించటానికి ఈ రెగ్యులేషన్ చేశారు. అది ఈ విధంగా వుంది:

## రెగ్యులేషన్ VI క్రీ.శ. 1802

సావ్‌గర్, తదితర ప్రాంతాల్లో బాలల బలిని నిరోధించటం కోసం 1802 ఆగస్ట్ 20న గవర్నర్ జనరల్ ఇన్ కౌన్సిల్ జారీ చేసిన రెగ్యులేషన్ ఇది.

I. సావ్‌గర్, బస్ బర్యా, చాగధ్, గంగానది చుట్టు పక్కల ప్రాంతాల్లో పిల్లలను నీటిలోకి విసిరి లేదా సొర చేపలకు ఎరగా వేసి బలి ఇచ్చే అమానుష నేరాలు అమలులో వున్నట్టు గవర్నర్ జనరల్ ఇన్ కౌన్సిల్ దృష్టికి వచ్చింది. సావ్‌గర్‌లో ప్రతి ఏటా జనవరి, నవంబర్ నెలల్లో వచ్చే పున్నమి రోజున క్రమం తప్పకుండా చిన్న పిల్లలతో పాటు పెద్దవారిని కూడా బలులు ఇస్తున్నారు. అక్కడి ప్రాంతాల్లో నివసించే ప్రజల ఆచారం ప్రకారం పిల్లలను సముద్రంలోకి విసిరేసిన తర్వాత మళ్లీ వాళ్లను రక్షించరాదు. హిందూ న్యాయం ప్రకారం చూసినా ఈ బలికి ఆమోదం లేదు. మహమ్మదీయ, హిందూ ప్రభుత్వాలు ఏనాడూ ఈ బలులను సమర్థించలేదు. కాబట్టి, ఈ నేరానికి పాల్పడినవారిని శిక్షకు గురి చేయవచ్చు. ఆచారం అనే సాకుతో ప్రజలు తమ బాధ్యతల నుండి తప్పించుకునే వీల్లేదు. ఇలాంటి అమానుష నేరాలను

సమర్థవంతంగా నిరోధించటానికి బెంగాల్, ఒరిస్సా, బెనారస్‌లలో అమలయ్యే విధంగా గవర్నర్ జనరల్ ఇన్ కౌన్సిల్ ఈ రెగ్యులేషన్ జారీ చేస్తున్నారు.

II. పిల్లలు, పెద్దవాళ్లు, పరిపక్వత లేని ఎవరినైనా ప్రాణం తీసే ఉద్దేశంతో సముద్రంలో గానీ, గంగ, మరే నదిలోగానీ, నీటిలో గానీ ఎవరు విసిరినా, అందుకు ఎవరు కారణమైనా, అనుమతి వున్నా లేకపోయినా అలా విసిరేయటం వల్ల ఏ వ్యక్తి మునిగిపోయినా, సొరచేపల వల్లగానీ, ఇంకే రకంగా నైనా గానీ చనిపోయినా అందుకు బాధ్యులైన వారిని ఉద్దేశపూర్వక హత్యానేరానికి పాల్పడిన వారుగా పరిగణించి, నేరం రుజువైతే మరణశిక్ష విధించాలి. ఈ పని చేయటంలో ఆ వ్యక్తికి ఎవరు సహకరించినా వారందరినీ సహనేరస్తులుగా పరిగణించి అందుకు అనుగుణంగా శిక్షించాలి. వీరందరినీ నిజామత్ అదాలత్‌కు పంపి సెక్షన్ LXX, రెగ్యులేషన్ IX, 1793 కింద శిక్షను నిర్ధారించి, శాసన అధికారుల ఫత్వాకు అనుగుణంగా వ్యవహరించాలి. ఒకవేళ, ఈ నేరస్తులు క్షమాభిక్షకు అర్హులైతే సెక్షన్ LXXIX, రెగ్యులేషన్ IX, 1793 ప్రకారం వీరిని గవర్నర్ జనరల్ ఇన్ కౌన్సిల్ దగ్గరకు పంపించాలి.

III. పై సెక్షన్‌లో పేర్కొన్నట్టు, నీటిలోకి విసిరేయబడిన పిల్లవాడు లేదా మరే ఇతర వ్యక్తి చనిపోకుండా రక్షించబడినా, ఏ రకంగానైనా తప్పించుకోగలిగినా ఆ ప్రమాదానికి గురిచేసిన వారిని, అందుకు సహకరించిన వారిని తీవ్ర నేరానికి పాల్పడిన వ్యక్తులుగా పరిగణించి సర్క్యూట్ కోర్టులు శాసనాధికారుల ఆజ్ఞలకు అనుగుణంగా విచారించి శిక్షించాలి.

IV. ఈ దురాచారం అమల్లో వున్న జిల్లాల్లోని మెజిస్ట్రేట్‌లు పిల్లలను బలి ఇచ్చే అమానుషం మళ్లీ జరగకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలి. ఏ ప్రాంతంలో ఎప్పుడు బలులు జరిగినా ఈ రెగ్యులేషన్‌లోని అంశాలను అందరికీ ప్రకటించి తెలియజేయాలి.

రెండవ సాంఘిక శాసనం 'సతి'కి సంబంధించినది. బెంగాల్ రెగ్యులేషన్ XVII ఆఫ్ 1829 అయిన అది ఈ విధంగా వుంది:

### రెగ్యులేషన్ XVII క్రీ.శ. 1829

'సతి' ఆచారం లేదా హిందూ వితంతువుల సజీవదహనం, సజీవ ఖననం క్రిమినల్ కోర్టుల్లో శిక్షించతగిన నేరంగా ప్రకటించటం కోసం గవర్నర్ జనరల్ ఇన్ కౌన్సిల్ ఈ రెగ్యులేషన్‌ను జారీ చేశారు.

### ఉపోద్ఘాతం

I. హిందూ వితంతువును ప్రాణాలతో వుండగానే తగులబెట్టటం, పాతి పెట్టటం పూర్తిగా అమానుష చర్య. ఇది విధిగా పాటించవలసిన విషయమని హిందూ మతంలో ఎక్కడా చెప్పలేదు. భర్త మరణించిన స్త్రీ అతని జ్ఞాపకాలతో జీవితం గడపాలని హిందూమతం నిర్దేశించింది. దేశంలోని చాలా ప్రాంతాల్లో ఈ దురాచారం

అమల్లో లేదు. కొన్ని జిల్లాల్లో దీని ఉనికి కూడా కనిపించదు. ఈ దురాచారం అమలులో ఎన్నో ఘోరాలు జరపటం వల్ల హిందువులు కూడా వాటిని భరించలేక దీనిపై నిషేధం విధించమని కోరుతున్నారు. ఈ దురాచారాన్ని రూపుమాపటానికి గతంలో చేసిన ప్రయత్నాలు విఫలం కావటంతో, గవర్నర్ జనరల్ ఇన్ కౌన్సిల్ దీన్ని నిషేధించి తీరాలనే అభిప్రాయానికి వచ్చాడు. లౌకికవాదం, న్యాయం మానవత్వాన్ని భంగపరిస్తే తప్ప మత సంప్రదాయాల విషయంలో జోక్యం చేసుకోరాదనే సిద్ధాంతంతో బ్రిటిష్ ప్రభుత్వం దేశానికంతటికీ వర్తించే విధంగా ఒక శాసనం అవసరమని భావిస్తోంది.

II. హిందూ వితంతువును తగుల బెట్టటం, పాతిపెట్టటం చట్టవ్యతిరేక చర్యలనీ, ఇవి క్రిమినల్ కోర్టులలో శిక్షించతగిన నేరాలనీ ప్రకటిస్తున్నాము.

III. మొదటిది. అందరు జమీందార్లు, తాలూక్‌దార్లు, మాల్‌గుజారీ లఖీరాజ్ భూస్వాములు, సదర్ రైతులు, అన్ని రకాల భూమి కౌలుదార్లు, వారిపై ఆధారపడిన నాయబ్‌లు, ఇతర స్థానిక ఏజెంట్లు, అధికారులు, కోర్ట్ ఆఫ్ వార్డ్స్ వసూలు దార్లు, గ్రామ పెద్దలందరికీ ఈ సందర్భంగా తెలియ జేయడమేమంటే, 'ఆత్మాహుతి' జరుగుతున్నట్టు సమాచారం అందిన వెంటనే దగ్గర్లో వున్న పోలీస్ అధికారికి తెలియజేయాలి. జమీందారైనా, ఏ వ్యక్తి అయినా కావాలని సమాచారం చెప్పకపోయినా ఆలస్యం చేసినా అతనికి మెజిస్ట్రేట్ లేదా సహాయ మెజిస్ట్రేట్ 200 రూపాయలకు మించకుండా జరిమానా విధించవచ్చు. ఒక వేళ దీన్ని చెల్లించకపోతే, ఆరు నెలలకు మించకుండా జైలుశిక్ష విధించవచ్చు.

## 'ఆత్మాహుతి' పట్ల పోలీసు దరోగా విధి

రెండోది: ఈ రెగ్యులేషన్ ద్వారా నిషేధించబడ్డ ఆత్మాహుతి జరగబోతున్నదని తెలియగానే పోలీసు దరోగా వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లాలి. అది వీలుకానప్పుడు మహరీర్, జమేదార్, ఇంకొంతమంది హిందూ బర్కందాజ్‌లను అక్కడికి పంపాలి. ఆత్మాహుతి జరపటానికి తయారైన వ్యక్తులకు ఇది చట్టవ్యతిరేకచర్య అని చెప్పి వాళ్లను వెళ్లగొట్టాలి. ఈ పనికి పాల్పడిన వాళ్లంతా నేరస్తులవుతారనీ, అప్పుడు అందరూ క్రమినల్ కోర్టు దృష్టిలో శిక్షార్హులవుతారనీ తెలియజెప్పాలి. ఈ మాటలు వినకుండా 'ఆత్మాహుతి' జరపటానికే వాళ్లంతా సిద్ధపడితే పోలీస్ అధికారులు తమ విచక్షణాధికారాలను ఉపయోగించి తగిన చర్యలు తీసుకోవాలి.

## 'ఆత్మాహుతి' విషయం తెలీనప్పుడు ఏమి చెయ్యాలి?

మూడోది: పోలీసు అధికారులకు సంఘటన జరిగేదాకా తెలీకపోయినా,వెళ్లే సరికే జరిగిపోయినా, అసహజ మరణాలను ఎలా సమగ్ర విచారణ జరుపుతారో అదే విధంగా పూర్తి విచారణ జరిపించాలి. తర్వాత మెజిస్ట్రేట్‌కు, సహాయ మెజిస్ట్రేట్‌కు విషయం తెలిపి వారి ఆదేశాలను పాటించాలి.

IV మొదటిది: పైన చెప్పిన సెక్షన్ల ప్రకారం పోలీస్ దరోగాలు పంపిన నివేదికలు చూసిన తర్వాత మెజిస్ట్రేట్ లేదా సహాయ మెజిస్ట్రేట్ తన అధికార పరిధిలో జరిగిన 'ఆత్మాహుతి'కి సంబంధించిన నిజానిజాలన్నిటినీ విచారించాలి. సంబంధిత వ్యక్తులను పిలిపించి సర్క్యూట్ కోర్టులో విచారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలి.

## హిందూ వితంతువు ఆత్మాహుతికి సహకరించిన, ప్రోత్సహించిన వ్యక్తులను హత్యానేరం కింద విచారించాలి.

రెండవది: చనిపోవటానికి హిందూ వితంతువు తనకు తానుగా అంగీకరించినా, అంగీకరించకపోయినా ఆమెను సజీవ దహనం, సజీవ ఖననం చేసిన వ్యక్తులు వారికి సహకరించిన వారూ నేరస్తులే. పరిస్థితిని బట్టి, నేరతీవ్రతను బట్టి సర్క్యూట్ కోర్టు తగిన శిక్ష విధించాలి. తన 'ఆత్మాహుతి'తో సహకరించమని ఆ స్త్రీ కోరిందని చెప్పినా శిక్షలో ఏ మినహాయింపూ వుండదు.

మూడవది: బెయిల్‌కు సంబంధించిన సాధారణ సూత్రాలను, తమ విచక్షణను అనుసరించి మెజిస్ట్రేట్‌గానీ సహాయ మెజిస్ట్రేట్ గానీ నిందితులకు బెయిల్ మంజూరు చేయవచ్చు లేదా నిరాకరించవచ్చు.

## నిజామత్ అదాలత్ చేతిలో మరణశిక్ష

V. 'సతి'కి పాల్పడే విధంగా హిందూ వితంతువును బలవంతం చేసి హింసించి ఆమె సజీవదహనానికీ, ఖననానికీ ప్రయత్నించినా, తగిన మైకంలోగానీ ఉద్వేగంలో గానీ మరే ఇతర కారణం వల్లగానీ సహకరించినా అది హత్యానేరం. ఇలాంటి నిందితులకు వ్యతిరేకంగా దారుణమైన హత్యానేరం రుజువై వారిని దయతలచటానికి ఒక్క కారణం కూడా దొరకని దశలో నిజామత్ అదాలత్ మరణశిక్ష విధించగలదు. ఈ తీర్పును ఈ రెగ్యులేషన్‌లోని ఏ సెక్షనూ అడ్డుకోలేదు.

మూడో సాంఘిక శాసనం కుల అనర్హతల తొలగింపు చట్టం XXI ఆఫ్ 1850. అది ఈ కింది విధంగా వుంది.

## కుల అనర్హతల తొలగింపు చట్టం (XXI ఆఫ్ 1850)

బెంగాల్‌కోడ్ సెక్షన్ 9, రెగ్యులేషన్ VII, 1832లో పేర్కొన్న సూత్రాన్ని ఈస్టిండియా కంపెనీ ప్రభుత్వం పరిధిలో వున్న సరిహద్దు అంతటికీ విస్తరింటం కోసం చేసిన చట్టం.

## ఉపోద్ఘాతం

సివిల్ దావాలో కక్షిదారులు విభిన్న మతస్తులైనప్పుడు, అంటే ఒకరు హిందువు మరొకరు మహ్మదీయుడు అయినప్పుడు వారి ఆస్తి హక్కునురద్దు చేసి వారి మతశాసనాలు అమలు చేయటానికి అనుమతించరాదని సెక్షన్ 9, రెగ్యులేషన్ VII,

1832 బెంగాల్ కోడ్‌లో పేర్కొన్న సూత్రాన్ని ఈస్టిండియా కంపెనీ ప్రభుత్వ పాలనలో వున్న భూ భాగానికంతటికీ వర్తింప జేయటానికి వీలుగా ఈ శాసనం చేయబడింది.

మత మార్పిడిహక్కును, కులం కోల్పోయే పరిస్థితిని రద్దు లేదా ప్రభావితం చేసే చట్టాలు, సంప్రదాయాలు అమలు చేయబడవు.

1. ఈస్టిండియా ప్రభుత్వ పాలనలోని భూభాగంలో ఏ చట్టమైనా సంప్రదాయమైన ఒక వ్యక్తి మతం మారినందుకో మతం నుంచి వెలివేయబడినందుకో కులం కోల్పోయినందుకో ఆ వ్యక్తి ఆస్తి హక్కును హరించినా, వారసత్వపు హక్కుకు భంగం కలిగించినా ఈస్టిండియా కంపెనీ కోర్టుల పరిధిలో రాయల్ ఛార్టర్ ద్వారా నెలకొల్పిన కోర్టులలో ఆ చట్టం, సంప్రదాయం అమలు కావు.

## హిందూ వితంతు పునర్వివాహ చట్టం

నాలుగో సాంఘిక శాసనం "హిందూ వితంతు పునర్వివాహ చట్టం XV ఆఫ్ 1856. అది ఈ విధంగా వుంది.

భర్తను కోల్పోయిన హిందూ స్త్రీ పునర్వివాహం చేసుకోవటంలో వున్న చట్టపరమైన ఆటంకాలను తొలగించే చట్టం.

## ఉపోద్ఘాతం

ఈస్టిండియా కంపెనీ ప్రభుత్వం అధీనంలో వున్న భూభాగంలోని సివిల్ కోర్టుల్లో అమలయ్యే శాసనాలు, హిందూ స్త్రీ భర్తను కోల్పోయిన తర్వాత పునర్వివాహానికి అనర్హురాలని, అలాంటి వివాహం ద్వారా కలిగే సంతానం అక్రమమైనదని, కాబట్టి ఆ స్త్రీకి ఆస్తిని వారసత్వంగా పొందే హక్కు లేదని చెపుతున్నాయి.

దీనివల్ల అలాంటి స్త్రీలకు చట్టపరమైన అనర్హత వస్తుందని హిందువులు భావిస్తున్నారు. మరో సంప్రదాయాన్ని అనుసరించదలచుకున్న హిందువులు, అంతరాత్మ ప్రబోధాన్ని పాటించదలచుకున్న హిందువులను ఈ శాసనాలు అడ్డగించరాదని వారు కోరుతున్నారు.

హిందువులను ఇలాంటి చట్టపరమైన అనర్హతల నుండి విముక్తి చేసి, వారు కోరినట్టుగానే హిందూ వితంతువు పునర్వివాహం చేసుకోవటంలో వున్న అడ్డంకులను తొలగిస్తే నైతిక సూత్రాలను, ప్రజా సంక్షేమాన్ని ప్రోత్సహించటానికి వీలుగా వుంటుందని ఈ శాసనం చేస్తున్నాము.

## హిందూ వితంతు పునర్వివాహానికి చట్ట బద్ధత

1. స్త్రీ ఇది వరకే వివాహితురాలైందని గానీ, మరో పురుషుడితో వివాహం నిశ్చయమైందని గానీ, రెండో వివాహం చేసుకున్న సమయంలో ఆ పురుషుడు మరణించాడని గానీ, ఏదైనా ఆచారమో, హిందూ చట్టమో ఇందుకు వ్యతిరేకమనే

కారణాలతో ఇద్దరు హిందువుల మధ్య వివాహాన్ని అక్రమం అనటానికి, ఆ వివాహం తర్వాత పుట్టిన సంతానాన్ని కూడా అక్రమం అనటానికి వీల్లేదు.

**మరణించిన భర్త ఆస్తిపై హక్కును పునర్వివాహంతో ఆ స్త్రీ కోల్పోతుంది.**

2. భర్త మరణించిన తర్వాత స్త్రీ పునర్వివాహం చేసుకుంటే భర్త ఆస్తిపై వున్న అన్ని హక్కులు, మనోవర్తి, మిగతా లాభాలు, వారసత్వంగా ఆస్తి పొందే హక్కు, వీలునామా ద్వారా పొందే హక్కు అన్నింటినీ కోల్పోతుంది. రెండో వివాహం వల్ల, ఆమె తర్వాత వరుసలో వున్న వ్యక్తికి ఆస్తులు, హక్కులు సంక్రమిస్తాయి.

అయిదో సాంఘిక శాసనం స్త్రీతో రతి జరపటానికి గరిష్ట వయోపరిమితిని నిర్దేశిస్తుంది. ఇది XLVవ చట్టం, 1860. (భారత శిక్షా స్మృతి) సెక్షన్ 375. ఈ కింది విధంగా -

"ఇక్కడ పేర్కొన్న మినహాయింపులో తప్ప, ఈ కింది అయిందింటిలో ఏ సందర్భంలో రతి జరిపినా ఆ వ్యక్తి 'మానభంగం' చేసినట్టే.

మొదటిది: ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా

రెండవది: ఆమె అంగీకారం లేకుండా

మూడవది: ఒక వ్యక్తి తను ఆమె భర్త కాదని తెలిసినా, ఆమె తనని భర్త అని నమ్మి, తనతో చట్టబద్ధమైన వివాహం జరిగిందని నమ్మి ఆమె అందుకు సమ్మతించినపుడు

నాలుగవది: (ఖాళీగా వదిలేశారు... సం॥)

అయిదవది: ఆమెకు. పది సంవత్సరాలలోపు వయస్సు వున్నప్పుడు ఆమె సమ్మతించినా, సమ్మతించక పోయినా...

వివరణ: (ఖాళీగా వదిలేశారు... సం॥)

మినహాయింపు: పది సంవత్సరాలకు మించి భార్యకు వయస్సు వున్నప్పుడు వ్యక్తి రతి జరిపితే అది మానభంగం కాదు.

**మరి అంటరానివాళ్ల మాటేమిటి?**

భారతదేశంలో కులం, అంటరానితనం రెండు అతి పెద్ద సాంఘిక దురాచారాలు. కులం హిందూ సమాజాన్నంతా బలహీనం చేసింది. అంటరానితనం ఒక పెద్ద వర్గాన్ని అణచివేసింది. అయినా బ్రిటిష్ ప్రభుత్వం ఈ రెండింటినీ నిర్లక్ష్యం చేసింది. ఇండియన్ కోడ్‌లో కులానికి, అంటరానివాళ్లకు సంబంధించిన చట్టం ఎంత వెతికినా కనిపించదు. కులం, అంటరానితనం సాంఘిక విషయాలే అయినా, సహపంక్తి భోజనాలు, కులాంతర వివాహాలతో అవి అదృశ్యమవుతాయి. చట్టం ఒకరిని మరొకరితో కలిసి భోజనం చేయమని బలవంత పెట్టలేక పోవచ్చు. ఒకరు మరొకరిని పెళ్లి చేసుకొని తీరాలని వత్తిడి చేయటం కూడా చట్టానికి సాధ్యం కాకపోవచ్చు. కానీ చట్టం, ఒక వ్యక్తి తన కులం కాని వ్యక్తిని

పెళ్లి చేసుకోకుండా అడ్డుకునే 'కులం'పై ఆంక్షలు పెట్టవచ్చు. కులాచారాలను, కట్టుబాట్లను తెంచుకున్న వ్యక్తికి కుల బహిష్కార శిక్ష విధించే అధికారం ద్వారా 'కులం' సమాజంలో నిలబడగలుగుతోంది. అలాంటి కులబహిష్కార శిక్ష నేరమని చట్టం చేయటం సాధ్యమే. అంతేకాదు, అంటరానితనంలో వుండే అనర్హతలు కేవలం సాంఘిక పరమైనవే కావు. ఈ అనర్హతలు ప్రాథమికంగా పౌరసత్వానికి సంబంధించినవి. కాబట్టి, కనీసం పౌర హక్కులను కాపాడటం వరకైనా బ్రిటిష్ ప్రభుత్వానికి చట్టం చేయాల్సిన బాధ్యత వుంది. అది ఆచరణలో సాధ్యమవుతుంది కూడా. కనీసం కుల అనర్హతల తొలగింపు చట్టం లాంటి మరో చట్టం కూడా బ్రిటిష్ ప్రభుత్వం చెయ్యలేదా? దేశంలో ఇలాంటి పెద్ద దురాచారాలు అమలువుతున్నాయన్న స్పృహ కూడా లేకుండా పాలిస్తున్నారు. మన దేశంలో 1861లోనే శాసన మండలులు ఏర్పడి చట్టాలు తెస్తున్నా, అంటరానితనం గురించి ఒకటి రెండు సందర్భాల్లో తప్ప ప్రస్తావించలేదు. 1916లో పార్శీ ప్రముఖుడు సర్ మానెక్‌జీ దాదాభాయ్ కేంద్ర శాసన మండలిలో మొదటిసారి ఈ కింది తీర్మానం ప్రవేశపెట్టారు.

"... గవర్నర్ జనరల్ ఇన్ కౌన్సిల్‌కు ఈ మండలి చేసే సిఫారసు ఏమిటంటే - అణగారిన వర్గాలనే పేరుతో పిలవబడే ప్రజల నైతిక, విద్యా ప్రమాణాలను మెరుగు పరచటం కోసం అధికారులు, అనధికారులతో ఒక ప్రాతినిధ్య సంఘాన్ని ఏర్పాటు చేసి కొన్ని సహాయ కార్యక్రమాలను రూపొందించాలి. ఇందుకోసం మొదట చేయాల్సిన పనిగా స్థానిక ప్రభుత్వాలను, పాలనాధికారులను పిలిపించి ఆయా స్థానిక సమస్యలకు తగినట్టుగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి".

ఈ తీర్మానం పట్ల సానుభూతి చూపిన వారెవరూ లేరు. ఈ తీర్మానాన్ని కేంద్ర శాసనసభ ముందుపెట్టినందుకు హిందూ శాసన మండలి సభ్యులు కోపంతో ఊగిపోయారు.

పండిట్ మదన్ మోహన్ మాలవ్య ఈ విధంగా అన్నారు.

"సర్. సభలో కొన్ని అంశాలను పరిశీలనకు పెట్టే తీరు పట్ల నిరసన తెలపటం, సభా గౌరవాన్ని గుర్తు చేయటం నన్ను పురికొల్పుతున్నాయని చెప్పటానికి చింతిస్తున్నాను...

మిత్రుడు దాదాభాయ్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని మనస్ఫూర్తిగా సమర్థిస్తున్నాను. అయితే, ఆయన హద్దు మీరి హిందూమతం మీద కొన్ని వ్యాఖ్యలు చేయకుండా వుండవలసింది. సామాజిక రాగద్వేషాలను వదులు కోలేకుండా బాధపడుతున్నది. ఒక్క హిందూ మతమే కాదు. "మరణించిన, భార్య చెల్లెలితో పెళ్లి"కి సంబంధించిన బిల్లులో వున్నది కూడా ఒక దురాచారమే. హిందువుల మధ్య వున్న అసమానతలపై సభ్యులకు, ప్రజలకు సభలో ఉపన్యాసం ఇవ్వాల్సిన పనిలేదు. ప్రభుత్వం చేపట్ట తగిన పరిపాలన శాసనపరమైన వ్యవహారాలతో మాత్రమే ఈ సభపరిమితం కావాలి. ప్రభుత్వం పెట్టుకున్న ఉదార, వివేకవంతమైన విధానం ప్రకారం, సామాజిక, మత సంబంధ విషయాల్లో ప్రభుత్వ జోక్యం వుండరాదు. కాబట్టి ఈ తీర్మానంలో చేసిన

నిందలపై నేను చర్చించదలచుకోలేదు. హిందూమతంలోని అపోహలు, దురాచారాల గురించి చెప్పాల్సిన చోటు ఇది కాదు."

సురేంద్రనాథ్ బెనర్జీ లాంటి సాంఘిక సంస్కర్తకు కూడా ఈ తీర్మానం ప్రవేశపెట్టటం సంతోషం కలిగించలేదు. దానికి ఆయన ప్రతి స్పందన.

"... మిత్రుడు, గౌరవ సభ్యుడు (దాదాభాయ్) హిందుమతంపై ఇలా దాడి చేయటం బాధగా వుంది. మన ప్రాచీన నాగరికత, సంప్రదాయాల వారసత్వం ఈ ప్రపంచమంత ప్రాచీనమైనది. దీన్ని ఆయన గుర్తుంచుకోవాలి. ఆ నాగరికతలో లోపాలున్నప్పటికీ తొలి రోజుల్లో అది సమాజంలో సుస్థిరతను, శాంతి భద్రతలను కాపాడింది. ఈనాటి పరిస్థితులకు తగిన జాతీయ విధానాన్ని రూపొందించే ప్రయత్నంలో వున్న దశలో మనం గతాన్నంతా పూర్తిగా పక్కకు నెట్టేయటం వీలు కాకపోవచ్చు. పాత వ్యవస్థలో వున్న లోపాలు నెమ్మదిగా క్రమక్రమంగానే తప్ప విప్లవాత్మకంగా తొలగించరాదు. ఇలాంటి సాంఘిక సమస్యలు తలెత్తినప్పుడు ప్రభుత్వం ప్రత్యక్ష చర్యకు దూరంగా. వుండటం, ప్రాచీన సంప్రదాయాలకు అనుగుణంగా తీసుకున్న సరైన నిర్ణయమని నేను అనుకుంటున్నాను."

"అణగారిన వర్గాలు పారిశ్రామికంగా ముందంజ వేయటానికి ప్రభుత్వం విద్య ద్వారా వారికి సహాయ పడవచ్చు. అయితే అసలు సమస్య, అన్నింటిలోకి పెద్ద సమస్య ఈ సమాజాన్ని ఉద్ధరించటం. ఈ విషయంలో ప్రభుత్వం సానుభూతి చూపే ప్రేక్షకుడి పాత్ర పోషించాల్సిందే తప్ప ప్రత్యక్షంగా ఏ చర్యా తీసుకోలేదు."

దీనికి దాదాభాయ్ ఈ విధంగా సమర్థించుకున్నాడు.

"సర్. నేను సంకట స్థితిలో చిక్కుకున్నాను. ఈ మండలిలో వున్న రెండు పార్టీలూ ఆత్మ రక్షణలో పడ్డాయి. ఉత్సాహం లేకపోయినా నేను ప్రవేశపెట్టిన తీర్మానానికి మద్దతు తెలిపింది అనధికార సభ్యులే. రిఫార్మ్డ్ కౌన్సిల్ పదవీ కాలం మొదలై ఆరేళ్లయింది. రెండో పదవీ కాలం కూడా పూర్తి కావస్తోంది. నేను సభ్యుడిగా వున్న ఈ అయిదేళ్లలో, ప్రజల స్వాతంత్ర్యం, సంక్షేమం, సంస్కృతుల కోసం పోరాడే నా మిత్రులు సురేంద్రనాథ్ బెనర్జీ, మదన్ మోహన్ మాలవ్య లాంటి వారు ఎవరైనా ఇలాంటి తీర్మానం ప్రవేశపెడతారని అనుకున్నాను. కానీ ఆ పని ఎవరూ చేయలేదు. అణగారిన వర్గాల బాధల గురించి కాంగ్రెస్ శిబిరాల్లో చర్చించినా ఈ సభలో ఎన్నడూ చర్చించలేదు. నేను పార్శీనే.కావచ్చు, కానీ ఒక హిందూ నియోజక వర్గం ప్రతినిధిగా ఇలాంటి మంచి విషయాన్ని ఈ సభలో చర్చించటం నా బాధ్యతగా భావించాను."

ప్రభుత్వానికి ఈ తగాదా సహజంగానే సంతోషాన్నిచ్చి వుంటుంది. హిందూ సభ్యుల నైతిక మద్దతులో తన లోపాలను కప్పి పుచ్చుకుంటూ ప్రభుత్వం తరఫున ఈ తీర్మానాన్ని తిరస్కరించిన సందర్భంలో సర్ రెగినాల్డ్ క్రాడక్ ఇలా చెప్పాడు –

"సర్ దాదాభాయ్ తీర్మానంలోని ఆశయాల పట్ల మాకు సానుభూతి వుంది. అణగారిన వర్గాల అభివృద్ధి కోసం స్థానిక ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయో, ఏం చెయ్యదలుచుకున్నాయో, ఏం చేస్తాయో వివరంగా చెప్పాలని మేము కోరుతున్నాం. మాకు ప్రత్యేక కమిటీల మీద నమ్మకం లేదు. ఇవి కమిటీల ద్వారా పరిష్కరించటం సాధ్యం కానంత పెద్ద సమస్యలని ఇదివరకే నేను కౌన్సిల్‌కు తెలిపాను. ప్రభుత్వం పై నుంచి కింది దాకా ఈ సమస్యలతో ఎంతగా సతమతమవుతున్నదో కూడా మాకు తెలుసు. ఈ తీర్మానంలోని ఆశయాల పట్ల సానుభూతి చూపటం, ఈ సమస్యలను స్థానిక ప్రభుత్వాల దృష్టికి తీసుకొనిపోవటం తప్ప మేము ఏమీ చెయ్యలేము. ఇంతవరకు చెయ్యటం మాకు సాధ్యమే కాబట్టి ఈ హామీ ఇవ్వలగుతున్నాం. కాబట్టి గౌరవనీయసభ్యులు ఈ తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతున్నాను."

1928లో రెండోసారి అంటరాని వాళ్ల గురించి శాసనసభలో ప్రస్తావనకు వచ్చింది. ఎం.ఆర్. జయకర్ ఈ కింది తీర్మానం ప్రవేశ పెట్టారు.

"అంటరానివాళ్లు, అణగారిన వర్గాలకు విద్య బోధించే విషయంలో రాయితీలను, ప్రత్యేక సదుపాయాలను కల్పించే విధంగా స్థానిక ప్రభుత్వాలను ఆదేశించాలని, పోలీసు తదితర ప్రభుత్వ సర్వీసులలో కూడా వీరికి ప్రవేశం కల్పించాలని గవర్నర్ జనరల్ ఇన్ కౌన్సిల్‌కు ఈ శాసనసభ సిఫారసు చేస్తోంది".

1916 నాటి తీర్మానం విషయంలో చెప్పిన విధానాన్నే ఈ సందర్భంలో కూడా భారత ప్రభుత్వం అనుసరించింది. ప్రభుత్వం తరపున బి.ఎస్. బాజ్‌పాయ్ ఈ విధంగా చెప్పారు.

"స్థానిక ప్రభుత్వాలు బాధ్యత గురించి తాము చెయ్యగలిగిన పనులు చేస్తున్నాయి. అవి అప్పుడే లక్ష్యం చేరుకున్నాయని నేను అనటం లేదు. కానీ, అణగారిన వర్గాల అభివృద్ధికి సంబంధించి చైతన్యం వచ్చిందని, బాధ్యతలు తెలిసి కృషి చేయాలన్న కర్తవ్యం బోధ పడిందని చెప్పగలను. కాబట్టి వారి బాధ్యతల విషయంలో జోక్యం చేసుకోవాలని ఎవరూ కోరనవసరంగానీ ఆదేశించనవసరం గానీ లేదు. ప్రభుత్వం ఈ జాతీయ సమస్య గురించి స్థానిక ప్రభుత్వాలకు సమాచారం పంపాలని ఈ శాసనసభ కనుక భావిస్తే, ప్రభుత్వం అందుకు సిద్ధంగా వుంది."

ఈ ప్రసంగం చేసినందుకు బాజ్‌పాయ్‌ని ప్రశంసిస్తూ కరతాళ ధ్వనులు చేసినట్టు అధికార నివేదికలో వుంది.

సామాజిక సమస్యలకు సంబంధించి బ్రిటిష్ ప్రభుత్వం ప్రతిస్పందన ఈ విధంగా వుంటుందని తేలిపోయింది. ప్రభుత్వం వ్యవహరించిన తీరు ఇంత దారుణంగా, హీనంగా వుంది. 60 సంవత్సరాల శాసన సభ చరిత్రలో కేవలం ఆరు సాంఘిక చట్టాలు చేయటమే దీనికి తిరుగులేని రుజువు. 1860 వరకు తాను బాధ్యత కలిగిన ప్రభుత్వం అన్న ముసుగులో వుంది. 1860లో ఆ ముసుగు తొలగిపోయింది. ఆ

తర్వాత సంస్కరణలూ ఆగిపోయాయి. 1881లో బాల్య వివాహాల నిషేధ చట్టం తేవటానికి పెద్ద ఉద్యమమే చెయ్యాల్సి వచ్చింది. సంస్కరించే విషయం పక్కన బెట్టి తాము సాంఘిక సంస్కరణకు వ్యతిరేకమని బ్రిటిష్ వాళ్లు బాహాటంగా చెప్పుకున్నారు. ప్రభుత్వం ఆ సంవత్సరం ఒక తీర్మానంలో ఈ విధంగా ప్రకటించింది.

"మలబారి తన నోట్స్‌లో లేవనెత్తిన విషయాల పట్ల భారత దేశంలో బ్రిటిష్ ప్రభుత్వం కొన్ని మార్గదర్శక సూత్రాలను అనుసరిస్తుంది. ఒకవేళ, కుల ఆచారం, సంప్రదాయం క్రిమినల్ చట్టాన్ని అతిక్రమిస్తే చట్టాన్నే అమలు చేస్తుంది. అవి సూచించిన సూత్రాలు అమలు చేయతగినవిగా వున్నా, ఆ సూత్రాలు సామాజిక నీతికీ ప్రభుత్వ విధానానికీ వ్యతిరేకమైతే వాటిని పౌర చట్టంలో అమలు చేయదు. ఆ సూత్రాలను సివిల్, క్రిమినల్ న్యాయాల సహాయం లేకుండానే పౌరులు అమలు చేసుకోగలిగితే ప్రభుత్వం జోక్యం చేసుకోదు."

ఇలాంటి సాధారణ సూత్రాలను కొన్ని నిర్దిష్టమైన అంశాలకు అన్వయించేటప్పుడు భిన్నాభిప్రాయాలు ఏర్పడతాయనటంలో సందేహం లేదు. అలాంటి సందర్భాల్లో లోకజ్ఞానంతో పరీక్షించి నిర్ణయించుకోవాలి. ప్రభుత్వం చట్టపరంగా, పాలనా పరంగా సామాజిక, మత విషయాలలో జోక్యం చేసుకోవాలా వద్దా అనేది తేల్చుకునే ముందు లోకజ్ఞానం ఉపయోగించాలి. ప్రభుత్వం తన దగ్గరున్న సాధారణ పాలనాయంత్రాంగం సహాయంతో తన ఆదేశాలు అమలు చేయగలదా అని పరీక్షించుకోవాలి. అలా చేయలేని పక్షంలో ప్రభుత్వం జోక్యం చేసుకోకపోవటమే ఉత్తమం. మలబారి సూచించిన సంస్కరణలు ఎన్నో జాతుల వ్యవహారాలకు, వ్యతిరేకతలకు సంబంధించినవి. వాటిని కాలానికి, విద్య ద్వారా ప్రజలు పొందే మానసిక, నైతిక వికాసానికి వదిలేయటం మంచిది.

"కులం నిర్దేశించిన ప్రమాణాలతో సంబంధం లేకుండా, కొన్ని సందర్భాల్లో వాటికి వ్యతిరేకంగా శాసనం చేయటం ద్వారా బ్రిటిష్ ప్రభుత్వం కొన్ని నైతిక ప్రమాణాలు నెలకొల్పింది. ఈ ప్రమాణాలు స్థానిక సంప్రదాయాలు, ఆచారాలు, ఆలోచనలపై ప్రభావం చూపవచ్చు. శాసనం ప్రభావం, సాంఘిక ఆచారాల ప్రభావం వేరువేరుగా వుండి వాటి మధ్య పోటీ కూడా వున్నప్పుడు శాసనవ్యవస్థ తన సహజ పరిమితులకు లోబడి వుండాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ సాంఘిక అభిప్రాయాన్ని హద్దులు మీరి వ్యతిరేకం చేసుకోరాదు".

ఈ తీర్మానంలో నిర్దేశించిన విధానం - సాంఘిక సంస్కరణల విషయంలో బ్రిటిష్ ప్రభుత్వం విధానంగా స్థిరపడింది.

# V

## బ్రిటిష్ ప్రభుత్వం అంటరానివాళ్లను పట్టించుకోకుండా వారిని అదే స్థితిలోనే ఎందుకు వదిలేసింది?

నిర్లక్ష్యం అనే ఈ తీవ్రమైన నేరానికి రెగినాల్డ్ క్రాడక్ వివరణ ఇచ్చుకున్నాడు. 1916 నాటి తీర్మానానికి ప్రభుత్వం తరపున ఇచ్చిన సమాధానంలో, అంటరానివాళ్ల విషయంలో తాము అనుసరించిన విధానాన్ని ఈ కింది విధంగా వివరించాడు.

"అంటరాని వాళ్ల గురించిన సమస్య ప్రభుత్వం వాళ్లను పట్టించుకోక పోవటం కాదు. శతాబ్దాల తరబడి కొనసాగుతున్న ఆచారాలు, అపోహలు తొలగిపోనిదే వారిపై పొరుగువారి వత్తిళ్లు తొలగి పోవు. వీళ్లు ఎక్కువగా పల్లెల్లో, పట్టణాల్లో నివసిస్తూ, ప్రజలకు దూరంగా వుంటారని గుర్తుంచుకోవాలి. చాలా మంది వక్తలు చెప్పినట్లు ఈ సమస్య కేవలం పాలనాపరమైనది కాదు. ఇది సామాజిక మతపరమైన సమస్య."

"పాఠశాలల విషయంలో కూడా ఎన్నో సమస్యలున్నాయి. మహర్ పిల్లలను పాఠశాలల్లోకి అనుమతించిన ఊళ్లు చాలా వున్నాయి. వారిని వరండా వరకూ రానిచ్చినా, ఉపాధ్యాయుడి కంటపడితే అతడు వాళ్లని అక్కడి నుండి వెళ్లగొడతాడు. నేను ఎక్కడికి పోయినా ఈ సమస్య ఎదుర్కొన్నాను. వాళ్లూ పన్నులు చెల్లిస్తారనీ అపోహలు తగ్గించుకోమనీ వాళ్ల చదువు కోసం సహకరించమనీ వివరించాను. కొంతమంది ముందుకు వచ్చి బావులు తవ్వించటానికి, పాఠశాలలు స్థాపించటానికి విరాళాలిచ్చి తోడ్పాటు నందించారు. ఆ సమస్య అలా తీరిపోయినా, అందరినీ ఇలాంటి విషయాల్లో పాలు పంచుకొమ్మని ప్రభుత్వం వత్తిడి చేయలేదు. ప్రయాణం చేసేటప్పుడో, ప్రభుత్వానికి పిటిషన్లు పెట్టుకున్నప్పుడో కింది కులాల వారు మిగతా కులాల చేరువలోకి వస్తారు. అంతమాత్రాన ఆఫీసుల్లో వీరికి సమాన గౌరవం లభిస్తున్నట్టూ కాదు, పొరుగు వారు అలా చూస్తారనీ కాదు. ఈ తీర్మానం ప్రవేశపెట్టిన వ్యక్తి బొంబాయి ప్రభుత్వం చేసిన ప్రకటనను 'గగనకుసుమం'గా అభివర్ణించారు. వాస్తవంలో ఈ సమస్య జటిలమైనదని చెప్పటానికి ఈ మాటే చాలు. ఈ దురదృష్టవంతులకు అన్ని విధాలా సహాయ పడటానికి ప్రభుత్వం ఇష్టపడుతోంది. అయితే, ఈ కులాలు, తెగల స్థితిగతులు, భవిష్యత్తు, పాక్షికంగా తమపైనా మిగతా అగ్రకులాలపైనా ఆధారపడి వున్నాయనటం మాత్రం నిజం.'

"అణగారిన వర్గాలకు సంబంధించినంతవరకు వాస్తవ పరిస్థితి ఇదే అనుకుంటున్నాను." సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీలో 1928లో జయకర్ తీర్మానం ప్రవేశపెట్టినప్పుడు ప్రభుత్వం తరపున మాట్లాడుతూ బాజ్‌పాయ్ కూడా ఇదే వైఖరి ప్రదర్శించారు.

"అంటరానివాళ్లకు ప్రత్యేక పాఠశాలలు, సౌకర్యాలు కల్పించటం ద్వారా వాళ్ల సమస్య పరిష్కారం కాదు... అణగారిన వర్గాల పట్ల సమాజంలోని అన్ని వర్గాల ప్రజల్లోనూ వేగంగా సమతాభావం కల్పించినప్పుడు మాత్రమే పరిష్కారమవుతుంది."

హిందువులు మనసు మార్చుకోవటానికి పరిష్కారాన్ని వదిలేయటం ద్వారా బ్రిటిష్ ప్రభుత్వం అంటరానివాళ్లను నిర్లక్ష్యం చేసింది. అంటరాని వాళ్ల అభివృద్ధి పట్ల తనకు బాధ్యత లేనట్టుగా వ్యవహరించింది. తమ పౌరులుగా నిస్సహాయ స్థితిలో వున్న అంటరానివాళ్లకు నిర్లక్ష్యం చేయటాన్ని బ్రిటిష్ ప్రభుత్వం ఎలా సమర్థించుకుంది? దీనికి జవాబు సుస్పష్టం. అంటరానితనం అనే దురాచారాన్నీ ఈ వ్యవస్థనూ తాము సృష్టించలేదు కాబట్టి ఈ విషయంలో తమను నిందించరాదని వాదించారు. 1856లో బొంబాయి ప్రభుత్వం దీన్ని స్పష్టంగా వివరించింది. తగిన ఫీజు చెల్లించటానికి సిద్ధంగా వున్నా తనకు ధార్వార్ ప్రభుత్వ పాఠశాలలో సీటు ఇవ్వలేదని ఒక మహర్ బాలుడు 1856 జూన్‌లో బొంబాయి ప్రభుత్వానికి దరఖాస్తు పెట్టుకున్నాడు. బొంబాయి ప్రభుత్వం దీన్నిచాలా ముఖ్యమైన సమస్యగా భావించి, ఒక తీర్మానం జారీ చేసింది. ఇది ఆ తీర్మానం పూర్తిపాఠం:

1. ఈ లేఖలో చర్చించిన సమస్య ఆచరణలో చాలా జటిలమైనది.

2. విద్యార్థి వైపే పూర్తిగా న్యాయం వుందనటంలో సందేహం లేదు. ప్రస్తుతం ఇతని చదువుకు ఆటంకాలు కల్పిస్తున్న ధార్వార్ ప్రజల్లో రాగద్వేషాలు త్వరలోనే తొలగిపోతాయని ప్రభుత్వం నమ్ముతోంది.

3. అయితే ఒకరిద్దరి కోసం యుగాల నుంచీ పాతుకొని పోయిన అభిప్రాయాల్లో జోక్యం చేసుకుంటే విద్యారంగానికి తీవ్రమైన నష్టం జరుగుతుంది. ఈ బాలుడు ఎదుర్కొంటున్న సమస్యకు మూల కారణం ఈ ప్రభుత్వం కాదు. అంతే కాకుండా ఈ బాలుడికి న్యాయం చేయటం కోసం ప్రభుత్వం ఈ సమస్యను తక్షణమే పరిష్కరించలేదు.

ప్రభుత్వం తన విధులను అంటీఅంటనట్టు నిర్వర్తించాలనుకుంటే ఇలాగే వుంటుంది. కానీ ఇది బాధ్యతాయుతమైన దృష్టికాదు. ఇది నాగరిక ప్రభుత్వానికి వుండాల్సిన దృష్టి ఎంతమాత్రమూ కాదు. అసలు పరిపాలించటానికి భయపడే ప్రభుత్వం ఒక ప్రభుత్వమే కాదు. అప్పుడు, అది కేవలం పన్నులు వసూలు చేయటానికి ఏర్పడిన ఒక సంస్థ మాత్రమే. పన్నులు వసూలు చేసే యంత్రాంగం కన్నా తాను ఒక మెట్టు పైనే వుండాలని బ్రిటిష్ ప్రభుత్వం భావించింది. తనది నాగరిక ప్రభుత్వం అని చెప్పుకుంది. అలాంటప్పుడు ఒక తప్పును, అన్యాయాన్ని అడ్డుకునే చర్య ఎందుకు తీసుకోలేదు? దానికి ఏ అధికారమూ లేదు? లేక ఆ అధికారాన్ని ఉపయోగించటానికి భయపడుతోందా? లేక, భారతదేశ సామాజిక, మత వ్యవస్థలో ఏ లోపమూ లేదని భావిస్తోందా?

ఈ ప్రశ్నలకు జవాబు ఏమిటంటే బ్రిటిష్ ప్రభుత్వానికి అపరిమితమైన అధికారం వున్నా దాన్ని ఉపయోగించకపోవటానికి కారణం, హిందూ సామాజిక వ్యవస్థలో ఏ లోపమూ లేదని కొంతకాలం పాటు అది భావించటమే. ఆ తర్వాత లోపాలున్నాయని అర్థం కాగానే వారిలో భయం ఎక్కువైంది. పరిపాలించటం మొదలు పెట్టిన కొత్తలో, 'క్రైస్తవసత్యాన్ని' ప్రజల్లో వ్యాప్తి చేయటానికి అనుమతిస్తే దాని పర్యవసానాలు ఎలా వుంటాయోనని బ్రిటిష్ ప్రభుత్వం చాలా భయపడింది. అయితే అదే సమయంలో దేశీయుల మధ్య వున్న విద్వేషాల పట్ల గౌరవం ప్రదర్శించటం నీచం. కలకత్తాకు చెందిన వార్డ్ అనే మిషనరీ 1802 నాటి సంచికలో ఇలా రాశాడు:

"గతవారం ప్రభుత్వ ప్రతినిధి బృందం ఊరేగింపుగా కాళీఘాట్‌కు వెళ్లి, ఈ దేశంలో ఇంగ్లీషువాళ్లు విజయాలు సాధించినందుకు కంపెనీ తరఫున ఈ హిందూ దేవతకు కృతజ్ఞతలు తెలుపుకుంది. అయిదు వేల రూపాయలు సమర్పించారు. ఈ దేవతా మూర్తికి ఇంగ్లీషు వాళ్లు కానుకలు సమర్పించుకోవటం వేలాది హిందువులు చూశారు. స్థానికులు మనపై ఆధిక్యత పొందే ఈ పని మాకు చాలా బాధ కలిగించింది."

వారెన్ హేస్టింగ్స్ కాలంలో ఈస్టిండియా కంపెనీ ఉద్యోగి అయిన రాబర్ట్ లిండ్సేకు కూడా ఇలాంటి అనుభవమే ఎదురైంది. సిల్హెట్‌లోని కొత్త రెసిడెంట్ కార్యాలయంలో తాను మొదటిసారిగా అడుగుపెట్టినప్పుడు జరిగిన సంఘటన గురించి ఇలా చెప్పాడు.

"కొత్త రెసిడెంట్‌కు షాజులాల్ అనే గురువు ప్రార్థనా మందిరంలో ప్రార్థనలు చేసే ఆచారముందని నాకు చెప్పారు. దేశంలోని అన్ని ప్రాంతాలనుండీ వచ్చే ఇస్లాం యాత్రికులు ఇక్కడ గుమికూడుతారు. ఈ సమాధిని సందర్శించటానికి వచ్చే మతమూఢులు చాలా ప్రమాదకరమైన వ్యక్తులని తర్వాత నాకు అర్థమైంది. మత విద్వేషాలతో పోరాడటం నా పని కాదు. అందువల్ల నాకు పూర్వం ఇక్కడికి వచ్చినవాళ్ల మాదిరే నేను కూడా బూట్లు గడపముందే విడిచి లోపలికి వెళ్లి సమాధిపై అయిదు బంగారు నాణేలుపెట్టి కానుకగా సమర్పించుకున్నాను. ఆ విధంగా పునీతుడనైన తర్వాత నా నివాసానికి వచ్చి అక్కడ ప్రజల గౌరవవందనం స్వీకరించాను."

బ్రిటిష్ ప్రభుత్వం స్థానికులతో కలిసిపోయి వారిలోని విద్వేషాలను సమర్థించటానికి ఎంతగా ఆసక్తి చూపిందో, 1833లో బిషప్ కోరీ మద్రాసు ప్రభుత్వానికి పంపిన ఈ కింది జ్ఞాపికను చూస్తే తెలుస్తుంది. ఈ జ్ఞాపికలో వున్న విషయాలు ఇవి:

"మొదటిది – ప్రభుత్వంలోని సివిల్, మిలటరీ సర్వీసుల్లో ఉన్న క్రైస్తవ ఉద్యోగులు, ఇతర మతస్తులు, మహమ్మదీయులు జరిపే ఉత్సవాలకు హాజరై వాటి పట్ల గౌరవం చూపటం అవసరం. రెండోది – కొన్ని సందర్భాల్లో దేవతామూర్తులకు కానుకలు సమర్పించి నమస్కరించాలి. మూడోది – ప్రధాన యూరోపియన్ అధికారి పర్యవేక్షణలో

పగోడాల మలినమైన, నీచమైన సేవలు చేయించాలి. 1817 రెగ్యులేషన్ VII లోని నిబంధనల ప్రకారం పగోడాలు, మసీదుల నిర్వహణ, వాటి ధర్మాదాయ బాధ్యతలు క్రైస్తవ అధికారుల కున్నాయి కాబట్టి, విగ్రహాలను ఊరేగించే ఉత్సవాలు జరిపించటానికి ఏది అవసరమైన క్రైస్తవ అధికారి ఉత్తర్వులు, ప్రభుత్వ అంగీకారం ప్రకారమే జరగాలి. నాలుగోది - బ్రిటిష్ అధికారులు తమ ప్రభుత్వ దళాలతో మహమ్మదీయ ఉత్సవాల్లో సబ్బత్ రోజున కూడా గౌరవసూచకంగా తుపాకీలు పేల్చి ప్రార్థనలు చేయాలి. ఈ విధంగా ప్రభుత్వ అధికారానికి తలవంచి క్రైస్తవులు తమ పవిత్ర సంస్థలను అపవిత్రం చేస్తూ అపవిత్రమైన, నీచమైన మూఢ విశ్వాసాల్లో పాలుపంచుకోవాల్సి వస్తోంది." భారతదేశంలో బ్రిటిష్ ప్రభుత్వం మతపరమైన సత్యాలను ప్రచారం చేయించటంతో పాటు, అధికారికంగా బాహాటంగా భూత ప్రేతాలను పూజించే పనులకు సహాయం కూడా చేస్తోంది. హిందూ మతంలోని క్రూరమైన, నీచమైన పనులకు ప్రత్యేక ప్రోత్సాహమిస్తూ, ఇలాంటి నరకప్రాయమైన తతంగాలకు బ్రిటిష్ అధికారులను ముఖ్య అతిథులుగా పంపుతోంది. దేవాలయాల ఆస్తుల నిర్వహణ చూస్తూ నాట్య గత్తెలను పోషిస్తోంది. ఈ రకంగా గౌరవాలు కల్పించటమంటే ఆ మతాన్ని ఉన్నతమైనదిగా చూడటమే."

1841 తర్వాతగాని ప్రభుత్వం హిందూ మహమ్మదీయ మతస్తుల ఉత్సవాల్లో పాల్గొనటం మానలేదు. అది కూడా మిషనరీలు పెద్ద ఎత్తున నిరసన తెలిపిన తర్వాతే.

"ఫోర్ట్ సెయింట్ జార్జి ప్రభుత్వ మిలటరీ కార్యదర్శి 1841 జూలై 6వ తేదీన కమాండర్ ఇన్ ఛీఫ్‌కి రాసిన లేఖలో ఇలా తెలిపాడు." ప్రభుత్వం ద్వారా డైరెక్టర్ల సభ పంపిన ఆదేశాల ప్రకారం, దేశీయుల పండుగలు పబ్బాలకు బ్యాండు వాయించే మిలిటరీ దళాలు హాజరు కావటం అలాంటి సందర్భాల్లో తుపాకీ కాల్పులతో గౌరవ వందనం సమర్పించటం ఇకముందు ఆపేయాలి. హిందువులు, మహమ్మదీయులు జరుపుకునే ఉత్సవాల నుండి ప్రభుత్వాన్నీ అధికారులనూ సాధ్యమైనంత వరకూ విడదీయాలి. దేశీయ రాజకుమారులకు మాత్రం ఎప్పటిలాగే వాళ్ళు ఉత్సవాలకు వెళుతున్నప్పుడూ తిరిగి వస్తున్నప్పుడూ గౌరవ వందనం పాటించాలి. దేశీయ ప్రజల మనోభావాలు దెబ్బ తినకుండా ఈ మార్పును ప్రవేశపెట్టాలని ఆదేశించారు. కమాండర్ ఇన్ చీఫ్ ఈ ఉత్తర్వులను కమాండింగ్ విభాగాల జనరల్స్‌కు వారి ద్వారా వివిధ రెజిమెంట్లకు జారీ చేశారు."

దేశీయ విద్వేషాలపట్ల సానుభూతి చూపి వాటిని కాపాడటానికి అధికార వనరులను వృధా చేసిన ప్రభుత్వం నుండి ఏమి సంస్కరణను ఆశించగలం?

బ్రిటిష్ ప్రభుత్వం సానుభూతిలో దెబ్బతిని చచ్చుబడిపోయింది. ఆ సానుభూతిని ఇప్పుడు భయం మింగేసింది. ఈ భయం ఏర్పడటానికి స్పష్టమైన కారణాలున్నాయి. భారత ప్రజలకు అది ఎన్నో వాగ్దానాలు చేయటం ఒక కారణం. ఏ కొత్త ప్రదేశంలో

ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినా, అంతకు ముందు దేశీయుల పాలనలో అనువైన మత స్వేచ్ఛను, సంస్థలను, సంప్రదాయాలను రక్షిస్తామే గానీ దెబ్బతీయమని ప్రజలకు వాగ్దానం చేయటం బ్రిటిష్ ప్రభుత్వానికి వున్న ఆచారం. 1801లో కర్నాటక ప్రజలకు ఈ కింది విధంగా వాగ్దానం చేసింది:

"బ్రిటిష్ ప్రభుత్వానికి వుండే గౌరవం, న్యాయం, రక్షణ, భద్రత లాంటి స్వాభావిక లక్షణాలను కర్నాటక పౌరులకు మరోసారి వివరించవలసిన అవసరం లేదని గౌరవనీయులైన గవర్నర్ ఇన్ కౌన్సిల్ విశ్వసిస్తున్నారు. ప్రస్తుత కార్యక్రమాల ద్వారా కంపెనీకి బదిలీ అయిన పవిత్ర విశ్వాసాన్ని ఆమోదిస్తూ కంపెనీ అధికారానికి సంతోషంగా లొంగిపోయి విధేయత చూపుతున్న కర్నాటక ప్రజలకు స్వాగతం పలుకుతున్నారు. నిర్వచించబడిన చట్టాలు, ప్రజల రక్షణకు లోబడి, ప్రతి న్యాయమైన, నిర్ధారిత పౌరహక్కునూ, మత సంస్థల నిర్వహణా స్వేచ్ఛకు, ప్రాచీన సంప్రదాయాలను పాటించుకోవటానికి అనుమతిస్తామని ప్రకటిస్తున్నారు."

**మే 1834లో కూర్గ్‌ను ఆక్రమించిన తర్వాత అక్కడి ప్రజలను ఉద్దేశించి ఈ విధంగా ప్రకటించారు:**

"బ్రిటిష్ ప్రభుత్వ రక్షణలో వుండాలనుకోవటం కూర్గ్ ప్రజలందరి ఏకాభిప్రాయం కావటం వల్ల, ఇంత వరకూ వీర రాజేందర్ ఒడయార్ పాలనలో వున్న ప్రాంతాన్ని గౌరవనీయ కంపెనీకి బదిలీ చేయాలని గవర్నర్ జనరల్ తీర్మానించారు.

కూర్గ్ ప్రజలు మళ్లీ దేశీయ పాలనలో జీవించరనీ, వారి పౌరహక్కులు, మత సంప్రదాయాలను గౌరవిస్తాయనీ వారి భద్రత, సుఖసంతోషాల పట్ల బ్రిటిష్ ప్రభుత్వం ఎంతో ఆసక్తిచూపుతుందనీ హామీ ఇస్తున్నాం."

**1849లో పంజాబ్‌ను ఆక్రమించుకున్న తర్వాత ఈ కింది వాగ్దానం చేశారు.**

"బ్రిటిష్ ప్రభుత్వం ముస్లిం, హిందూ, సిక్కు మతాలకు చెందిన ప్రజలెవరికైనా తమ సొంత మతాలను అనుసరించే స్వేచ్ఛ కల్పిస్తుంది. అయితే ఒకరి మత ఆచార వ్యవహారాలలో మరొకరు జోక్యం చేసుకోవటాన్ని అనుమతించదు."

ఇలాంటి ప్రకటనలు ఎన్నిటినో చూపించవచ్చు. ప్రజలు వీటిని వాగ్దానాలుగా భావించారు. ఏది ఏమైనా ఒకసారి ఇలాంటి వాగ్దానాలు చేస్తే వాటిని నిలబెట్టుకోవాలని అందరూ భావిస్తారు. కానీ, వీటిని నెత్తినపెట్టుకొని ఊరేగే కొంతమంది, "కొత్త పాలనలో ఈ వాగ్దానాలను మీరు అవిచ్ఛిన్నంగా అనుభవించారు" అనీ "ఈ దారి నుండి తప్పుకుంటే నమ్మక ద్రోహమవుతుంది" అనీ భారతీయులతో అనవచ్చు. దీన్ని బట్టి చూస్తే, బ్రిటిష్ వాళ్లకు రెండు రకాల భయాలుండేవని అర్థమవుతోంది. ఒకటి, నమ్మకద్రోహం చేస్తారేమోననే భయం. రెండు బహిరంగంగా తిరుగుబాటు చేస్తారేమోననే భయం. తిరుగుబాటు భయం బ్రిటిష్ వారికి తెలియనిదేమీ కాదు. 1801లో జరిగిన

వేలూరు తిరుగుబాటు, 1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటు వాళ్లకు అనుభవంలో వున్నదే. వేలూరు తిరుగుబాటు చిన్నమంట కానీ, సిపాయిల తిరుగుబాటు ఒక దావానలం. హిందువుల మత ఆచారాల్లో జోక్యం చేసుకోవటం వల్లే ఈ రెండు తిరుగుబాట్లు జరిగాయని ఆరోపణ. బ్రిటిష్ ప్రభుత్వానికి ఇవి నేర్పిన గుణపాఠం చిన్నదేమీ కాదు. వేలూరు తిరుగుబాటు, సమాజంలో కొత్త దనాన్ని ప్రవేశం పెట్టటం పట్ల బ్రిటిష్ ప్రభుత్వం మెలకువగా వుండేట్టు చేస్తే, సిపాయిల తిరుగుబాటు ఏ రకమైన సాంఘిక సంస్కరణకైనా వ్యతిరేకమయ్యేట్టు చేసింది. దీనివల్ల, బ్రిటిష్ ప్రభుత్వం ఏ రకంగానూ ప్రమాదం కొనితెచ్చుకోవటానికి ఇష్టపడలేదు. వాళ్ల దృష్టిలో ఇది ప్రమాదం కాదు – ఉపద్రవం. సాంఘిక సంస్కరణను చేపట్టడమంటే భారత దేశాన్ని కోల్పోవటమే అన్నంతగా ఈ తిరుగుబాట్లు బ్రిటిష్ వారిని భయపెట్టాయి.

సాంఘిక సంస్కరణ పట్ల బ్రిటిష్ ప్రభుత్వం ప్రదర్శించిన ఈ వైఖరిని అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వం ఎలాంటిదైనా దాని అధికారానికి రెండు పరిమితులుంటాయని ప్రొఫెసర్ డైసీ చెప్పాడు. ఆయన మాటల్లో –

"అధికారంలో వున్న వారి స్వభావం, లక్ష్యాలు, ప్రయోజనాలను బట్టి అన్నిటికన్నా ముందు అంతర్గతంగా ఒక పరిమితి ఏర్పడుతుంది. దీని కారణంగానే, ఒక సుల్తాన్ మహ్మదీయవాదాన్ని, పోప్ కేథొలిక్ వాదాన్ని, బ్రాహ్మణుడు కులాన్ని నిర్మూలించరు. ఖండించరు. బ్రిటిష్ పార్లమెంట్ తనకు అనుకూలమైతే, దాన్ని అక్రమమని ప్రకటించదు. ఇవన్నీ వీళ్లు 'చెయ్యలేక' కాదు – చెయ్యటం 'ఇష్టం' లేక. ఇదే విధంగా, భారతదేశంలోని అధికార యంత్రాంగం, ప్రజల అభివృద్ధికి అవసరమైన పనులు చేయకపోవటానికి కారణం దాని ప్రయోజనం భారతీయ సమాజంలో జీవించే విభిన్న వర్గాలపట్ల సానుభూతి లేకపోవటం, వారి అవసరాలు, సమస్యలు, ఆకాంక్షలు పట్టించుకోకపోవటం, వారి కోరికలను నిరాకరించటం, స్వదేశీని, జాతీయతను తిరస్కరించటం – ఇవన్నీ దాని సామ్రాజ్య తత్వంలో భాగమే. బాధ్యత లేని ప్రభుత్వానికి తన కిష్టమైన పనులు చేయటానికి కూడా అధికారముండదు. బయటి శక్తులు వత్తిడి చేసినపుడు దాని అధికారం పరిమితమవుతుంది. అది కొన్ని పనులు చేయగలిగినా అవి అధికార పీఠాన్ని కదిలించేవైతే ఆ పనులు చేయటానికి సాహసించదు. రోమన్ ప్రజలు పూజలు జరుపుకోవటాన్ని సీజర్ మార్చే సాహసం చేయడు. ఆధునిక పార్లమెంట్ వలసలమీద పన్నులు వేయాలని ఎంతగా వున్నా వేయదు. ఇదే కారణంగా, భారత ప్రభుత్వం కుల వ్యవస్థను రద్దు చేయదు. ఒక భర్తకు ఒకే భార్య సూత్రాన్ని అమలు చేయదు. వారసత్వ చట్టాలను మార్చదు. కులాంతర వివాహాలను చట్టబద్ధం చేయదు. తేయాకు సాగుమీద పన్నువిధించదు.

వర్తమాన సాంఘిక జీవితంలో ప్రభుత్వం జోక్యం చేసుకోకుండా ప్రగతి సాధ్యం కాదు. ప్రజా ప్రభుత్వం, ప్రగతి పథం వేరు వేరు కాదు. విధేయత ఎక్కడ అంతరించి తిరుగుబాటు ఎక్కడ మొదలవుతుందో తెలిసినంతగా, ప్రజల నాడి ఏమిటో బ్రిటిష్

ప్రభుత్వానికి తెలీదు. దీని ఫలితంగానే ఈ రెండు పరిమితుల మధ్య ప్రభుత్వ యంత్రాంగం చచ్చుబడిపోయింది. ఈ స్వభావం వల్లే, ఏ అభివృద్ధి కార్యక్రమం చేపట్టినా కొంతమేరకు మాత్రమే ప్రభుత్వం అమలు చేయగలుగుతుంది. ఈ పద్ధతిలో భౌతికంగా కొంచెం ప్రగతి సాధించిన మాట వాస్తవమే అయినా, ప్రపంచంలోని ప్రజలెవ్వరూ శాంతిభద్రతల సమస్య లేదనే కారణంగా మూగ జీవుల్లా పడి వుండరు. రోడ్లు బాగు చేసిందనో శాస్త్రీయ పద్ధతుల్లో కాలువలు నిర్మించారనో రైలు, తంతి తపాలా సౌకర్యాలు పెంచిందనో, భూగోళ, ఖగోళ, వైద్య శాస్త్రాల్లో ప్రగతి సాధించిందనో అంతర్గత కలహాలను ఆపు చేసిందనో ప్రజలు అధికార యంత్రాంగాన్ని సమర్థించే మూర్ఖులు కారు. ప్రజలు ఎంత శాంత స్వభావులైనా, కేవలం సమర్థవంతంగా పనిచేసే యంత్రపరికరంలాంటి ప్రభుత్వం కన్నా ఉన్నతమైన ప్రభుత్వాన్నే కోరుకుంటారు.

భారత దేశంలోని ప్రజలు రాజకీయ, ఆర్థిక, సామాజిక స్వేచ్ఛను కోరుకున్నారు. బ్రిటిష్ ప్రభుత్వానికి వీటిని సృష్టించటం ఇష్టం లేదు.

"దీని ఫలితంగా, ప్రజల నైతిక, సామాజిక జీవితానికి సంబంధించినంత వరకు, ప్రభుత్వం మొఘల్ సామ్రాజ్యం నుండి బ్రిటిష్ సామ్రాజ్యానికి మారింది. అంటే, మారింది పాలకులే తప్ప వ్యవస్థ కాదు. జోక్యం చేసుకోకపోవటం అనేసూత్రం బ్రిటిష్ ప్రభుత్వానికి  ముఖ్యమేకాదు అవసరం కూడా. దీనివల్ల ప్రజలకు గత చరిత్రకూ ఇప్పటి పరిస్థితులకూ మధ్య తేడా ఏమీ కనిపించలేదు. రాజకీయ కోణం నుండి చూస్తే, ఒకనిరంకుశత్వానికి బదులు మరో నిరంకుశత్వం వచ్చింది. బ్రిటిష్ వాళ్లు తమకు కనిపించిన వ్యవస్థను[1] ఒక చైనా దర్జీవాడు నమూనా కోసం ఇచ్చిన పాత కోటులాగే కొత్త కోటును కూడా అవే చింపులు, మాసికలతో అచ్చం అలాగే కుట్టినట్టు[2] - అదే విధంగా నమ్మకంగా రక్షించారు.

మత విషయాల్లో ప్రభుత్వం జోక్యం చేసుకోరాదనే విధానాన్ని అర్థం చేసుకోగలిగినా, అంటరానివాళ్లకు సంబంధించినంత వరకు అది పొరపాటు అవగాహన. హిందువులే అంటరానివాళ్లను మనషులుగానూ వారి హక్కులనూ గుర్తించటం వల్ల మాత్రమే వాళ్లు ఉద్ధరించబడతారని అనుకున్నా, సమస్య అంతటితో తీరదు. వారి హక్కులకు గుర్తింపు తేవటం ఎలా అనే ప్రశ్న అలాగే మిగిలిపోతుంది. ఈ లక్ష్యం నెరవేరటానికి రెండే దారులున్నాయి. ఒకటి, అతడిని గౌరవనీయుడిగా తీర్చిదిద్దటం, రెండు అతడినీ అతడి హక్కులనూ అగౌరవ పరిచే వారిని శిక్షించటం. మొదటి పద్ధతిలో, అతడికి విద్యాబుద్ధులు నేర్పి అతడిని ఒక అధికార స్థానంలో నియమించాల్సిన బాధ్యత వుంటుంది. రెండో పద్ధతి, అంటరానితనాన్ని శిక్షించతగిన

1. బర్మాను జయించిన రోజున ఎన్నికల పన్ను వుండటం వల్ల దాన్ని అలాగే కొనసాగించారు.
2. బెర్నార్డ్ హూటన్ "బ్యూరోక్రటిక్ గవర్నమెంట్"

నేరంగా పరిగణించి సాంఘిక సంస్కరణ చేపట్టటం. బ్రిటిష్ ప్రభుత్వం ఈ రెండింటిలో ఏ పని చేయటానికీ సిద్ధంగా లేదు. ప్రభుత్వ సర్వీసుల్లో అంటరానివాళ్లకు అది ప్రాధాన్యత ఇవ్వదు. హిందూ సమాజాన్ని సంస్కరించే బాధ్యత తీసుకోదు. దీని ఫలితంగా, అంటరానివాడు బ్రిటిష్ ప్రభుత్వానికి పూర్వం ఎలా వున్నాడో అదే అంటరానివాడుగానే మిగిలిపోయాడు.అతడు పౌరుడే కానీ అతనికి పౌరునికుండే హక్కుల్లేవు. అతడు చెల్లించిన పన్నులతో నడిచే పాఠశాలల్లో అతని పిల్లలకే ప్రవేశం లేదు. అతడు చెల్లించిన పన్నులతో తవ్వించిన బావుల నుండి నీళ్లు తెచ్చుకునే హక్కు అతనికి లేదు. అతడు చెల్లించే పన్నులతో నడిచే ప్రభుత్వంలో ఉద్యోగిగా అతనికి స్థానం లేదు. అతను పాలితుడే కాని పౌరుడు కాదు.

అంటరానివాడికి నీళ్లు, విద్య అవసరమయ్యాయి. తనను తాను రక్షించుకోవటానికి ఒక ఉద్యోగం అవసరమైంది. పేదరికం కారణంగా పన్నుల మినహాయింపు అవసరమైంది. ఇవేవీ నెరవేర్చకుండా అన్నీ తలకిందులు చేశారు. మిగతా కులాల చదువుకోసం, ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే వాళ్ల జీతాలకోసం అంటరానివాళ్ల మీద పన్నులు వేశారు.

అంటరానివాళ్లకు బ్రిటిష్ ప్రభుత్వం చేసిన మేలు ఏమిటి? విద్యలోనా? ఏమీలేదు. ఉద్యోగంలో - లేదు. హోదాలో - లేదు. వాళ్లు సాధించింది ఒక్కటే - చట్టం దృష్టిలో సమానత్వం. నిజానికి ఇందులో ప్రత్యేకత ఏమీ లేదు. చట్టం ముందు అంతా సమానమే అని అందరికీ తెలిసిందే. ఇందులో చెప్పుకోతగ్గ విశేషం, గొప్పదనం కూడా ఏమీ లేవు. ఎందుకంటే, అధికార స్థానంలో వున్నవారు తమ అధికారాన్ని ఉపయోగించి, ఈ సమానత్వ సూత్రం వల్ల వచ్చే లాభాలను అంటరానివాళ్లకు అందకుండా చేస్తారు. ఇంత చేసినా, బ్రిటిష్ ప్రభుత్వానికి పూర్వం సమానత్వం అన్న మాటే లేదు కాబట్టి, ఆ మేరకు ఇది అంటరానివాళ్లకు కలిగిన ప్రత్యేక ప్రయోజనమే. అంతకు ముందున్న మనుధర్మం సమానత్వ సూత్రాన్ని గుర్తించలేదు. మను ధర్మానికి అసమానత్వమే ఆత్మ. ఆ అసమానత్వమే అన్ని జీవన విధానాలలో, సామాజిక సంబంధాలలో, అన్ని ప్రభుత్వ శాఖలలోనూ వ్యాపించింది. అది గాలిని కూడా మైలపరిచి అంటరానివాళ్లను బాధించింది. చట్టం ముందు అందరూ సమానమే అనే సూత్రం ఒక గొప్పవ్యాధి నిరోధకంగా పని చేసింది. అది గాలిని శుభ్రం చేసి అంటరానివాడు స్వేచ్ఛగా గాలి పీల్చుకోవటానికి అనుమతించింది. ఇది అంటరానివాడికి నిజంగా జరిగిన మేలు. గత చరిత్రతో పోలిస్తే ఇది చిన్నదేమీ కాదు.

**డా॥ బి.ఆర్. అంబేద్కర్** ఈ దేశ అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీక. ఆయన రాసిన ఈ పుస్తకంలో బ్రిటిష్ పాలనలో, 'చట్టం ముందు అందరూ సమానమే' అనే విషయంలో తప్ప, దళితులకు మరే యితర న్యాయమూ జరగలేదని ఎన్నో ఆధారాలతో ఆయన చేసిన వాదన పాఠకులను కట్టిపడేస్తుంది.

బ్రిటిష్ వాళ్ళు ఈ దేశాన్ని ఆక్రమించుకోవటానికి, అధికారం నిలబెట్టుకొని పరిపాలించడానికి అంటరానివాళ్ళ సహాయం తీసుకొని ఆ తర్వాత వారిని నిర్లక్ష్యం చేశారు. ప్రభుత్వ సర్వీసు, విద్య, సాంఘిక సంస్కరణల విషయంలో వాళ్ళు అమలుచేసిన విధానాలు, అగ్రవర్ణాలపట్ల చూపిన పక్షపాత వైఖరిని కూడా ఇది తేటతెల్లం చేస్తుంది.

ఆధునిక విద్య, ఉపాధి రంగాల్లో ప్రతిభ, కులం వలసపాలకుల చేతిలో అవసరానికి తగినట్టు రంగులు మారుస్తూ కింది కులాలకు అవకాశాలు లేకుండా చేశాయి. కేవలం పుట్టుకను బట్టి మనిషి అర్హతను నిర్ణయించిన వలస ప్రభుత్వం అసలు ప్రజా ప్రభుత్వం ఎలా అవుతుందని అంబేద్కర్ సూటిగా ప్రశ్నిస్తారు. అంటరానితనం దేశమంతా అమల్లో వున్నా, ఆధునికులమూ నాగరికులమూ అని చాటుకునే బ్రిటిష్ పాలకులు ఈ సమస్యపై ఒక్క సాంఘిక చట్టమూ తీసుకొని రాలేదు. పైకి దళితులకు అనుకూలంగా మాట్లాడినట్టు కనిపించినా, సారాంశంలో కులతత్వం ఈ దేశంలో మరింతగా వేళ్ళూనుకునేట్టు చేసిన బ్రిటిష్ కుటిల రాజనీతిని ఆయన బట్టబయలు చేశారు.

అనువాదకులు **యాజ్ఞి** అలంపూరు (మహబూబ్‌నగర్)కు చెందినవారు. ఆయనకు 'అధికారం-విస్మృతి' ఇష్టమైన అంశం. దీనిలో భాగంగానే కర్నూలు జిల్లాలో 'జానపద కథనాల'కు సంబంధించిన సమాచారం సేకరిస్తున్నారు.